డిటెక్టివ్

# ది కర్స్ ఆఫ్ కుంగ్ ఫూ!


## మధుబాబు




**INDEPENDANCE DAY GREETINGS TO OUR WELL WISHERS**

**HARVINS CONSTRUCTIONS PVT. LTD.**

8-3-322/H, Road No.3
Banjara Hills,
Hyderabad-500 034
Phones : Off : 3319966, 3328090,
Res : 3608789
Fax : 3325447, 3357202



ఆయాసం ముంచుకు వచ్చేసింది గంగారాంకి. అడుగులు తడబడటం మొదలుపెట్టాయి.

అయినా సరే ఆగలేదతను. శరీరంలో మిగిలి ఉన్న శక్తినంతా పాదాల్లోకి రప్పించుకుంటూ పరుగు తీశాడు.

పది నిమిషాల తరువాత ఖర్చయిపోయింది ఆ ఓపిక కూడా.

ముందుకు తూలి నేలను కౌగలించుకోవటంకంటే మరో మార్గం ఏదీ లేదనిపిస్తుండగా, వర ప్రసాదం మాదిరి ఎదుట ప్రత్యక్షమయిందా వాగు!

బర్మాదేశానికి ఈశాన్యభాగంలో ఉండే అబుటూ కొండల్లో పుట్టి, కాకులు దూరని కారడవులెన్నింటినో దాటుకుంటూ ఉరుకులు పరుగుల మీద వస్తున్నదది. ఒడ్డున ఉన్న బండలకు తగిలి ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి అలలు. తెల్లటి నురగల్ని నలుదిక్కులకు వెదజల్లుతున్నాయి.

పదునైన బరిశెల మాదిరి నీటిపైకి పొడుచుకువస్తున్నాయి వాగు మధ్యభాగంలో ఉండే కొండరాళ్లు. తమ దగ్గరకి వచ్చిన ఏ ప్రాణినైనా సరే చీల్చి చెండాడనికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి.

పట్టిన పట్టు వదలకుండా వెంటబడి వచ్చేస్తున్న బర్మీస్ మిలటరీ గార్డులకు పట్టుబడటంకంటే, ఆ రాళ్లకు కొట్టుకుని ప్రాణాలు వదలటమే మంచిదని అనిపించింది గంగారాంకి.

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుని, నీటిలోకి దిగబోతుండగా అవతలి ఒడ్డున ఉన్న వెదురు పొదల దగ్గర అగుపించింది అతనికి ఒక కదలిక.

నీటిమీదకి వాలి ఉన్న ఆ పొదల్ని చాటు చేసుకుని వేటాడటానికి సిద్ధంగా ఉన్నాయి పాతిక అడుగుల పొడవుండే బర్మా మొసళ్లు రెండు!

ముందు కడుగువేస్తే జరగబోయేది ఏమిటో తలుచుకునేసరికి విపరీతమైన దాహం వేస్తున్నట్టు ఎండుకుపోయింది గంగారాం గొంతు. చన్నీటితో స్నానం చేసినట్టు చెమటలతో తడిసిపోయింది ఒళ్లు.

అదే సమయంలో వాగు సమీపంలోకి వచ్చేశారు అతన్ని వెంటాడుతున్న మిలటరీ గార్డులు.

"పట్టుకోండి ... వాగుని దాటి అవతలికి పారిపోకముందే వాడిని పట్టుకోండి!" ఖంగుమంటూ వినవచ్చింది వారిని లీడ్ చేస్తున్న సార్జెంట్ కంఠం.

'నువ్వు అరిచి గీపెట్టుకున్నా సరే ... నేను అవతలి పక్కకు పోవటం కుదరదు భాయ్! కావాలంటే నువ్వే వెళ్లు అవతల పక్కకి!' అనుకుంటూ ఒడ్డుమీద ఉన్న బండల్లో నుంచి సిమెంట్ బస్తా సైజులో ఉన్న రాయిని ఎంతో ప్రయత్నం మీద పైకి ఎత్తాడు గంగారాం. ఊపిరి బిగపట్టి వాగు మధ్యభాగంలో విసిరేశాడు. బురదతో మలినమైన చేతుల్ని పాంటుకే రుద్దుకుంటూ పాతిక అడుగుల దూరంలో కనిపించిన ఒక సిల్గీ పొదచాటుకు జంప్ చేశాడు.

గిరగిరాలు తిరుగుతూ పోయి నీటిని తాకింది అతను విసిరి రాయి. బరువైన మనిషి ఎవరో హడావుడిగా నీటిలోకి దూకిన ఎఫెక్ట్‌ని క్రియేట్ చేసింది.

గొల్లున అరిచారు అల్లంత దూరంలో నుంచి ఆ శబ్దాన్ని విన్న మిలటరీ గార్డులు.

"దూకండి...! నీటిలోకి దూకి ఆ దుర్మార్గుడిని పట్టుకోండి! దూకండి!" అరిచి అరిచి జీరపడిన కంఠంతో అందర్నీ హెచ్చరిస్తూ బాణంలా దూసుకువచ్చేశాడు సార్జెంట్.

తమ చేతుల్లో ఉన్న రైఫిల్స్‌ని కిందికి వదిలి నీటిలోకి దుమికేందుకు బయలుదేరారు ఇద్దరు గార్డులు.

వేపాకులు నమిలిన సెన్సేషన్ వెంటనే ఆవరించుకున్నది గంగారాంని.

మోకాలి లోతును దాటి మరో నాలుగు అడుగులు వేసిన మరుక్షణం గల్లంతయిపోతారు ఆ గార్డులు.

మహదానందంగా మీదకి వచ్చేస్తాయి, అవతలివైపు సిద్ధంగా ఉన్న మొసళ్లు. ఊపిరి తీసుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా అట్టడుగుకు లాక్కుపోయి విందులు చేసుకుంటాయి.

తన ఉనికిని పసికడితే పిశాచాల మాదిరి వచ్చేస్తారని, కాళ్లూ, చేతులూ విరగదీసి తమ హెడ్‌క్వార్టర్స్‌కి లాక్కుపోతారని తెలిసి కూడా ఆగలేకపోయాడతను.

'ఎదుటి వాళ్ల బాధల్ని, బరువుల్ని చూసి చూసి జాలితో ద్రవించిపోవటం చాలా ఎక్కువ అయిపోయింది ఈమధ్య! ద్రవించి ద్రవించి ఆవిరైపోవటం డెఫినెట్!' అనుకుంటూ ఎదుట కనిపించిన ఒక పలుకురాయిని చేతిలోకి తీసుకున్నాడు. గుండెలనిండా ఊపిరి పీల్చుకుని బలంగా విసిరేశాడు అవతలి ఒడ్డున ఉన్న వెదురు పొదల దగ్గరకి.

అయాచితంగా లభిస్తున్న ఆహారాన్ని చూసి లొట్టలు వేయాలనిపించింది కాబోలు, నోటిని తెరిచి ముందుకు కదలబోతున్నది ఒక మొసలి. సూటిగా పోయి దాని ముట్టె పైభాగానికి తగిలింది పలుకురాయి.

భరించరాని బాధతో వికృత శబ్దాలు చేస్తూ నిట్టనిలువుగా పైకి లేచిందా జలచరం. తోకతో నీటిని బాదింది.

అదిరిపడి వెనక్కి దూకారు నీటిలోకి ప్రొసీడ్ అవుతున్న గార్డులు. భయంతో వణికిపోతూ ఇవతలికి వచ్చేశారు.

మొసళ్లను చూసిన ఖంగారులో గార్డుల్ని లీడ్ చేస్తున్న సార్జెంట్ మెంటల్ వచ్చినట్లు చిందులు తొక్కుతాడని, తన బెల్టుకు బిగించి ఉన్న రివాల్వర్‌ను తీసి కాల్పులు జరపటంలో బిజీ అయిపోతాడని అనుకున్న గంగారాం అంచనాలన్నీ తల్లక్రిందులు అయిపోయాయి ఒక్కసారిగా.

ఒడ్డును వదిలి గబగబా వెనక్కి జరగటం తప్ప, ఇంకేవిధమైన ఆందోళననూ ప్రదర్శించలే దతను.

"సామాన్యుడు కాదు, మనల్ని ఈ తుప్పల్లో గిరికీలు కొట్టిస్తున్న దుర్మార్గుడు! గుడ్డిగా వాగులోకి దూకి, ఆ భయంకర జీవులకు ఆహారం అవుతాడంటే పొరపాటున కూడా నేను నమ్మను! నీటిలో దూకినట్లు నటించి, ఈ చుట్టుపక్కలే దాక్కొని ఉంటాడు. వెతకండి!" అని ఆర్డర్ ఇస్తూ ముందుకు కదిలాడు.

తన గుట్టు ఏ క్షణంలోనైనా రట్టు కాక తప్పదని గ్రహించి, మరో పలుకురాయిని అందుకున్నాడు గంగారాం.

'వద్దు వద్దని అనుకుంటూనే మీ ప్రాణాలు కాపాడటం నేను చేసిన ఆఖరి తప్పు. ఇకముందు ఇటువంటి పొరపాట్లు చేయనని హామీ ఇస్తున్నాను...' అనుకుంటూ పొదలో నుంచి బయటికి వచ్చాడు.

"అడుగో.... అడుగడుగో!" తాషా మార్ఫా మాదిరి కీచుకంఠంతో అరిచాడు అతన్ని గమనించిన ఒక గార్డు.

అతన్ని కొట్టలేదు గంగారాం. ఆ అరుపును విన్న మరుక్షణం తల తిప్పుతున్న సార్జెంట్ ముఖానికి గురిచూశాడు.

గద్దముక్కు మాదిరి లావుగా, బలంగా ఉంటుంది సార్జెంట్ నాశిక ... గింగిరాలు తిరుగుతూ వచ్చిన పలుకురాతి దెబ్బకు రెండుగా విచ్చిపోయిందది.

"పట్టుకోండిరోయ్... ఆ దుర్మార్గుడిని పట్టుకోండి! ముఖం పగలగొట్టి నా దగ్గరకి తీసుకురండి... పట్టుకోండి!" విపరీతమైన బాధతో వణికిపోతూ గొంతు చించుకుని అరిచాడతను.

పట్టుబడే ఉద్దేశ్యం కానీ, ముఖం పగలగొట్టించుకునే కోరికగానీ తనకు లేకపోవటం వల్ల, క్షణం కూడా ఆలస్యం చేయకుండా పిక్కబలం చూపించాడు గంగారాం.

అడ్డువచ్చిన పొదలమీదనుంచి ఎగిరెగిరి దూకుతూ, అధిగమించటానికి వీలుపడని బండరాళ్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ పరుగెత్తాడు.

అలుపు, ఆయాసం అనే మాటలకు అర్థం తెలియనట్లు అతన్ని వెంటాడారు గార్డులు. సూర్యుడు పడమటి దిశకు మరలబోతున్న సమయంలో హఠాత్తుగా ఆగిపోయారు.

పట్టుదల సడలిపోవటం వల్లనే అలా ఆగిపోయారని అనుకున్నాడు గంగారాం. పాదాల్లోని శక్తి సన్నగిల్లిపోవటం వల్ల నిలబడిపోయారని భావించాడు.

"పోలీసులతో పరుగు పందాలు వేసి వేసి తల పండిపోయిన ఈ గంగారాం సాబ్‌ని వెంబడించడం మీవంటి లఫూట్లవల్ల అవుతుందా? పొండిరా సన్నాసుల్లారా... పోయి, మీ పాదాలకి వేడినీళ్లతో కాపడాలు పెట్టుకోండి!" నోటి దగ్గర చేతులు చేర్చి బిగ్గరగా వెక్కిరించాడు వారిని.

ఆగ్రహించలేదు వాళ్లు. తమ ఆయుధాల్ని గురిపెట్టి కాల్పులు జరపటానికి కూడా ప్రయత్నించలేదు. అతని మాటలు తమకు వినబడనట్టు వెనక్కి తిరిగారు.

విపరీతమైన ఆశ్చర్యంతో అలాగే చూస్తూ ఉండిపోయాడు గంగారాం.

పది కోట్లు విలువ చేసే బర్మా ముత్యాలను కస్టమ్స్ అధికారులకు కనిపించకుండా బోర్డర్స్ దాటించడానికి ప్రయత్నించాడతను. కచికూ ఏరియాలోని మిలటరీ కంటోన్మెంట్ సమీపంలో కాలు విరిగి క్రిందపడిపోయింది సరుకును మోసుకువస్తున్న గుర్రం. బాధను భరించలేక పెద్దగా సకిలించింది.

నీతికి నిజాయితీకి మారుపేరైన మిలటరీ అధికారి కల్నల్ అకూరా ఆధిపత్యం వహిస్తున్నాడు కచికూ కంటోన్మెంట్‌కి.

సరుకునంతా స్వాధీనం చేసుకోవటమే కాకుండా, ఫైరింగ్ ఆర్డర్స్‌తో సైనికుల్ని ఉసికొల్పాడు..

ఆర్డర్స్ ఇవ్వటమంటూ జరిగితే అవి అమలు జరిగేటంతవరకూ నిద్రపోడని పెద్ద పేరు కల్నల్ అకూరాకి. తన సైనికుల్ని కూడా నిద్రపోనీయడని ప్రతీతి.

అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు ఈ సైనికులు. తమకు కావాల్సిన బద్మాష్ కళ్ల ఎదుట ఉండగానే వెనక్కి వెళ్లిపోతున్నారు.

క్షణాలు గడిచినకొద్దీ పెరిగి పెద్దదైపోతున్న సందేహాన్ని భరించటం అసాధ్యమైంది గంగారాంకి.

"ఎక్కడో ఏదో తిరకాసు ఉన్నది ... అదేమిటో తెలుసుకోకుండా అవతలికి పోవాలని అనుకోవటం తెలివితక్కువతనం అనిపించుకుంటుంది!" ఒక టిప్మే పొదమీద కనిపించిన లావుపాటి ఊసరవెల్లితో అంటూ తన చుట్టూ ఉన్న పరిసరాల్ని జాగ్రత్తగా పరిశీలించటం మొదలుపెట్టాడతను.



అతని కదలికలు భయాన్ని కలిగించాయి కాబోలు, టిప్మీ పొద మీద నుంచి అవతలికి దూకిందా ఊసరవెల్లి... పాతిక అడుగుల దూరంలో ఉన్న ఒక వెదురు గుబురువైపు పరుగెత్తింది.

పది అడుగుల దూరం కూడా పోకముందే బ్రేకులు పడ్డాయి దాని పాదాలకి. ఎట్ట ఎదుట ఏదో తాచుపాము కనిపించినట్లు అదిరిపడి పక్కకి తిరిగింది.

ఝల్లుమన్నాయి ఆ దృశ్యాన్ని చూసిన గంగారాం గుండెలు.

ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదతను. గిరుక్కున వెనుతిరిగి పారిపోవటానికి ప్రయత్నం చేశాడు.

పది అడుగులు మాత్రమే వేయగలిగాడతను. పదకొండో అడుగు వేస్తూ ఉండగానే రివ్వుమని శబ్దం చేస్తూ వచ్చి, అతని మీద పడింది అడవి తీగెలతో అల్లబడిన మందపాటి వల ఒకటి.

పాంటు జేబులో ఉండే స్ప్రింగ్ నైఫ్‌ని బయటకు లాగటానికి ట్రై చేశాడు గంగారాం. ఆ పరిసరాలన్నీ దద్దరిల్లిపోయేటట్లు అరవటానికి కూడా చూశాడు.

ఆ పనులు రెండూ ఆచరణలోకి రాకముందే కొరివి దయ్యాల మాదిరి అతనిముందు ప్రత్యక్షం అయ్యారు పాతికమంది ఆటవికులు.

జంతు చర్మాలను ధరించి, జీబురు తలలతో, బవిరి గడ్డాలతో భీకరంగా అగుపిస్తున్న ఆ శాల్తీల్ని చూసేసరికి దాహం వేస్తున్నట్లు ఎండుకుపోయింది అతని గొంతు. కల్నల్ అకూరా అనుచరులు ఎందుకలా అర్ధాంతరంగా వెనక్కి పారిపోయారో తెలిసివచ్చింది.

"బుద్ధి గడ్డితిని ఈ ప్రమాదంలో చిక్కుబడ్డాను. తెలివితేటల్లో నన్ను మించిన వాడు లేడనే గర్వంతో ముందూ వెనుకలు చూసుకోకుండా పరుగెత్తుకువచ్చి పట్టుబడిపోయాను. తల్లీ, కలకత్తా కాళీ! ఈ ఒక్కసారికీ దయచూడు... నాలుగు వేటల్ని, ఎనిమిది పుంజుల్ని బలి ఇప్పిస్తాను నీకు!" అంటూ ప్రార్థన మొదలుపెట్టబోతూ ఉండగా, తమ దగ్గర ఉన్న లావుపాటి చెట్టుకొమ్మలతో ఎటాక్ చేయనేచేశారు ఆ ఆటవికులు.

ఏం జరుగుతున్నదో అర్థమయ్యేలోపుగానే మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడు. స్పృహను కోల్పోయి తల వాల్చేశాడు.

***

"మై గాడ్! గంగారాం మాయమైపోయాడా? వారం రోజులనుంచి అడ్రసులు తెలియటంలేదా?" ఉలిక్కిపడి సోఫాలోనుంచి లేస్తూ అడిగాడు షాడో.

తల వంచుకుని నేల చూపులు చూస్తూ నిలబడిపోయాడు అస్సాం నుంచి ఆదరాబాదరాగా వచ్చిన గంగారాం సెక్రటరీల్లో ఒకతను.

"కచికూ కంటోన్మెంట్‌కి అధికారి అయిన కల్నల్ అకూరా పర్సనల్ సెక్రటరీ ఒకతన్ని పాతికవేలు లంచం ఇచ్చి పట్టుకున్నాం సాబ్! జరిగింది ఏమిటో అతని ద్వారా తెలుసుకున్నాం!" అన్నాడు జరిగింది ఏమిటో వివరంగా చెప్పిన తర్వాత రెండో సెక్రటరీ.

"పది కోట్లు విలువ చేసే సరుకు మిలటరీ వాళ్లకు దొరికిపోయినందుకు మనం బాధపడవలసిన పని లేదు, రాజా సాబ్! ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకవిధంగా ఆ నష్టాన్ని మనం భర్తీ చేసుకోవచ్చు..." అతని మాటలు ముగిసిన వెంటనే అందుకున్నాడు మూడో సెక్రటరీ.

"సరుకును పోగొట్టుకున్న వెంటనే బోర్డర్స్ దాటి మన దేశంలోకి వచ్చేయ్యాల్సిన గంగారాం సాబ్, ఇంతవరకూ పత్తా లేకపోవటమే మాకు అనుమానాన్ని కలిగిస్తోంది. మిలటరీ గార్డుల్ని తప్పించుకోవటానికి మామూలు అడవి దాటి మహిమాకో అరణ్యాల్లోకి అడుగుపెట్టడం జరిగిందేమోనని భయంగా ఉన్నది!" అంటూ అసలు విషయాన్ని మెల్లగా బయటపెట్టాడతను.

ఒక్క మాట కూడా ఎదురు పలకకుండా వాళ్లు చెప్పినదంతా మౌనంగా విని, పనామా పొగల్ని రింగులు రింగులుగా సీలింగ్ మీదకి పంపుతున్న షాడోని గమనించి ఇబ్బందిగా తల విదిలించాడు శ్రీకర్.

నాగరికత అనే మాటకు అర్థం తెలియని ఆటవిక మూకలు నివసించే ప్రదేశం ఆ మహిమాకో అరణ్యం. అందులోకి అడుగుపెట్టిన తర్వాత ప్రాణాలతో ఇవతలికి తిరిగి రావటం అసంభవమని బర్మాదేశంలో ఎవరిని అడిగినా వెంటనే చెపుతారు.

ప్రాణంలో ప్రాణమైన గంగారాం అటుకేసి వెళ్లాడని తెలిసిన తర్వాత చేతులు ముడుచుకుని కూర్చుంటాడా గురువుగారు?

సిబిఐ హెడ్‌క్వార్టర్స్‌కి కబురు పంపి, ఇన్ఫర్మేషన్ డిపార్ట్ నుంచి మహిమాకో అరణ్యాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెప్పించుకోవటం చాలా మంచిదని అనిపించింది అతనికి.

నాలుగు అడుగుల దూరంలో ఉన్న టెలిఫోన్‌వైపు తిరగబోతుండగా వినవచ్చింది ఒక విచిత్రమైన శబ్దం. అవతలి పక్కనే ఉన్న బెడ్‌రూమ్‌లో నుంచి.

ఫోన్‌ని అందుకోవాలన్న ఆలోచనను అర్జంట్‌గా విరమించుకుని అటుకేసి పరుగెత్తాడతను.

"చిన్న గురువుగారు నిద్ర లేచినట్లున్నారు ... ఇప్పుడు వినిపించిన శబ్దం వారు బెడ్ మీద నుంచి దొర్లి క్రింద పడటం వల్ల ఉద్భవించిందే... సందేహం లేదు!" అంటూ బెడ్‌రూమ్ ద్వారంలోకి వెళ్లి లోపలికి తొంగి చూశాడు.

మెలకువ రాగానే అందరి పిల్లల మాదిరి అరవటం, ఏడ్చి రాగాలు తీయటం మొదలైన పనులు చేసే అలవాటు మాస్టర్ షాడోకి లేదు.

అటూ ఇటూ అడ్డంగా పెట్టిన తలగడల మీదనుంచి దబుక్కున దొర్లి క్రిందపడ్డాడు. తల నేలకు పొడుచుకుని ఖంగుమని శబ్దం చేసినా, అప్పటికప్పుడు నిమ్మకాయ సైజు బుడిపె ఒకటి నెత్తి వెనుక ప్రత్యక్షం అవుతున్నా లెక్కచేయకుండా గుడ్లు మిటకరించి చూస్తున్నాడు.

శ్రీకర్ కంటే నాలుగు అంగలు ముందుగా బెడ్‌రూమ్‌లోకి పోయి బిడ్డడిని గుండెలకు హత్తుకున్నది బిందు.

"ఆ పెద్దమనిషిని బెడ్‌మీద పడుకోబెట్టటం తప్పు, సిస్టర్!మంచి బెడ్‌షీటు ఒకటి పరిచి క్రిందే ఉంచేయటం బెటర్!" కంగారు పడవలసిన అవసరం లేదని గ్రహించి తాపీగా వెనుతిరుగుతూ సలహా ఇచ్చాడు శ్రీకర్.

"పడుకోబెట్టి అరగంట కూడా కాలేదు. ఏ కొంప మునిగిపోతోందని అప్పుడే లేచి కూర్చున్నావ్?" మాస్టర్ షాడో ముఖంలోకి చూస్తూ కోపంగా అడిగింది బిందు.

మాటలు ఇంకా రాలేదు ఆ బుడతడికి. ఆమె పమిట చెంగును పట్టుకుని విచిత్రమైన శబ్దాలు చేశాడు. ఆ భాష బాగా వచ్చు బిందుకి.

"నువ్వు బకాసురుడి అంశతో జన్మించావని నాకు ఎప్పుడో అర్థమైంది. అరగంటకు ఒకసారి పాలిచ్చే ఓపిక నాకు లేదు. కావాలంటే ఒక అరటిపండు ఇస్తాను ... శుభ్రంగా తిని, హాయిగా ఆడుకో!" కోపంగానే అంటూ అతగాడిని క్రిందకు దించి సువాసనలు వెదజల్లుతున్న అరటిపండు ఒకదాన్ని కిచెన్‌లోనుంచి తెచ్చి చేతికి ఇచ్చింది. అక్కడితో అతన్ని గురించి మర్చిపోయిందామె.

స్టౌవ్ మీద మరుగుతున్న చాయ్‌ని చక్కని పింగాణీ కప్పుల్లో నింపి

డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకుపోయింది.

మెత్తటి సోఫాలు పక్కనే ఉన్నా పొరపాటున కూడా కూర్చునే ప్రయత్నం చేయలేదు గంగారాం సెక్రటరీలు.

అరమూసిన కనులతో తీవ్రంగా ఆలోచిస్తున్న షాడోకేసి చూస్తూ చేతులు కట్టుకుని నిలబడి ఉన్నారు.

"స్థిమితంగా కూర్చుని చాయ్ తాగండి!" చాయ్ కప్పుల్ని వారికి అందిస్తూ అన్నది బిందూ.

వినయంగా తలలు వంచుకున్నారు వాళ్లు. నిలబడే చాయ్‌ని సిప్ చేయటం మొదలుపెట్టారు.

సిఐబి హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ చేశాడు శ్రీకర్. అవతలి పక్కనుంచి వినవచ్చిన శబ్దాల్ని ఆలకించిన మరుక్షణం, పెదవి విప్పి ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఠక్కున పెట్టేశాడు రిసీవర్‌ని.

"రిసెప్షన్ రూమ్‌లోనే ఉన్నారు బాస్ ... కర్ణపిశాచిని ఊపాసిస్తూ ఉండటం వల్ల మనం చేయబోయే పనుల్ని గురించి ముందుగానే ఆయనకు తెలిసిపోతున్నదని నా అనుమానం!" తన చేతలకు అర్థాన్ని బిందూకు వివరిస్తూ తల పక్కకి తిప్పి, చెవులు రిక్కించాడు.

"ఏమిటా పిచ్చివేషాలు? నీకేమైనా మతిపోయిందా?" షాడో పక్కన కూర్చుంటూ చిరుకోపంతో అడిగింది బిందూ.

"అరటిపండు గుజ్జును ముఖానికి, బెడ్‌రూమ్‌లో ఉన్న ఫర్నిచర్‌కి పట్టించి సంబరపడుతూ ఉండాలి మన చిన్న గురువుగారు ... అటువంటి శబ్దాలు ఏవీ వినిపించటంలేదు ...!" అంటూ సోఫాలోనుంచి లేచి బెడ్‌రూమ్ వైపు బయలుదేరాడు.

రాత్రి, పగలు తేడా లేకుండా మాస్టర్ షాడోని కనిపెట్టుకుని ఉండే జాజీ, పెడ్రోలను మెడికల్ చెకప్‌కోసం హాస్పటల్‌కు పంపించింది బిందు ఆ రోజు. ఆ పని చేయకుండా ఆ డాక్టర్‌నే బంగ్లాకి రప్పించి ఉంటే బాగుండేదని అనుకుంటూ అలాగే కూర్చున్నది.

"హల్లో, చిన్నగురువుగారూ! ఎక్కడ ఉన్నారు మీరు?" అని పలకరిస్తూ బెడ్‌రూమ్‌లోకి తొంగి చూశాడు శ్రీకర్.

లోపల కనిపించలేదతనికి చిన్న గురువుగారు. బెడ్‌కి ఆవలివైపున ఓరగా వేసి ఉన్న తలుపుల్ని తెరిచి, బయటికి వెంచేశారు.

"మిగలపండిన అరటిపండును చేతుల్లో పట్టుకుని మట్టిలోకి పోకూడదు చిన్నగురువుగారూ! మట్టిలో ఉండే సూక్ష్మజీవుల మూలకంగా ఆరోగ్యం చెడుతుంది. అమ్మ చూస్తే మన వీపు కూడా విమానం మోత మోగిపోతుంది!" అంటూ బెడ్‌రూమ్‌ని ఆనుకుని ఉండే పెద్ద గార్డెన్‌లోకి చూశాడు శ్రీకర్.

ఎత్తుగా ఎదిగిన సంపెంగ వృక్షం ఒకటి ఉంది గార్డెన్ మొదట్లో. విరబూసి ఉన్న సంపంగి పూల వాసనకు పరవశించిపోతూ చెట్టు మొదట్లో చుట్టలు చుట్టుకుని ఉన్నది ఒక నల్లతాచు.

నాలుగు అడుగుల దూరంలోకి పోయి చేతులు ఊపుతున్నాడు మాస్టర్ షాడో. తన దగ్గర ఉన్న అరటిపండును తినటానికి రమ్మని తన భాషలో ఆ పాముని పిలుస్తున్నాడు.

శ్రీకర్ చూస్తూ ఉండగానే చర్రున పడగ ఎత్తి శివమెత్తినట్లు ఆడటం మొదలుపెట్టిందా నల్లతాచు... శరవేగంతో నాలుకల్ని కదిలిస్తూ ఒళ్లు జలదరించేట్లు బుసలు కొట్టటం ప్రారంభించింది.

"అయ్యబాబోయ్...! బిందూ! కమాన్ బిందూ... కమాన్!" అని అరుస్తూ గార్డెన్‌లోకి జంప్ చేశాడు శ్రీకర్.

కంటికి కనిపించని వేగంతో పాంటు బెల్టు వెనుక భద్రపరుచుకున్న రివాల్వర్‌ని బయటకు తీసింది అతని దక్షిణ హస్తం.

అతని అరుపును విని మరింతగా రెచ్చిపోయిందా పాము ... మరో మూరెడు ఎత్తుకు పడగను లేపింది.

నిర్దాక్షిణ్యంగా ట్రిగ్గర్‌ని ప్రెస్ చేశాడు శ్రీకర్.

గుండెలు జలదరించే శబ్దాన్ని వెలువరిస్తూ బయలుదేరించి బుల్లెట్... పాము మెడమీద తగిలి రెండు ముక్కలుగా వేరు చేసేసింది.

ఆఘమేఘాల మీద వచ్చిపడింది బిందు. కిందపడి మెలికలు తిరుగుతున్న పాము తోకను పట్టుకోబోతున్న మాస్టర్ షాడో వీపు పగిలిపోయేటట్లు ఒకటి చరిచి కౌగిలిలో పొదువుకున్నది.

చిటికెలో తప్పిపోయిన ప్రమాదాన్ని తలుచుకునేసరికి నీటితో నిండిపోయాయి ఆమె కనులు. బిడ్డను మరింత గట్టిగా గుండెలకు అదుముకుంటూ, తన వెనకే వచ్చిన షాడోకేసి చూసింది.

కుంగ్‌ఫూ విద్యాపీఠాధిపతి చింగ్‌లీకి కబురు చేసి, మాస్టర్ షాడో జీవితాన్ని అలుముకుంటున్న ప్రమాద ఛాయల్ని తొలగించే ప్రయత్నం చేయమనే అభ్యర్థన ప్రతిఫలిస్తోంది ఆ చూపులో.

అరివీరభయంకరులై, ఆర్తత్రాణ పరాయణులై, అందరి మన్ననలనూ పొందుతూ ఉండే కుంగ్‌ఫూ గురువులను తరతరాలుగా పట్టి పీడుస్తున్నది ఒక శాపం!

సంతాన ప్రాప్తి ఉండదుట గురుపీఠాన్ని అధివసించి ఉన్న వ్యక్తికి. తన శిష్యుల్లో అర్హులైన వారిని ఎంచుకుని తన తదనంతరం పీఠాన్ని అప్పగించటం కంటే మరో మార్గం వారికి లేదుట!

తన శిష్యులందరిలోనూ షాడోని అభిమానించి తన వారసుడిగా ఎంచుకున్నాడు కుంగ్‌ఫూ విద్యాపీఠానికి ముప్పది రెండవ గురువైన బాజూ అకరక్ చింగ్‌లీ.

తరతరాల నుంచి క్రమం తప్పకుండా కుంగ్‌ఫూ గురువుల్ని వేధిస్తున్న శాపం షాడోని కూడా వదిలిపెట్టలేదు. గురుపీఠాన్ని అధివసించకముందే అల్లకల్లోలం చేయటం మొదలుపెట్టింది అతని జీవితాన్ని.

కిల్లర్స్ గాంగ్ వస్తాదుల దౌష్ట్యానికి గురై రెండుసార్లు గర్భాన్ని కోల్పోయింది బిందు. ఆశల ప్రతిరూపంగా, కలల పంటగా జన్మించిన మాస్టర్ షాడో జీవితం ఇప్పుడు దినదిన గండం నూరేళ్ల ఆయుస్సు మాదిరిగా ఉన్నది.

ఎంత జాగ్రత్తగా ఉన్నా ఏదో ఒక ప్రమాదంలో చిక్కుబడిపోతున్నాడా బుడతడు. మృత్యువుకు మూడు అంగుళాల దూరంలోకి పోయి, ఆఖరి క్షణంలో తప్పించుకుంటున్నాడు.

అలా తప్పించుకోలేని క్షణం అంటూ ఎదురైతే?

బిందూ అంతరంగంలోని ఆలోచనలు ఎటువంటివో షాడోకి తెలుసు. మరెప్పుడైనా ఆమె అలా ఆర్తిగా చూసి ఉంటే, అప్పటికప్పుడు జపాన్‌కి ప్రయాణం కట్టి ఉండేవాడతను. చింగ్‌లీని కలుసుకుని భవిష్యత్తు గురించిన ఆలోచనలు చేసేవాడు.

పంచప్రాణాలతో సగాన్ని పంచుకున్న గంగారాం కనిపించటం లేదన్న మాట చెవుల పడిన క్షణం నుంచీ వికలమైపోయింది అతని మనస్సు. తన జతగాడిని గురించిన ఆలోచనలు తప్ప, మరేమీ మెదలటం లేదిప్పుడు అతని హృదయంలో.

"బాస్‌కి తెలిస్తే అభ్యంతరం చెప్పటం డెఫినిట్! ఏదో ఒక విధంగా నా ప్రయాణాన్ని కాన్సిల్ చేయించటం గారెంటీ! ఇంకేదైనా మార్గం ఆలోచించాలి మనం. వెంటనే మహిమాకో అరణ్యాల దగ్గరకి చేరుకునే పద్ధతిని ఎన్నుకోవాలి!" బిడ్డడికి ఎటువంటి ఇబ్బందీ లేదని నిశ్చయం కాగానే, వెనుతిరిగి డ్రాయింగ్ రూమ్‌లోకి దారి తీస్తూ శ్రీకర్‌తో అన్నాడతను.



సిఐబి రిసెప్షన్ రూమ్‌లో తమ బాస్ కంఠం వినబడిన క్షణం నుంచీ అటువంటి ఆలోచనే శ్రీకర్ మనస్సులో కూడా మెదులుతున్నది.

పది క్షణాలు ఆలోచించి ముఖేష్‌కి ఫోన్ చేశాడతను.

ఫోన్‌లో సమాధానం చెప్పలేదు ముఖేష్. ఇరవై నాలుగు నిమిషాల తరువాత తనే స్వయంగా బయలుదేరి వచ్చాడు.

"ఉన్నచోట నుంచి కదలకుండా మనం టెలిఫోన్స్‌లో మాట్లాడుకునే మాటలన్నిటినీ ఆకళింపు చేసుకోగల శక్తి మన బాస్‌కి ఉన్నదని నా అనుమానం!" తను టెలిఫోన్‌లో మాట్లాడటానికి ఇష్టపడని దెందుకో వివరించి చెపుతూ ఒక సోఫాలో కూర్చున్నాడు.

"ఆలస్యం చేయకుండా, నా ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే మార్గాన్ని చూపించు!" ఫ్రెష్ పనామాను వెలిగించుకుని అతని పక్కనే చేరగిలపడుతూ అన్నాడు షాడో.

"ఇంత చిన్న విషయానికి వర్రీ అవ్వాల్సిన అవసరం ఏముందో నాకు అర్థం కావటంలేదు." అతని సిగరెట్ పాకెట్‌లోనుంచి తను కూడా ఒక సిగరెట్‌ను తీసుకుంటూ అన్నాడు ముఖేష్.

"నీకు బాగా తెలిసిన లాలా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నాడు..." చల్లగా తనకు తెలిసిన విషయాన్ని బయటపెట్టాడు.

చేత్తో తీసినట్లు మాయమైపోయింది షాడో మనసులోని అలజడి.

సన్నగా, పొడుగ్గా గాలి గట్టిగా వీస్తే కొట్టుకుపోయేటట్లు కనిపిస్తాడు ముఖేష్ చెప్పిన లాలా. అవతారాన్నిబట్టి అతని శక్తిని అంచనా వేస్తే అది పొరపాటే అవుతుంది.

ఎటువంటి వాతావరణంలోనైనా కించిత్తు కూడా చలించకుండా హెలికాప్టర్స్‌ని నడపడం అతని స్పెషాలిటీ.

సక్రమమైన మార్గంలో తన శక్తియుక్తుల్ని ఉపయోగించుకోవటం కుదరక అడ్డదార్లు తొక్కాడతను. దొంగ సరుకుల్ని రవాణా చేయటంలోను, క్రిమినల్ కారెక్టర్స్‌ని కోరుకున్న చోటికి తీసుకుపోవటంలోనూ అందెవేసిన చేయిగా పేరుపొందాడు.

అతని వ్యక్తిగత జీవితం ఎటువంటిదో తనకు అనవసరం... ప్రస్తుతం తన అవసరానికి ఖచ్చితంగా సరిపోయే మనిషి ఆ లాలా!

సగం కూడా కాలని పనామాని యాష్ ట్రేలో పడవేసి ఛెంగున సోఫాలోనుంచి లేచాడు షాడో.

బిందు భుజం తట్టాడు. మాస్టర్ షాడో బుగ్గమీద చిన్న చిటికె వేశాడు. బెడ్‌రూమ్‌లో దాచిపెట్టిన తన ఆయుధాల్ని అందుకుని పోర్టికోలోకి పరుగుతీశాడు.

"గురువుగారిని గురించి పూర్తిగా తెలిసి కూడా బెంగ పెట్టుకోవటం, బేలగా చూడటం ఏమీ బాగాలేదు, సిస్టర్! ఇప్పుడు బయలుదేరిన పని ఏమంత గొప్పది కాదు. ఎల్లుండి ఈ టైమ్‌కల్లా గంగారాంని వెంటబెట్టుకుని ఇక్కడికి వచ్చేస్తాడు చూస్తూ ఉండు!" అంటూ దిగులుగా చూస్తున్న బిందుకు ధైర్యం చెప్పటానికి ప్రయత్నించాడు శ్రీకర్. ఆమె చఱ్ఱున తల తిప్పి కోపంగా చూసేసరికి పోర్టికో పక్కనే స్టాండ్ వేసి ఉన్న తన స్కూటర్ దగ్గరికి పరుగు తీశాడు.

అలవాటు ప్రకారం చిన్నచిన్న శబ్దాలు చేస్తూ చేతులు ఊపటానికి ప్రయత్నించాడు మాస్టర్ షాడో. తల్లి తన వంక ఉరిమి చూడటంతో భయపడి ఆమె మెడను కౌగలించుకున్నాడు.

షాడో, ముఖేష్‌లు తీసుకుపోతున్న తమ జాగ్వార్ స్పోర్ట్స్ కారు దృష్టి పథం నుంచి దూరమయ్యేదాకా ఆగింది బిందు. శ్రీకర్ స్టార్ట్ చేసిన స్కూటర్ మెయిన్ రోడ్డును చేరుకున్న తరువాత వెనుతిరిగింది.

కాంక్రీట్‌తో పోతపోసిన విగ్రహాలమాదిరి డ్రాయింగ్ రూమ్‌లోనే నిల్చుని ఉన్నారు గంగారాం సెక్రటరీలు. ఉన్న చోటనుంచి ఒక్క అంగుళం కూడా అవతలికి జరగకుండా ఆమె వంక చూశారు.

"మీరు వెళ్లి ఏదైనా మంచి హోటల్లో బస చేయండి. మా దగ్గరనుంచి కబురు వచ్చేటంతవరకూ ఎక్కడికీ కదలకండి!" డ్రాయింగ్ రూమ్‌లో ఉన్న ఒక అలమరలో నుంచి కొంత డబ్బును తీసి వారికి అందిస్తూ ఆర్డర్స్ పాస్ చేసింది బిందూ.

తమ దగ్గర డబ్బు పుష్కలంగా ఉన్నదని చెప్పటానికి భయపడ్డారు వాళ్లు. ఆమె ఇచ్చిన నోట్లను తీసుకుని పోర్టికోవైపు నడిచారు.

పదిక్షణాలు ఆగి టెలిఫోన్ దగ్గరకి పోయింది బిందు. రిసీవర్‌ని ఎత్తి జపాన్‌లో ఉన్న కుంగ్‌ఫూ విద్యాపీఠాధిపతి చింగ్‌లీ నంబర్‌ను డయల్‌చేసింది.

***

"... వెయిట్ చేయమంటారా షాడో సాబ్? మంచి చోటు చూసుకుని ఈ చుట్టుపక్కల ఎక్కడో ఒకచోట సెటిలైపొమ్మంటారా?!"

తూర్పు దిక్కు తెల్లబడిన రెండు గంటలకు హెలికాప్టర్‌ని ఒక కొండ చెరియపక్కన కిందికి దించుతూ అడిగాడు లాలా.

చివరికంటా కాలి చేతివేళ్లను చురుక్కుమనిపించబోతున్న సిగరెట్‌ను విండోలోనుంచి అవతలికి విసిరేస్తూ తల అడ్డం తిప్పాడు షాడో!"

"ఇప్పటివరకూ నువ్వు చేసిన సహాయం చాలు, మై ఫ్రెండ్! థాంక్యూ వెరీమచ్ ఫర్ యువర్ ప్రాంప్ట్‌నెస్!" అంటూ హెలికాప్టర్ ఢిల్లీ నగరం నుంచి బయలుదేరే సమయంలో ముఖేష్ తన జేబులో పెట్టిన రెండు నోట్లకట్టల్ని అతనికి అందించాడు.

కుడిచేతిని ఎత్తి స్మార్ట్‌గా శాల్యూట్ చేశాడు లాలా. నీలం రంగు ఎయిర్‌బాగ్ నొకదాన్ని అతను భుజానికి తగిలించుకుని కిందకు దూకగానే ఇంజన్‌ని రైజ్ చేసి ఆకాశంలోకి దూసుకుపోయాడు.

ఫ్రెష్ సిగరెట్‌ని వెలిగించుకుంటూ లెఫ్ట్‌రైట్ ప్రారంభించాడు షాడో. అరగంట తరువాత ఎదుట ప్రత్యక్షమైన చిన్న సెలయేటిని క్రాస్ చేస్తుండగా, అవతలి ఒడ్డున కనిపించాడతనికి ఆ బెప్పో. ఎగరడానికి ప్రయత్నిస్తూ, రెక్కల్లో బలం చాక క్రిందపడిపోయిన ఒక పక్షిపిల్లను చేతుల్లోకి తీసుకుని ముద్దు మాటలతో బెదరు పోగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

సంసార బంధాలనుంచి విముక్తులై, పిచ్చివాళ్ల మాదిరి చెట్లు పుట్టలు పట్టుకు తిరుగుతూ ఉండే ఆ బెప్పోలను గురించి రకరకాల కథలు, గాథలు విని ఉన్నాడు షాడో.

చినిగి పేలికలైన జీర్ణవస్త్రాన్ని ఒంటికి చుట్టుకుని, దుమ్ము ధూళి దారుణంగా పేరుకుపోవటం వల్ల దుర్వాసన వెలువరిస్తున్న శరీరంతో పరమ అహాస్యకరంగా అగుపిస్తున్న అతని అవతారాన్ని చూసి వెనుకంజ వేయకుండా, ముందుకు పోయి పాదాల్ని తాకాడు.

"నాకు ఆకలి వేస్తోంది, తినటానికి ఏమైనా పెట్టగలవా?" చేతుల్లోని పక్షిపిల్లను ఒక కొండరాయి మీదకి వదులుతూ అడిగాడు ఆ బెప్పో.

భుజానికి వేలాడుతున్న ఎయిర్‌బాగ్‌లో నుంచి రెండు బ్రెడ్ పాకెట్లను తీసి అతని ముందుంచాడు షాడో.

ఆవురావురుమంటూ ఆరగించేశాడు బెప్పో. ఆకలి తీరనట్లు కనులు చిట్లించాడు.

రెండో ఆలోచన లేకుండా ఎయిర్‌బాగ్‌ని క్రిందకు దించాడు షాడో. అందులో మిగిలి ఉన్న అరడజను బిస్కట్ పాకెట్స్‌ని అతనిపరం చేశాడు.

"ఉన్నదంతా నాకు పెట్టేసి, ఆకలితో మాడిపోవాలని

అనుకుంటున్నావా?" అతని ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు బెప్పో.

"బెప్పోలంటే భగవంతుడి ప్రతిరూపాలని పెద్దలు నాకు చెప్పారు. భగవంతుడిని తృప్తిపరిచి ఆకలితో మాడిపోయి వాళ్లను నేను చూడలేదు ఇంతవరకూ!" చిన్నగా నవ్వుతూ అన్నాడు షాడో.

వంచిన తల ఎత్తకుండా ఆ బిస్కట్ పాకెట్స్‌ని కూడా ఖాళీ చేసేశాడు బెప్పో. చేతుల్ని జీర్ణవస్త్రానికి తుడుచుకుంటూ సెలయేటివైపు కదిలాడు మంచినీళ్లు తాగటంకోసం.

అటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తోంది అతనికి నాలుగు అడుగుల దూరంలో ఒక పొదచాటున పొంచి ఉన్న జంగురుపిల్లి. నేలకు కొట్టిన రబ్బరు బంతిలా గాలిలోకి లేచి కొండరాయి మీద నిలబడి ఉన్న పక్షిపిల్లమీదకి దుమికింది.

కనుచివరల నుంచి ఆ కదలికను పసిగట్టి, తనకు తెలియకుండానే రియాక్ట్ అయ్యాడు షాడో... బొంగరంలా గిర్రున తిరిగి వేగంగా విసిరాడు తన ఎడమపాదాన్ని.

ఫుట్‌బాల్‌లా లేచినట్లు పది అడుగులు పైకి లేచిందా పిల్లి ... గింగిరాలు తిరుగుతూ పోయి పాతిక అడుగగుల దూరంలో ఉన్న ముళ్ల పొదల మధ్యన పడింది.

చెవులు చిల్లులు పడేటట్టు వికృతంగా అరిచి, తోక ముడుస్తున్న ఆ అర్భక ప్రాణిని చూసి పకపకా నవ్వుతూ సెలయేటిలో నుంచి ఇవతలికి వచ్చాడు బెప్పో.

"నాకు సెలవు ఇప్పిస్తే నా ప్రయాణాన్ని కొనసాగించుకుంటాను!" తలవంచి అభివాదం చేస్తూ అన్నాడు షాడో.

"నీ పద్ధతులు నాకు నచ్చాయి. నా వల్ల కాదగిన సహాయం ఏదైనా ఉంటే వెంటనే చెప్పు!" కొండరాయి మీది పక్షిపిల్లను చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు బెప్పో.

"మానవ సహజమైన కోరికలు కోరి మీ మహిమను కించపరచటం నాకు చేతకాదు. నేను బయలుదేరిన పని విజయవంతమవ్వాలని ఆశీర్వదించండి... చాలు!" మరింత వినయంగా అన్నాడు షాడో.

"ఏ పని విజయవంతం కావాలని ఆశీర్వదించను? మొదటిదా, రెండవదా?" చిరునవ్వులు చిందిస్తూ అడిగాడు బెప్పో.

హెలీకాప్టర్‌లో నుంచి దిగీ దిగటంతోనె లెఫ్ట్‌రైట్‌లు ప్రారంభించటం వల్ల అలసట అధికమై తన మతి కాస్తంత మందగించిందేమోనన్న అనుమానం వెంటనే అడుగుపెట్టింది షాడో హృదయంలో.

ఎన్నిపనుల మీద బయలుదేరాడు తను?

మహిమాకో అడవుల్లోకి వచ్చి అడ్రస్సులు లేకుండా గల్లంతయిపోయిన గంగారాం కోసం పెట్టుకున్న ఒకే ఒక పనిమీద కదా!

అతని ఆలోచనల్ని తనకు అర్థం అవుతున్నట్లు మరింత చిద్విలాసంగా నవ్వి, కనులు చిట్లించాడు బెప్పో.

"కోటి పడగలతో ఈ భూమిని కాపలా కాస్తూ ఉండే కకుటూ కాలసర్పం మాదిరి నీ జీవితాన్ని కాపాడుతూ ఉంటుంది స్నేహమనే దైవీకమైన లక్షణం. పరకీ శిఖర దర్శనమైన మరుక్షణం ప్రబలమవుతుందది. కనీ వినీ ఎరుగని అనుభవాలు నీ జీవితాన్ని అలుముకోవటానికి కారణమవుతుంది. క్షేమంగా పోయి, లాభంగా తిరిగి రా!... వెళ్లు!" పూనకం వచ్చినవాడిలా వెనక్కీ ముందుకీ ఊగిపోతూ చెప్పాడు.

తన మతి మరింతగా మందగించి పోతున్నట్లు అనిపించింది షాడోకి.

బెప్పోల మాటలకు సరైన అర్థాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నించటం కంటే అరిచేతుల్ని తట్టి అగ్నిని పుట్టించటం చాలా తేలిక అని విని ఉండటం వల్ల ఎదురు ప్రశ్నలు వేయలేదతను.

అతిగా ఆలోచిస్తూ అక్కడే నిలబడితే అర్థం పర్థం లేని మరికొన్ని మాటలతో బెంబేలెత్తిస్తాడన్న అనుమానంతో, మరోసారి అభివాదం చేసి పెద్దపెద్ద అడుగులతో అల్లంత దూరంలో అగుపిస్తున్న మహిమాకో అడవులకేసి బయలుదేరాడతను.

అడుగు తీసి అడుగు వేయటానికి కూడా వీలుకానంత దట్టంగా అల్లుకుని ఉన్న పొదల మధ్యగా అడుగులు వేస్తూ చీకట్లు అడవిని చుట్టుముట్టబోతున్న సమయంలో చిన్న నీటి గుంటను చేరుకున్నాడు.

ఎయిర్ బాగ్‌లో ఉన్న తినుబండారాలన్నిటినీ బెప్పోకి సమర్పించుకుని ఉండటంవల్ల నీటితోనే కడుపు నింపుకోవాలని నిర్ణయించుకుంటూ ముందుకు కదలబోతుండగా సమీపంలోని వెదురు పొదలచాటునుంచి అతనికేసి చూస్తూ అగుపించాయి రెండు జ్యోతులు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెనక్కి దూకాడు షాడో. వింటి నుంచి వెలువడిన బాణంలా పోయి ఒక పెద్ద బజుకూ వృక్షం మీదకి ఎగబాకాడు.

నిప్పు ముద్దలవంటి కనులను గిర్రున తిప్పుతూ వెదురు పొదచాటు నుంచి ఇవతలికి జంప్ చేసిందొక పెద్దపులి. చుట్టుపట్ల ఉండే పరిసరాలన్నీ దద్దరిల్లిపోయేటట్లు గాండ్రిస్తూ బజుకూ వృక్షం దగ్గరకు వచ్చేసింది.

"చెట్టు ఎక్కి నన్ను పట్టుకోవటానికి నువ్వు చిరుతపులివి కాదు బ్రదర్! అనవసరమైన ఆశలతో టైమ్ వేస్ట్ చేసుకోకుండా నీ దారిన నువ్వు వెళ్లిపోవటం చాలా మంచిది!" లావుపాటి ఎండుకొమ్మ నొకదాన్ని విరిచి దానిమీదకి విసురుతూ సలహా ఇచ్చాడు షాడో.

పక్కకు గెంతి ఆ కొమ్మనుంచి తప్పించుకున్నదా క్రూర జంతువు.... నాలుగు అడుగుల పొడవున్న తోకను నేలకేసి తాటిస్తూ. చెట్టు చుట్టూ రౌండ్స్ కొట్టడం ప్రారంభించింది.

పది నిమిషాలు గడిచిన తర్వాత కూడా అది అక్కడనుంచి కదిలే సూచనలు కనిపించకపోవడంతో మరింత ఎత్తుకు వెళ్లిపోయాడు షాడో.... చిటారు కొమ్మల్ని చేరుకుని, పక్కనే ఉన్న మరో మహావృక్షం మీదకి ట్రాన్స్‌ఫర్ అవుతూండగా అతని దృష్టిని ఆకర్షించింది దట్టంగా గాలిలోకి వీస్తున్న పొగ.

పట్టరాని సంతోషంతో పరవశించిపోతూ, బజుకూ వృక్షం దగ్గరే ఉన్న పెద్దపులికేసి చేయి ఊపాడు.

"నువ్వు కనిపించకపోయినట్లయితే, ఈ చెట్లమీదకి చేరుకునేవాడిని కాదు నేను. చెట్లమీదకి చేరుకోకపోతే నా పని ఇంత త్వరగా పూర్తి అయి ఉండేది కాదు. థాంక్యూ, బ్రదర్! థాంక్యూ వెరీమచ్!" అంటూ ముందుకు కదిలాడు టార్జాన్ మాదిరి.

రెండు మైళ్ల దూరంగా పోయిన తరువాత అగుపించిందతనికి ఒక ఆటవిక గూడెం.... ఎండు కొమ్మలతో పెద్ద పెద్ద మంటలు వేసి, అడవిలోనుంచి పట్టుకువచ్చిన దుంపల్ని, అడవి జంతువులను కాల్చుకు తింటున్న ఆటవికులు కూడా కనిపించారు.

నాగరికులు కంటపడిన మరుక్షణం బరిశెల్ని పట్టుకుని మీదకి ఎగబడే ఆ ప్రిమిటివ్ పీపుల్‌ని మంచి మాటలతో మచ్చిక చేసుకునేటందుకు మార్గాల్ని అన్వేషిస్తూ చిటారు కొమ్మల్ని వదిలి క్రిందికి చేరుకున్నాడు షాడో.

భుజానికి తగిలించుకున్న ఎయిర్‌బాగ్‌ను బిగించి పట్టుకుని గూడెంకేసి అడుగులు వేయకముందే చెలరేగిందక్కడ దారుణమైన గందరగోళం.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ అందుకు



కారణాన్ని అన్వేషించబోతున్న షాడో దృష్టిపథంలోకి వచ్చింది రూపెత్తిన మృత్యుదేవతలా గూడెంమీదకి పోతున్న పెద్దపులి.

మనిషి మాంసాన్ని ఆరగించటానికి మహా అలవాటుపడి ఉన్న పులి కాబోలు, అతని జాడల్ని అనుసరించి వచ్చేసిందది. గూడెంలో కనిపించిన జనాల్ని చూడగానే అటుకేసి లంఘించింది.

అటువంటి ప్రమాదం ముంచుకు వస్తుందని ఊహించకపోవటం వల్ల అజాగ్రత్తగా ఉన్నారు ఆటవికులు. చట్రాది మీద కొట్టిన చిల్లపెంకుల్లా తలా ఒక మూలకు చెదిరిపోయారు.

ప్రాణాలు కాపాడుకోవటం కోసం వాళ్లు పడుతున్న పాట్లు గమనించేసరికి పట్టుకుపోయాయి షాడో గుండెలు.

రెల్లుగడ్డి వంటి అడవి ఆకులతో కప్పబడిన చిన్న గుడిశెలో తల దాచుకున్నది ఒక కుటుంబం. వెదురు బద్దలతో అల్లిన తడికెను గుడిశె ద్వారానికి అడ్డుపెట్టుకోబోతుండగా ఎటాక్ చేసిందా చారల మెకం.

చురకత్తులవంటి గోళ్లు కలిగిన పంజాలతో వెదురుబద్దల్ని ఛిన్నాభిన్నం చేసి గుడిశలోపలికి దుముకబోతుండగా, పరుగు పరుగున పోయి దాని తోకను గట్టిగా పట్టుకున్నాడు షాడో.

ఆకాశం బద్దలైపోయేలా పెద్దగా గాండ్రించి గిర్రున వెనుతిరిగిందా క్రూరమృగం. గంగాళంమాదిరి నోటిని తెరిచి మీదకు జంప్ చేయబోయింది.

తోకను వదిలి, కుడికాలి బూటుకు బిగించి ఉన్న డాగర్‌ని బయటకు లాగాడు షాడో. ఒళ్లు గగుర్పొడిచేటట్లు షాట్ చేస్తూ ఎడాపెడా పొడిచాడు నాలుగు పోట్లు.

భరించరాని బాధతో గావురు గావురుమని శబ్దాలు చేస్తూ అవతలికి జంప్ చేసింది పెద్దపులి...!

కుడి చేతిలోని డాగర్‌ని ఎడమచేతిలోకి మార్చుకుంటూ తను కూడా ఒక పక్కకు గెంతాడు షాడో. రెండు అడుగుల దూరంలో ఉన్న చితుకుల మంటకేసి చేతిని జాచి పెద్ద నిప్పు మొద్దు నొకదాన్ని అందుకున్నాడు.

భగభగలాడుతున్న ఆ నిప్పు మొద్దు తన ముఖానికేసి గురిపెట్టబడుతున్నదని గ్రహించి, ఆరు అడుగుల ఎత్తుకు ఎగిరిందా అడవిజంతువు ... అంతకుముందే తను ఎటాక్ చేయబోయిన గుడిశెమీద నుంచి పోయి అవతల పడింది. పడిన వెంటనే పైకి లేచి అడవిలోకి పరుగుతీసింది.

ఎముకలతో తయారుచేయబడిన బరిశెలను బిగించి పట్టుకుంటూ, ఒకరి తరువాత ఒకరుగా గుడిశెల చాటునుంచి ఇవతలికి వస్తున్న ఆటవికుల్ని కనుచివరల నుంచి గమనించుకుంటూ నిప్పు మొద్దును అవతలికి విసిరేశాడు షాడో. పెద్దపులి రక్తంతో మలినమైన డాగర్‌ని శుభ్రపరుచుకుని బెల్ట్ వెనుక దాచాడు.

"జానెడు పొడుగుకూడా లేని ఆయుధంతో చారల మెకాన్ని ఎదిరించటానికి ప్రయత్నించిన నీ సాహసం చాలా గొప్పది!"

అతనివల్ల తమకు ఎటువంటి ఆపదా ఎదురవదని నిశ్చయపరచుకున్న తరువాత మెల్లిగా ముందుకు వస్తూ మెచ్చుకున్నాడు ఆటవికులందరికీ నాయకుడి మాదిరిగా కనిపిస్తున్న వృద్ధుడు ఒకతను.

మాటలు అర్థం కాకపోయినా భావం అవగతమయ్యేసరికి గుండెలమీద నుంచి కొండంత బరువు దిగిపోయిన ఫీలింగ్ షాడోను ఆవరించుకున్నది.

అనుకోని విధంగా అటువంటి సుహృద్భావ వాతావరణాన్ని క్రియేట్ చేసిన పెద్దపులికి మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు.

"నిన్ను డాగర్‌తో గాయపరిచినందుకు మన్నించు, బ్రదర్! వేటకు అడ్డువచ్చి బాధ కలిగించినందుకు క్షమించు!" అనుకుంటూ ఆ వృద్ధుడిని అనుసరించి గూడెం మధ్యలో ఉన్న ఒక కొండరాయి దగ్గరకి పోయాడు.

చిన్నా, పెద్దా ముసలీ ముతకా అందరినీ అక్కడ సమావేశపరిచి మంచి మంచి మాటలతో షాడోని మరింతగా మెచ్చుకున్నాడు వృద్ధుడు. ఎర్రగా కాల్చిన అడవి కోడిని తెప్పించి షాడో ముందు పెట్టించాడు.

సిగ్గుపడకుండా ఆరగించేశాడు షాడో. సొరకాయ బుర్రలో అతను ఇప్పించిన నీళ్లు తాగి దాహం తీర్చుకున్నాడు.

"మాకు శత్రువులైన నాగరిక జాతికి చెందినవాడివి నువ్వు మమ్మల్ని వెతుక్కుంటూ రావటానికి కారణం తెలుసుకోవచ్చా?" తాపీగా కూర్చున్న తరువాత అసలు విషయంలోకి వచ్చాడు ఆటవిక నాయకుడు.

ఆ మాటల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ తన ఎయిర్‌బాగ్‌లోంచి రకరకాల పూసల దండల్ని బయటకు తీశాడు షాడో... ఆకర్షణీయంగా అగుపించే జడరిబ్బన్ల చుట్టల్ని బయటపెట్టాడు.

"పరాయి జాతివాడినని పగ చూపించకుండా తిండిపెట్టి ఆదరించినందుకు కృతజ్ఞతాపూర్వకంగా సమర్పించుకుంటున్న బహుమతులు ఇవి ... తీసుకోండి...!" అంటూ వాటన్నిటినీ నాయకుడి ముందుకు జరిపాడు.

పూర్తిగా వివశులైపోయారు అక్కడ గుమిగూడిన ఆటవికులు అందరూ గుడ్లగూబలు అరిచినట్లు వింత వింత శబ్దాలు చేస్తూ అతన్ని ఆకాశానికి ఎత్తేశారు.

ఆపైన ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు షాడో. కొండరాయికి దగ్గర్లో ఉన్న చితుకుల మంట ముందుకుపోయి, డాగర్ మొనతో మనిషి బొమ్మ నొకదాన్ని నేలమీద గీశాడు.

పొట్టిగా, లావుగా, పిచ్చివాడిలా కనిపించే గంగారాం బొమ్మ అది.

"చాలా రోజుల క్రితం ఈ అడవిలోకి వచ్చిన నా స్నేహితుడితను. ఇతని జాడలు నాకు తెలియాలి!" తనకు వచ్చిన అడవి భాషలన్నింటినీ ఉపయోగిస్తూ ఎక్స్‌ప్లెయిన్ చేశాడు. రకరకాల సైగలు కూడా చేశాడు.

ఊపిర్లు బిగపట్టి కుతూహలంగా చూస్తున్న ఆటవికుల్లో నుంచి చటుక్కున తమ నాయకుడి దగ్గరకి జరిగాడు ఒకతను. ఫుల్‌స్టాప్ కామాలు లేకుండా పది నిమిషాలపాటు ఏకబిగిన మాట్లాడాడు.

"ఈ అడవిలో ఉండే నిప్పుకొండ దగ్గర నివశిస్తూ ఉంటుంది చారల మెకాన్ని మించిన శౌర్యంకల జాతి ఒకటి. వాళ్ల చేతికి చిక్కాట్ట నీ జతగాడు!" నేలమీద బొమ్మవంకా, షాడో గుండెలవంకా, గూడానికి ఉత్తరదిశగా పెరిగి ఉన్న వృక్షాలవంకా చూపిస్తూ చెప్పాడు నాయకుడు.

అరగంట పట్టింది షాడోకి ఆ మాటల్ని అర్థం చేసుకోవటానికి. అర్థమైన తరువాత ఒక్క క్షణం కూడా అక్కడ ఆగబుద్ధి కాలేదతనికి.

ఉత్తర దిశలో దట్టంగా పెరిగి ఉన్న వృక్షాలదాకా వచ్చి వీడ్కోలు చెప్పాలనే అనుకున్నాడు ఆటవికుల నాయకుడు. దెబ్బతిని పారిపోయిన బెబ్బులి ఆ చుట్టుపట్ల మాటు వేసి ఉంటుందన్న భయంతో గుడిశెల దగ్గరే ఆగిపోయాడు.

***

"అన్నెం పున్నెం ఎరుగని అమాయకుడిని తీసుకువచ్చి అన్యాయంగా చంపేస్తున్నారు. జాలిగుండె గల దయామయులెవరైనా ఈ చుట్టుపట్ల ఉంటే వెంటనే వచ్చి రక్షించండి! కాపాడండి!" చెవులు చిల్లులు

పడిపోయేటట్లు కేకలు పెట్టాడు గంగారాం.

చేతిలో ఉన్న చెట్టుకొమ్మను గిరగిరా తిప్పి అతని ముఖంమీద కొట్టబోయాడు గుడిశెలోకి వచ్చిన ఆటవికుల్లో ఒకతను. ఆఖరి క్షణంలో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని, వికటంగా నవ్వుతూ బయటకు వెళ్లిపోయాడు.

తాము తీసుకువచ్చిన అడవి దుంపల్ని, ఎర్రగా కాల్చిన జింకమాంసాన్ని ఒకపక్కగా పెట్టి, అతన్ని అనుసరించారు మిగిలినవారు. యథాప్రకారం తమ ఆయుధాల్ని బిగించి పట్టుకుని గుడిశె చుట్టూ కాపలా నిలబడ్డారు.

ఏదో ఒకవిధంగా వారందరితోనూ తగాదా పెట్టుకోవాలని ఆ సందడి మధ్యలో వీలు చూసుకుని అవతలికి జంప్ చేయాలని అనుకున్న గంగారాంకి నిరాశే మిగిలింది.

అడవి జంతువులని బంధించినట్లు అడవి తీగెల వలలో మూటకట్టి అక్కడికి తీసుకువచ్చిన క్షణం నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నాడతను. వాళ్లు గుడిశెలోకి వచ్చిన ప్రతిసారీ రెచ్చగొడుతూనే ఉన్నాడు.

అతని మాటలు అర్థం కాకపోయినా ఆ మాటల వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని అవగతం చేసుకుని, అల్లంత దూరంలోనే ఆగిపోతున్నారు వాళ్లు. చేతులకు అందేటంత దూరంలోకి రావటంలేదు.

రోజులు గడుస్తున్నకొద్దీ అధికమైపోసాగింది గంగారాం బాధ.

పరాయి జాతివాళ్లు కంటపడితే పెద్దపులుల మాదిరిగా మీదపడి ప్రాణాలు తీసేయవలసిన పిశాచపు జాతి అది. పట్టుకున్న మరుక్షణమే ఆ పని చేయకుండా, కొత్త అల్లుడిని మేపినట్లు కూర్చోబెట్టి మేపటం దేనికి?

ఆ సందేహానికి సమాధానం పొందితీరాలనే పట్టుదలతో ఆ రోజు వాళ్లు తీసుకువచ్చిన పదార్థాల్ని ఆరగించలేదతను.

"వీరాధి వీర శూరాధిశూరుడని పేరు పొందిన ఈ గంగారాం సాబ్‌తో పరాచికాలు ఆడటం ప్రాణసంకటమని మీకు అర్థం కావటంలేదు. అవకాశం అంటూ లభించిన మరుక్షణం మీ అంతుచూసి తీరతాడు ఈ అస్సాం పెద్దపులి... ఖబడ్దార్!" అని బెదిరించాడు గుడిసెను కాపలా కాస్తున్న యువకుల్ని.

వాళ్లు బెదిరినట్లు కనిపించకపోవడంతో పళ్లు పటపటమని కొరుకుతూ గుడిశెలో పెట్టిన తినుబండారాలన్నిటినీ బయటకు విసిరికొట్టాడు.

అప్పుడు ... అలా తన అసంతృప్తిని వైల్డ్‌గా ప్రకటించడంతో వెంటనే వచ్చేసింది అతను కోరుకున్న ఎఫెక్ట్. గూడెపు మంత్రగాడి మాదిరిగా కనిపిస్తున్న వృద్ధుడొకతన్ని వెంటబెట్టుకుని హుటాహుటిన వచ్చేశాడు ఆటవికుల నాయకుడు.

"మనం పెడుతున్న తిండి ఇతనికి బాగా వంటబట్టింది. ఇంక ఆలస్యం అనవసరం. ఈ సాయంత్రానికే ఏర్పాటు చేసేద్దాం!" పిడికిళ్లు బిగించి కాల రుద్రుడి మాదిరిగా నిలబడిన గంగారాంను క్రిందనుంచి పైదాకా పరిశీలనగా చూస్తూ అన్నాడు మంత్రగాడు.

అక్కడికి వచ్చిన క్షణం నుంచి వారిని చాలా జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూ ఉండటం వల్ల పూర్తిగా కాకపోయినా, కొంతవరకూ అర్థం అయ్యాయి గంగారాం సాబ్‌కి ఆ మాటలు.

"ఏం చేయదలుచుకున్నార్రా నన్ను ఈ సాయంత్రం? మీ కొండ దేవతలకి బలి ఇవ్వదలుచుకున్నారా?" విపరీతమైన ఆగ్రహంతో ముఖమంతా ఎర్రగా కందిపోతుండగా అడిగాడు.

ఉన్నట్లుండి అతను తమ భాషలో మాట్లాడటాన్ని చూసి మొదట అదిరిపడినా, వెంటనే తేరుకుని, మెచ్చుకోలుగా తల ఊపాడు నాయకుడు.

"ఏం చేయబోతున్నామో చీకటి పడే సమయంలో నీకే అర్థమవుతుంది. అనవసరంగా అరిచి నీ శక్తిని వృథా చేసుకోకు. ఇప్పుడే పుట్టుకువచ్చిన అడవి కోడిని చక్కగా కాల్పించి పంపుతాను ... హాయిగా ఆరగించు!" అంటూ మంత్రగాడిని వెంటబెట్టుకుని వెనుతిరిగాడు.

అధికమైపోతున్న ఆగ్రహాన్ని అణచుకోవటం చేతకాక గుడిశె బయటకు జంప్ చేశాడు గంగారాం.

ఉసుళ్ల తెర మాదిరి వచ్చి మీద పడిపోయారు గుడిశెకు కాపలా ఉన్న ఆటవికులు. ఊపిరి తీసుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా తమ ఆయుధాలతో విరగబాదేశారు.

అప్పటికీ అతను శాంతించకపోవడంతో ముళ్లకంపను ఈడ్చినట్లు ఈడ్చుకుంటూ తీసుకుపోయి గూడెం మధ్యభాగంలో ఉన్న పెద్ద గుంజకు కట్టిపడేశారు.

"నేను స్మగ్లింగ్ చేయటం నీకు నచ్చనిపక్షంలో ఏ పోలీసులకో పట్టించి ఇవ్వకుండా, ఈ దరిద్రపుగొట్టు ముఖాలకి అప్పగించావేమిటి కలకత్తా కాళీ? నా మీద నీకు దయ తప్పింది!" అని కలకత్తా కాళిని తలుచుకుంటూ డీలా పడిపోయాడు గంగారాం.

పొద్దు పడమరకి తిరుగుతూ ఉండగానే వచ్చేశారక్కడికి గూడెపు జనం. గంగారాం నిలబెట్టిన ప్రదేశానికి కాస్తంత అవతలగా ఉన్న కొండరాళ్లు రెండింటికి సాగిలబడి ప్రమాణాలు చేస్తూ వలయాకారంలో బైఠాయించారు.

చీకటి పడబోతున్న సమయంలో తనను బలి ఇవ్వటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అనుకుని అగ్గిరాముడైపోయాడు గంగారాం.

"గంగారాం సాబ్ అంతటివాడిని మీ కొండదేవతలకు బలి ఇచ్చేటప్పుడు కనీసం నాలుగు డప్పుల్ని, రెండు డోళ్లని మోగించాలనే కనీస జ్ఞానం మీకు లేకుండా పోయింది. రెండు మూడు కొమ్ముబూరాల్ని ఒళ్లు జలదరించేటట్లు ఊదాలనే విచక్షణ కూడా మీలో నశించింది ... మడ్డిముఖాలు మీరు! బుద్ధిహీనులు!" ఇష్టవచ్చినట్లు తిట్టాలని ప్రయత్నించి సరైన మాటలు నోటికి రాకపోవడంతో ఆగిపోయాడు.

పావుఘడియ తరువాత నాయకుడిని వెంటబెట్టుకుని అక్కడికి వచ్చాడు మంత్రగాడు.

"నిప్పుకొండకు చుట్టూ ఉన్న ఆటవిక జాతులలో మనల్ని మించిన శౌర్యవంతులు ఎవరూ లేరని, మన పేరు వినపడితే ఎంతటి వారైనా భయంతో వణికిపోతారని మీ కందరికీ తెలుసు!" వస్తూనే అందరినీ నిశ్శబ్దంగా ఉండమని సైగ చేస్తూ ప్రారంభించాడతను తన ప్రసంగాన్ని.

"అటువంటి వీరాధి వీరులమైన మనల్ని చూడగానే కనులు తేలవేయాల్సిన ఈ పరాయిజాతి మనిషి అటువంటి పని ఏదీ చేయకపోగా, అపరిమిత శౌర్యంతో మనల్ని ఎదిరించాడు ... ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితిలో ఉండి కూడా ఇంకా ఎదురు తిరిగి మనల్ని దెబ్బతీయటానికే ప్రయత్నిస్తున్నాడు!"

ఊపిర్లు బిగపట్టి వింటున్నారు జనం ... అతనివంక గంగారాం వంక మార్చి మార్చి చూస్తున్నారు.

ఏదో ఒక ఆయుధాన్ని అందుకుని వచ్చిన పనిని వెంటనే పూర్తి చేయకుండా అనవసరమైన వాగుడు ఎందుకోసమో అర్థంకాక విసుగ్గా తల విదిలిస్తున్న గంగారాంకి వెంటనే తగిలింది పెద్ద షాక్.

"మనం ఏనాడూ చూడని ఇటువంటి సాహసవంతుడు మన అదృష్టంకొద్దీ మనకి బందీగా చిక్కాడు. ఇతడి కవోష్ణ రుధిరాన్ని పాత్రల్లో పట్టి మనమందరం తాగుదాం. ఇతని రక్తంలోని వేడిమిని మన రక్తంలో



కలుపుకుని మరింత బలవంతులుగా మారదాం!" దుస్తుల్లోనుంచి చాకు మాదిరిగా పదునుగా ఉన్న ఎముక నొకదాన్ని బయటకు తీస్తూ వినిపించాడు మంత్రగాడు తన నిర్ణయాన్ని.

కీసరబాసరగా అరుస్తూ తమ గుడిసెల్లోకి పరుగుతీశారు గూడెపు జనం. మట్టితో చేసిన పిడతలవంటి పాత్రలను తీసుకువచ్చి వరుసల్లో నిలబడటం మొదలుపెట్టారు.

తన రక్తాన్ని సారామాదిరిగానో, కల్లు మాదిరిగానో సేవించటానికి సిద్ధమవుతున్న ఆ పెద్ద మనుష్యులనందర్నీ పరికించేసరికి చలిగాలి వీచినట్లు జలదరించింది గంగారాం శరీరం.

"ఈ దుష్ట దుర్మార్గుల చేతికి చిక్కి, నేను చిత్రహింసల పాలు కాబోతుంటే చీమ కుట్టినట్లు కూడా పట్టించుకోకుండా ఢిల్లీలో కూర్చుని కబుర్లతో కాలక్షేపం చేస్తున్నావా గురూ! నీ కిది న్యాయంగా ఉన్నదా?" ఆకాశంకేసి చూస్తూ ఆందోళనగా అరవబోతుండగా, గూడెపు జనం సందడిని దాటి అతని చెవికి చేరింది ఒక నవ్వు.

లావుపాటి గులకరాయి ఏదో గొంతుకు అడ్డం పడ్డ అనుభూతి కలిగి, అప్రయత్నంగా నీటితో నిండిపోయాయి గంగారాం కనులు.

"వచ్చేశావా గురూ? నిజంగానే నువ్వు వచ్చేశావా?" కనుల్లోని నీరు క్రిందికి జారకుండా రెప్పల్ని ఆర్పుతూ అడిగాడు.

చేతికి అందిన చిన్న కర్రముక్కను అతని మీదకి విసిరి అధికప్రసంగం చేయకుండా వెంటనే అడ్డుకున్నాడు కొండ దేవతల మాదిరిగా పూజింపబడుతున్న కొండరాళ్ల వెనుక కూర్చుని ఉన్న షాడో.

"సంపాదించిన దానితో తృప్తిపడకుండా వెధవ పనుల్ని కంటిన్యూ చేసినందుకు నీకు ఇటువంటి శిక్ష పడాల్సిందే... ఒంట్లో ఉన్న పొడునెత్తురంతా బయటికి పోతేగానీ నీ పొగరు దిగిపోదు!" అక్కడ జరుగుతున్నదేమిటో అర్థం కావటం వల్ల వెక్కిరించాడు సన్నపాటి కంఠంతో.

బిక్కమొహం పెట్టి తలను వంచుకుంటున్న గంగారాం దగ్గరకి దుమికాడు చాకువంటి ఎముకను పట్టుకున్న మంత్రగాడు.

ఎయిర్‌బాగ్‌లో చేయిపెట్టి నిమ్మకాయ సైజులో ఉన్న బంతులవంటి వస్తువులు రెండింటిని బయటకు తీశాడు షాడో... వాటిమీది బుడిపెల్ని బలంగా అదిమి ముందుకు విసిరేశాడు.

దట్టమైన మేఘాల్లాంటి పొగను సృష్టించి, కళ్లను మంటలు మండించే టియర్ గాస్ షెల్స్ అవి.

పిడతలవంటి మట్టిపాత్రలను పట్టుకుని వరుసల్లో నిలబడ్డ జనం దగ్గర పడి బద్దలైంది ఒకటి. మంత్రగాడికి పది అడుగుల దూరంలో నేలను తాకి తన శక్తిని ప్రదర్శించింది రెండవది.

భగ్గుమంటున్న కనుల్ని అద్దుకుంటూ, చెల్లా చెదరవటం మొదలుపెట్టిన జనాన్ని, టియర్ గాస్ ప్రభావాన్ని తట్టుకోలేక స్పృహ కోల్పోతున్న మంత్రగాడిని కనుచివరల నుంచి గమనించుకుంటూ గంగారాం దగ్గరకి జంప్ చేశాడు షాడో.

బూటుకు అడ్డంగా బిగించి ఉన్న డాగర్‌ని బయటకు లాగుతూ ముందుకు జంప్ చేశాడు శాడో.

పది అంగల్లో గంగారాంని చేరుకుని రెండే రెండు దెబ్బలతో అతని బంధనాల్ని ఛేదించాడు.

తెరలు తెరలుగా పైకి లేచి ఆ ప్రదేశాన్నంతా ఆవరించుకుంటున్న టియర్‌గాస్ దెబ్బకు దృష్టి మందగించిపోకుండా కనుల్ని గట్టిగా మూసుకుంటున్నాడు గంగారాం.

"అర్జంటుగా అవతలికి పారిపోలేకపోతే సూప్‌లో పడిపోతాం. కక్షకట్టడంలో తాచుపాముల్ని మించిన దొంగనాయాళ్లు వీళ్లు. తప్పకుండా మనల్ని వెంటనే వేటాడే ప్రయత్నం చేస్తారు...!" అంటూ షాడో చేతిని ఆసరాగా తీసుకుని పరుగు ప్రారంభించాడు.

పావుఘడియ కూడా గతించకముందే యదార్థమయ్యాయి అతని మాటలు. టియర్‌గాస్ ప్రభావం కాస్తంత తగ్గుముఖం పట్టగానే జరిగింది ఏమిటో అర్థం చేసుకున్నారు ఆటవికులు.

ఆగ్రహావేశాలతో కంపించిపోతూ కర్రల్ని, బరిశెల్ని అందుకున్నారు కొందరు. అడవి తీగెల వలల్ని పట్టుకున్నారు మరికొందరు.

పెద్దపులుల మాదిరి దారుణమైన శబ్దాలు చేస్తూ తలా ఒకపక్కనుంచి స్నేహితుల్ని కమ్ముకునే ప్రయత్నాలు ప్రారంభించారు.

దారిలో అగుపించిన రాళ్లను, చెట్ల కొమ్మల్ని వారి మీదికి విసిరేశాడు గంగారాం. గంగాళంలా నోటిని తెరిచి వారి చెవులు చిల్లులు పడిపోయేటట్లు శాపనార్థాలు పెట్టాడు.

అయినా సరే వారి పట్టుదల సన్నగిల్లిపోయే లక్షణాలు కనిపించకపోయేసరికి షాడోకేసి తిరిగాడు.

"వీళ్లకి స్లిప్ ఇవ్వాలంటే మనం నిప్పుల కొండమీదికి పోక తప్పదు. అక్కడ ఉండే బండల్ని క్రిందికి దొర్లిస్తే గానీ అణిగిపోదు వీళ్ల కండకావరం...!" రెండు ఫర్లాంగుల దూరంలో, మబ్బుల్ని అంటుకునేటంత ఎత్తుగా అగుపిస్తున్న ఒక పర్వతంకేసి చేయి ఊపుతూ అన్నాడు.

అడ్డు వచ్చిన ఒక చిన్న ముళ్ల పొదమీద నుంచి అవతలికి దూకుతూ అటుకేసి చూశాడు షాడో.

ఎందుకో ఝల్లుమన్నది అతని శరీరం ... కాల్షియం ఇంజక్షన్ తీసుకున్నట్లు విపరీతమైన వేడిమి అతని ఒంటినిండా వ్యాపించటం మొదలుపెట్టింది.

"నిప్పుల కొండకు ఇంకేదైనా పేరు ఉన్నదా గంగూ!" పరుగు తీయటాన్ని ఆపకుండా అడిగాడతను స్నేహితుడిని.

"రెండు మూడు వేల సంవత్సరాల క్రితం అగ్నిజ్వాలలతో ఈ ప్రదేశాన్నంతా భస్మీపటలం చేసిన అగ్నిపర్వతం గురూ అది. అస్సాంలో చక్కర్లు కొడుతున్నప్పుడు అనేక రకాల కథలు విని ఉన్నాం మనం, మరిచిపోయావా?" ఆశ్చర్యంగా అడుగుతూ అతన్ని అనుసరించాడు గంగారాం.

హఠాత్తుగా షాడో కనులముందు ప్రత్యక్షం అయినట్లు అనిపించింది అడవి అంచుల్లో అగుపించిన బెప్పో వదనం ... దృఢంగా దెబ్బల మాదిరి చెవుల్లో ప్రతిధ్వనించటం ప్రారంభించాయి అతను చెప్పిన మాటలు!

ప్రపంచంలో ఉన్న నీరసమంతా ఒక్కసారిగా వచ్చి తనను ఆవరించుకుంటున్న అనుభూతి కలిగి ఎక్కడి వాడక్కడ ఆగిపోయాడు షాడో.

"సమ్‌థింగ్ ఈజ్ రాంగ్ విత్ మీ, గంగూ! కళ్లు తిరుగుతున్నట్లనిపిస్తోంది!" ఉన్నట్లుండి ఎనౌన్స్ చేశాడతను. అంతటితో ఆగకుండా స్పృహ తప్పబోతున్న వాడి మాదిరిగా క్రిందికి జారిపోయాడు.

అంతకు ముందు క్షణం వరకూ బాగానే ఉన్న అతనిలో హఠాత్తుగా వచ్చిన ఆ మార్పుని చూసి బిత్తరపోయాడు గంగారాం.

అడ్డు వచ్చిన పొదల్ని విరగదొక్కుతూ, తమ అరుపులతో చుట్టుపట్ల నివశించే అడవి జంతువుల్ని అదరగొడుతూ ఖడ్గమృగాల మాదిరి వచ్చేస్తున్న ఆటవికుల్ని గమనించేసరికి చీమలు, జెర్రులు పాకినట్లు అనిపించింది అతనికి తన ఒంటిమీద.

"ఆఖరి క్షణంలో కళ్లు తేలవేసి నన్ను వేధించుకు తినటం న్యాయమేనా? నీ సహాయం లేకుండా ఈ పిశాచిగాళ్లను ఎదిరించటం నాకు సాధ్యపడేదేనా?" ఆందోళనగా అడుగుతూ అతన్ని గట్టిగా పట్టుకుని ముందుకు నడిపించటానికి ప్రయత్నించాడు.

"నన్ను వదిలేసి నువ్వు పారిపో, గంగూ! నీ ప్రాణాలు కాపాడుకో!" మూసుకుపోతున్న కనుల్ని తెరిచి ఉంచటానికి విఫల ప్రయత్నం చేస్తూ హెచ్చరించాడతన్ని షాడో.

నెత్తిమీద చేతులు పెట్టుకుని అక్కడే చతికిల పడాలన్న కోరికను బలవంతంగా అదుముకుంటూ అగ్గిరాముడైపోయాడు గంగారాం.

"పట్టు వదలని విక్రమార్కుడి అంశతో జన్మించిన మహా మొనగాడిని నేను ... కిందకి జారిపోయినంత మాత్రాన నిన్ను వదిలిపెడతానని అనుకుంటున్నావా?" అంటూ ముందుకు వంగి అమాంతంగా అతన్ని భుజానికి ఎత్తుకున్నాడు. పెద్దపెద్ద అడుగులు వేస్తూ పావుగంట తర్వాత పర్వత పాదాన్ని చేరుకున్నాడు.

అతని ఉద్దేశం ఏమిటో అర్థం అయినట్లు మరింత దారుణంగా కేకలు పెట్టారు ఆటవికులు. ఒకరినొకరు చిత్రవిచిత్రమైన సైగలతో హెచ్చరించుకుంటూ రెట్టించిన వేగంతో ముందుకు దూకారు.

పళ్లు బిగపట్టి పర్వతంపైకి బయలుదేరాడు గంగారాం. అరగంట తర్వాత శిఖరాన్ని చేరుకుని చుట్టూ చూశాడు.

అగ్నిజ్వాలలు ఆవిర్భవించి వేలాది సంవత్సరాలు గతించిపోయినా, ఏదో ఒక క్షణంలో ఇంకోసారి భగ్గుమనబోతున్నట్లు భయంకరంగానే అగుపిస్తోంది అక్కడ ఉన్న ముఖద్వారం.

గోలీలవంటి గులకరాళ్లతో నిండి ఉన్నది ముఖద్వారం చుట్టూ ఉన్న సమతల ప్రదేశం. కాలు జారటం అంటూ జరిగితే గింగిరాలు తిరుగుతూ పోయి ముఖద్వారంలో పడక తప్పదన్నట్లు భీతిని కొలుపుతున్నది అక్కడి వాతావరణం.

రబ్బర్ బమ్మలా వేలాడబడిపోతున్న షాడోని ఏదైనా సురక్షిత ప్రదేశంలో దించిన తర్వాత, తోడేళ్ల గుంపులా పర్వతం మీదికి వచ్చేస్తున్న ఆటవికులను గురించి ఆలోచించాలని అనుకున్నాడు గంగారాం.

అటూ ఇటూ చూస్తూ అడుగులు వేయటంలో, క్రింద ఉన్న గులకరాళ్లను గురించి మర్చిపోయాడతను.

పది అడుగులు కూడా వేయకముందే జర్రున జారాయి అతని పాదాలు. బాలెన్స్ నిలుపుకోవటానికి చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి.

భుజం మీద ఉన్న స్నేహితుడితో సహా పుచ్చకాయ దొర్లినట్లు దొర్లుకుంటూ పోయి అగ్నిపర్వత ముఖద్వారంలో పడిపోయాడు.

***

అడుగుభాగంలో ఉండే రాతి బండలకు గుద్దుకుని తలలు పగిలిపోవటమో, చురకత్తుల మాదిరిగా పొడుచుకు వచ్చిన ముఖద్వారపు అంచులకు తగిలి శరీరాలు చీరుకుపోవటమో తప్పదని అనుకుంటూ కళ్లు గట్టిగా మూసుకున్నాడు గంగారాం.

ఐదు క్షణాల తర్వాత కూడా అనుకున్న పనులు జరగకపోవడంతో ఆశ్చర్యంగా కళ్లు తెరిచాడు.

కొండరాళ్లతో నిండిలేదు అడుగు భాగం ... చెవులు చిల్లులు పడే శబ్దాలు చేస్తూ వేగంగా ప్రవహిస్తున్న భూగర్భ నదీ జలంతో నిండి ఉన్నది.

నీళ్లల్లో పడిన తర్వాత కూడా తేరుకోని తన స్నేహితుడిని మరింత గట్టిగా పొదవి పట్టుకుంటూ, దగ్గర్లో ఉన్న కొండగోడను గట్టిగా పట్టుకోవటానికి ప్రయత్నం చేశాడు గంగారాం.

చండప్రచండ వేగంతో అతన్ని అవతలకు లాగింది ఆ ప్రవాహం. కొండ అడుగు భాగంలో భూమికి సమాంతరంగా ఉన్న పెద్ద సొరంగంలోకి నెట్టింది ...

భూమి పుట్టినప్పుడే తను కూడా పుట్టిన ఆ పరకీ అగ్నిపర్వతం భూమి ఉపరితలం మీదనే కాకుండా, లోపల కూడా కొనసాగించిందట తన ఆర్భాటాన్ని.

ఎప్పుడో అస్సాంలో చక్కర్లు కొడుతున్నప్పుడు ఒక వృద్ధుడు పరకీ పర్వతాన్ని గురించి తనకు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ బెంబేలు పడిపోయాడు గంగారాం.

తాచుపాము విషం రక్తనాళాల ద్వారా మనిషి శరీరాన్ని ఆక్రమించుకుంటున్నట్లు భూగర్భంలో పెద్ద పెద్ద సొరంగాల్ని సృష్టిస్తూ, ప్రయాణం చేశాయట పర్వతం క్రిందనుంచి బయలుదేరిన అగ్నిప్రవాహాలు!

అగ్నిపర్వతం ఆరిపోయిన తర్వాత భూగర్భంలో వచ్చిన రసాయనిక మార్పుల మూలకంగా పెద్ద నది ఉద్భవించిందట ... అగ్నిప్రవాహాలు ఏర్పాటు చేసిన సొరంగాల ద్వారా ప్రయాణం చేసి తూర్పు సముద్రం వరకూ పరుగులు తీస్తుందట...!

సొరంగపు గోడలకు పొడుచుకుని ఒళ్లు చీరుకుపోవటం కంటే, పర్వతం మీదకు వచ్చి తమ కోసం గాలింపు చర్యలను చేపడుతూ ఉండే ఆటవికుల చేతికి చిక్కి ప్రాణాలు కోల్పోవటంకంటే, కోటరెట్లు అధికమైన డేంజరస్ సిచ్యుయేషన్‌లో చిక్కుపడినట్లు గ్రహించేసరికి, దాహం వేస్తున్నట్లు ఎండుకుపోయింది గంగారాం గొంతు.

తన బాహువుల్లోని శక్తి సన్నగిల్లిపోయిన మరుక్షణం తను, తన స్నేహితుడు నీటిలో మునిగి జల సమాధికావటం కంటే మరో మార్గం ఏదీ లేదని అర్థమై ముంచుకు వచ్చేసింది అతనికి దుఃఖం..

"ఈ గండం నుంచి కూడా గట్టెక్కించావంటే బ్రహ్మాండమైన ప్రభలు కట్టించి, అదిరిపోయే జాతర జరిపిస్తాను. మా గురువుగారిని కూడా తీసుకువచ్చి నీకు రక్తాభిషేకాలు చేయిస్తాను!" అని కలకత్తా కాళిని తలుచుకుంటూ ఉండగా మెత్తగా మొహాన్ని స్పృశించింది ఏదో పదార్థం.

భూగర్భ జలాల్లో కాపురం చేసే జలచరం ఏదో వచ్చి మీద పడనే పడిందని అనుకుంటూ ఆ సొరంగపు గోడలు దద్దరిల్లిపోయేటట్లు పొలికేక పెట్టాడతను. పిడికిలి బిగించి ఎటాక్ చేయటానికి సిద్ధపడుతుండగా అర్థం అయింది అసలు విషయం.

ప్రాణాలు తీయటానికి వచ్చిన జలచరం కాదు అది ... షాడో భుజానికి వేలాడుతున్న ఖాళీ ఎయిర్ బాగ్!

అవధులు దాటిపోతున్న ఆనందాన్ని అణచుకోవటం చేతకాక గొంతెత్తి జయజయధ్వానాలు చేశాడతను కలకత్తా కాళీకి. ప్రవాహవేగం మూలకంగా ఏర్పడుతున్న సుడులలో చిక్కుపడి దూరంగా జరుగుతున్న ఆ ఎయిర్ బాగ్‌ని దగ్గరకి లాక్కుని జాగ్రత్తగా పరిశీలించి చూశాడు.

ఎదురు చూడని విధంగా వచ్చి పడే ఎటువంటి ప్రమాదాలనైనా ఎదుర్కోవటానికి కావాల్సిన హంగులు అమర్చి ఉండే సిఐబి బాగ్ అది!

గతంలో ఒకసారి షాడో తనకు చెప్పిన మాటల్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ ఆ బాగ్ పక్కభాగంలో అమర్చి ఉన్న చిన్న చిన్న బటన్స్‌ని గట్టిగా ప్రెస్ చేశాడతను.

టఫ్‌మని శబ్దం చేస్తూ యాక్టివేట్ అయింది బాగ్‌లోపలిభాగంలో భద్రపరచి ఉన్న చిన్న కంప్రెస్డ్ ఎయిర్ సిలెండర్.



కన్ను మూసి కన్ను తెరిచేటంతలో గాలితో నిండిపోయిందా బాగ్... నీటిలో మునిగిపోయే వారిని రక్షించడం కోసం ఉపయోగించే రబ్బర్ ఫ్లోట్ మాదిరి నీటిమీద పరుచుకున్నది.

షాడోని దానిమీదకి లాగి, అతని భుజానికి ఉన్న లెదర్ స్ట్రాప్‌ని తన వంటికి చుట్టుకున్నాడు గంగారాం. షాడో భుజాలమీద తల పెట్టుకుని కనులు మూసుకున్నాడు.

ఊహించటానికి వీలుకాని వేగంతో ప్రయాణం చేసింది నది ... ఇరవై నాలుగు గంటల తరువాత వారిద్దరినీ తీసుకుపోయి తూర్పు సముద్రంలోకి విసిరికొట్టింది.

***

నల్లగా నిగనిగలాడుతున్న తాచుపాములు రెండు తన ఒంటిమీదకి పాకుతున్నట్లు అనిపించి ఒక్కసారిగా కనులు తెరిచాడు గంగారాం.

అదిరిపడి వెనక్కి దూకాడు పాములవంటి సన్నటి చేతులతో అతని దుస్తుల్ని తడుముతున్న వ్యక్తి ఒకతను.

అతనెవరో, తన దుస్తుల్ని ఎందుకు తడుముతున్నాడో, అసలు తను ఎక్కడ ఉన్నాడో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించే వ్యవధి గంగారాంకి లేకపోయింది.

పాతిక అడుగుల దూరంలో పడి ఉన్న షాడో చుట్టూ గుమికూడి ఉన్నారు మరో పదిమంది ఆగంతకులు. తమ సహచరుడి ఆందోళనను అర్థం చేసుకుని భీకరమైన శబ్దాలు చేస్తూ వెను తిరిగారు.

నాగరికుల మాదిరిగానే ఉన్న వారి అవతారాలను గమనించి ముఖం నిండా చిరునవ్వును పులుముకున్నాడు గంగారాం.

"అయ్యలారా! మీ రెవరో, ఎందుకు మా చుట్టూ గుమికూడారో కాస్తంత వివరంగా చెపితే చాలా సంతోషిస్తాను. మీ శత్రువులం కాదు మేము, స్నేహితులమే!" అంటూ క్రిందనుంచి లేచి నిలబడ్డాడు.

నోటిలోని దంతాలన్నీ బయటకు కనిపించేటట్లు పెద్దగా నవ్వి, గబగబా ముందుకు రావాలి ఆ వ్యక్తులు అతని అంచనా ప్రకారం. గట్టిగా కావలించుకోవటమో, చేతుల్ని పట్టుకుని గట్టిగా ఊపటమో చేయాలి.

అటువంటి పనులు ఏమీ చేయలేదు సరికదా, ఆగర్భ శత్రువును చూసినట్లు పెద్దగా కేకలు పెడుతూ, నడుములకు వేలాడుతూ కత్తుల్ని, కటారుల్నీ అందుకున్నారు వాళ్లు.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో వచ్చేసింది గంగారాంకి విపరీతమైన కోపం.

"మర్యాద ఇచ్చి పుచ్చుకోవటం చేతకాని మీ వంటి లఫూట్ రాస్కెల్స్‌తో స్నేహపూర్వకంగా మాట్లాడాలని అనుకోవటం నా తప్పు. గ్రహచారం బాగోక ఎప్పుడో ఎవరో దొంగనాయాళ్లకు పట్టుబడ్డానని చెప్పి, ఎదుటికి వచ్చిన ప్రతి అర్భక సన్నాసికీ భయపడతానని అనుకోవటం మీది తప్పు ... మీ అంతు చూడకపోతే నా పేరు మార్చుకుంటాను!" పళ్లు పటపటమని కొరుకుతూ హెచ్చరించాడు వారిని.

అయినా సరే, ఆగకుండా వేగంగా ముందుకు వచ్చేస్తూండడంతో అటూ ఇటూ చూశాడు సరైన ఆయుధంకోసం.

అటువంటిది ఏదీ అగుపించలేదతనికి. పది అడుగుల దూరంలో ఉన్న ఇసుక గుట్ట చాటుకు దొర్లుకుంటూ పోయిన తమ ఎయిర్ బాగ్ కనిపించింది.

రెండు అంగల్లో అక్కడికి పోయి చేతుల్లోకి తీసుకున్నాడు దాన్ని. కంప్రెస్డ్ ఎయిర్ సిలెండర్‌ని యాక్టివేట్ చేయటానికి ప్రెస్ చేసిన బటన్స్‌నే ఇంకోసారి గట్టిగా అదిమి గాలిలోకి విసిరాడు. కత్తుల్ని, కటారుల్ని గాలిలో ఊపుతూ మిడత దండులా వస్తున్న ఆగంతకుల మధ్య పడింది ఎయిర్ బాగ్. ఆకాశం పగిలిపోయినంత శబ్దాన్ని వెలువరిస్తూ బద్దలైపోయింది.

మెరుపులు మెరిసినట్లు ప్రత్యక్షమైంది కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు. ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయిపోయేటట్లు పైకి లేచింది నల్లటి పొగ.

రాక్షస హస్తం ఏదో పట్టుకుని అవతలికి విసిరేసినట్లు అంతెత్తుకు లేచి పది అడుగుల దూరంలో పడిపోయారు ఆగంతకులు అందరూ.

హడావుడి చేయటం తప్ప ప్రాణాలు తీయటం చేతకాని ఆ సిబిబి ఆయుధం దెబ్బకు అదిరిపోయి పిక్కబలం చూపించటం మొదలుపెట్టారు.

వారి చేతుల్లో నుంచి జారిపోయిన కత్తినొకదాన్ని అందిపుచ్చుకుని పెద్దపులి మాదిరి వెంటపడ్డాడు గంగారాం.

అతనికి అందే ఉద్దేశ్యంగానీ, కత్తి దెబ్బలు తిని కాళ్లూ చేతులూ కోల్పోయే కోరికగానీ లేదు ఆ ఆగంతకులకు. ఒకటి నుంచి పది అంకెలు లెక్క పెట్టేలోగా వేగంగా పరుగెత్తి దృష్టిపథం నుంచి దూరమైపోయారు.

పట్టిన పట్టు వదలకుండా మరి కొద్దిసేపు పరుగులు తీసి, పెద్ద కంఠంతో వారందర్నీ నోటికి వచ్చినట్లు తిట్టిపోశాడు గంగారాం.

"అరిచి కేకలు పెట్టడం వల్ల గొంతు నొప్పి పుట్టడమే తప్ప ఏ విధమైన ఉపయోగం ఉండదు నాయనా! చేతకాని వాళ్లను దోచుకోవటం, ధైర్యంగా ఎదురు తిరిగితే పారిపోవటం ఆ బందిపోట్లకు బాగా అలవాటు!" సన్నపాటి కంఠం ఒకటి మృదువుగా కామెంట్ చేయడంతో ఉలిక్కిపడి వెనక్కి చూశాడు.

షాడోతోపాటు జపాన్ దేశంలో రొండ్లు కొట్టడం వల్ల అక్కడి కుంగ్‌ఫూ విద్యాపీఠంలో కొంతకాలం గడిపి ఉండటం వల్ల పురాతన కాలపు జపనీయుల వేషభాషలు ఎలా ఉంటాయో తెలిసింది అతనికి.

అచ్చు గుద్దినట్లు అదే పద్ధతిలో అగుపిస్తున్నాడిప్పుడు పెద్ద ఇసుకదిబ్బ చాటునుంచి ఇవతలకు వస్తున్న వృద్ధుడు ఒకతను.

ముఖంమీదికి వాలుతున్న తెల్లటి జుట్టును వెనక్కి నెట్టుకుంటూ, విసురుగా వీస్తున్న గాలికి రెపరెపలాడుతున్న కిమినో ఒంటి దుస్తుల్ని గట్టిగా పట్టుకుంటూ విచిత్రంగా చూశాడతను గంగారాంవంక.

"మీరెవరు స్వామీ? పిట్టకూడా కనిపించని ఈ సముద్ర తీరంలో ఒంటరిగా ఏం చేస్తున్నారు?" అవసరమైతే అతివేగంగా ఉపయోగించటానికి చేతిలోని కత్తిని సిద్ధంగా పట్టుకుంటూ, తనకు స్వపరిచితమైన ఆ పాతకాలపు జపనీస్ భాషలోనే ప్రశ్నించాడతన్ని.

"వెన్నెలమడుగు పక్కనే ఉన్న గ్రామంలో వైద్యం చేసి పొట్టపోసుకుంటూ ఉంటాను. కత్తి దెబ్బలకు అమృత సంజీవనిలా పనిచేసే మూలికలు కొన్ని ఈ ఇసుక దిబ్బలమీద లభిస్తాయని ఇటుగా వచ్చాను. వాటికోసం వెదుకుతుండగా బ్రహ్మాండమైన శబ్దం వినిపించింది...!" తనెవరో, అక్కడికి ఎందుకు వచ్చాడో సవివరంగా చెప్పాడతను.

భూగర్భం ప్రవాహంలోనుంచి సముద్రంలో పడిన తర్వాత పద్దెనిమిది గంటలపాటు స్పృహలోనే ఉన్నాడు గంగారాం. ఆ తరువాత దాదాపు బాధను, ఆకలి బాధను తట్టుకోలేక తెలివిని కోల్పోయాడు.

సముద్ర మధ్యంలో ఉన్న ఒక ప్రవాహంలో చిక్కుబడి మోటార్ బోటుకంటే వేగంగా ప్రయాణం చేసింది అతను అంటిపెట్టుకుని ఉన్న రబ్బర్ ఫ్లోట్ వంటి ఎయిర్ బాగ్.

అటు తిరిగి ఇటు తిరిగి జపనీయులు నివశించే ఏదో ఒంటరి ద్వీపం

మీదకి చేరుకోవటం జరిగిందని ఆ వృద్ధుడి మాటల మూలకంగా అర్థమై గుండెలమీద నుంచి కొండంత బరువు తొలగిపోయినట్లు తేలికగా ఫీలయ్యా డతను.

ఆ ప్రదేశాన్ని గురించి, అక్కడ నివశించే ప్రజల గురించి మరికొన్ని ప్రశ్నలు వేసి తన అనుమానా లన్నిటినీ తీర్చుకోవాలని అనుకుంటూడగా మాయమైపోయింది వృద్ధుడి ముఖాన్ని కాంతివంతం చేస్తున్న చిరునవ్వు.

"ఏమైంది నాయనా నీ జతగాడికి? ఎందుకని అలా నిస్తేజంగా పడి ఉన్నాడు?" ఆందోళన నిండిన కంఠంతో పక్కకు చూస్తూ అడిగాడతను.

చేతిలోని కత్తిని అవతలకు విసిరేసి వింటినుంచి వెలువడిన బాణంలా అటుకేసి పరుగెత్తాడు గంగారాం.

"నే నొక వెధవని గురూ! చచ్చుముఖాన్ని ... కత్తులు పట్టుకున్న దొంగనాయాళ్లను ఎదిరించాలన్న ధ్యాసలో పడి నీ గురించి మరిచిపోయిన ఒక టో నంబర్ మడ్డిరాస్కెల్‌ని!" తనను తానే ఘాటైన మాటలతో నిందించుకుంటూ షాడో తలను ఒడిలోకి తీసుకున్నాడు.

పది క్షణాల తరువాత కనులు విచ్చి అతని ముఖంలోకి చూశాడు షాడో. బాధగా నొసలు విరిచి తిరిగి కనులు మూసుకున్నాడు.

పరకీ పర్వత శిఖరం దగ్గర ఆరంభమైన అతని విచిత్ర పరిస్థితి అలాగే కంటిన్యూ అవుతున్నదని గ్రహించేసరికి అధికమైపోయింది గంగారాం ఆందోళన.

"బాధ్యతనంతా నా మీదకి నెట్టేసి నువ్వు హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నావా? ఇదేమైనా న్యాయంగా ఉందా?" అని అంటూ బలవంతంగా అతన్ని పైకి లేపబోతుండగా, గబగబా వచ్చాడు తెల్లజుట్టు వృద్ధుడు.

"ఆలోచనలను స్తంభింపచేసి, మనిషిని మైనపు బొమ్మ మాదిరిగా తయారుచేసే భయంకర విషం ఏదో నీ జతగాడి శరీరంలోకి ప్రవేశించింది, నాయనా!" కనురెప్పల్ని చూపుడు వేలితో ఎత్తి, కనుపాపల్ని పరిశీలనగా చూస్తూ అన్నాడు.

పొంగుకు రాబోతున్న దుఃఖాన్ని ఎంతో ప్రయత్నంమీద అదిమిపెట్టుకుంటూ షాడోని మరింత గట్టిగా కౌగలించి పట్టుకున్నాడు గంగారాం.

పరకీ పర్వతం దగ్గరికి పోయేటంతవరకూ బాగానే ఉన్నాడు తన స్నేహితుడు. అడ్డువచ్చిన ఒక ముళ్ల పొదమీదనుంచి అవతలకు దూకిన వెంటనే వచ్చేసింది అతనిలో మార్పు ... విషప్రయోగం ఏదైనా జరిగితే అక్కడే... ఆ పొద దగ్గరే జరిగి ఉండాలి.

జరిగిపోయిన సంఘటల్ని జాగ్రత్తగా గుర్తు చేసుకుంటూ వృద్ధుడి మాదిరిగా షాడో కనుల్ని మాత్రమే పరీక్ష చేయకుండా పాదాలవరకూ పరిశీలనగా చూశాడతను.

నడుముకు బిగించి ఉన్న బెల్టు మీద నుంచి టైట్‌గా ఉన్న పాంటు మీదకి దృష్టి మరలుతూండగా, కుడి మోకాలికి వెనుక భాగంలో పాదాల కదలికను నియంత్రించే కండరం దగ్గర అగుపించింది అతనికి నల్లగా నూనె పూసినట్లు మెరుస్తున్న లావుపాటి ముల్లు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ దాన్ని పట్టుకుని బలవంతంగా బయటకు లాగాడతను.

పరకీ పర్వతాగ్రం మీద నుంచి భూగర్భ ప్రవాహంలో పడినప్పుడు కూడా చలనం లేకుండా బొమ్మ మాదిరి ఉండిపోయిన షాడోలో వెంటనే వచ్చేసింది కదలిక ... కుడిపాదాన్ని అటూ ఇటూ కదిలించాడు. తల విదిలించి పైకి లేచే ప్రయత్నం చేశాడు.

పాము కోర మాదిరి పదునుగా ఉన్న ముల్లును చూసేసరికి చెమటలు పట్టేశాయి కాబోలు, అప్రయత్నంగా వెనక్కి జరిగాడు తెల్లజుట్టు వృద్ధుడు.

"అవతల పారేయ్, నాయనా! మరోసారి మన శరీరాలకు తగిలి తన శక్తిని ప్రదర్శించకముందే అవతలికి విసిరేయ్!" అని హెచ్చరిస్తూ, దుస్తుల్లో నుంచి చిన్న గుడ్డ సంచీని బయటకు తీశాడు.

బంజరుబయలు మాదిరిగా ఉన్న ఆ ప్రదేశంలో విషపు ముల్లును వదిలేస్తే అమాయకులనెవరినైనా బాధిస్తుందన్న అనుమానంతో అతని సలహాను పెడచెవిన పెట్టాడు గంగారాం. అవకాశం లభించిన వెంటనే నిప్పుల్లో పడవేయటం మంచిదనే ఉద్దేశ్యంతో తన జేబులో ఉన్న ఒక పాలిథిన్ సంచీని బయటకు తీసి అందులో భద్రపరిచాడు.

గుడ్డ సంచీలోనుంచి రకరకాల మూలికల్ని బయటకు తీసి షాడోచేత బలవంతంగా నమిలించాడు తెల్లజుట్టు వృద్ధుడు.

నీలిరంగులో ఉన్న ఒక లేహ్యాన్ని ముల్లు దిగబడిన ప్రదేశంలో రుద్ది, అతని భుజం తట్టాడు.

పూర్తిగా కాకపోయినా, కొంతవరకూ కోలుకున్నాడు షాడో. తనంతట తనే మెల్లిగా లేచి నిలబడ్డాడు.

"కళ్లు తిరుగుతున్నట్లే ఉన్నది గంగూ! అడుగు వేయడం కాస్తంత ఇబ్బందిగానే అనిపిస్తోంది!" పరుగుపరుగున వచ్చి తన భుజాల్ని పట్టుకున్న స్నేహితుడితో అన్నాడు అస్పష్టంగా.

పొంగుకు వచ్చేసిన ఆనందభాష్పాల్ని అద్దుకోను కూడా అద్దుకోకుండా తెల్లజుట్టు వృద్ధుడికి సాష్టాంగ నమస్కారం చేసినంత పనిచేశాడు గంగారాం.

"మీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావటంలేదు. కోరుకోండి... మీ ఇష్టం వచ్చిన కోరికను నిరభ్యంతరంగా కోరుకోండి...!" దేశంకాని దేశంలో, ముక్కూ మొహం తెలియని ప్రదేశంలో ఉన్న సంగతిని మరిచిపోయి గబగబా అన్నాడు... అని నాలుక కరుచుకున్నాడు.

అతని ఇబ్బందిని గమనించి చిన్నగా నవ్వాడు తెల్లజుట్టు వృద్ధుడు.

"నీ జతగాడు పూర్తిగా కోలుకోవటానికి ఇంకా కొద్ది రోజుల వ్యవధి అవసరం. అంతవరకూ ఈ చుట్టుపట్ల ఉండటం మీ ఆరోగ్యాలకు ఎంతమాత్రమూ మంచిది కాదు. నాతోపాటు మా గ్రామానికి వచ్చేయండి!" సంచీని దుస్తుల్లో దాచుకుంటూ మృదువుగా హెచ్చరించాడు.

మాటా మంతీ లేకుండా కత్తులతో తన మీదకి ఎగబడిన బందిపోట్లు కనులముందు మెదిలి, రెండో ఆలోచన లేకుండా అంగీకరించేశాడు గంగారాం. షాడో భుజాల చుట్టూ చేయి వేసి ముందుకు నడిపించాడు.

ఇసుక దిబ్బచాటుకు పోయి మూలికలతో నిండిఉన్న చిన్న వెదురుబుట్టను వెంటబెట్టుకు వచ్చాడు తెల్లజుట్టు వృద్ధుడు. అల్లంత దూరంలో అగుపిస్తున్న పెద్ద చెట్ల గుంపువైపు దారితీశాడు.

మబ్బుల్ని ముద్దాడేటంత ఎత్తుగా ఉన్న ఆ చెట్లను సమీపిస్తున్నకొద్దీ అతని పరిస్థితిలో పలురకాల మార్పులు వస్తున్నట్లు గ్రహించేసరికి గంగారాంని ఆవరించుకున్నది అనుమానం.

"నా మీద దాడి చేసిన బందిపోట్లు ఆ చెట్ల చాటున మాటువేసి ఉంటారని భయపడుతున్నారా?" ఉండబట్టలేక అడిగేశాడతన్ని.

ముందుకు, వెనక్కి, మధ్యమధ్యలో ఆకాశంలోకి చూస్తూ అడుగులు వేస్తున్న వృద్ధుడి ముఖం మీద వెంటనే ప్రత్యక్షమైంది గంగారాంకి బాగా పరిచయమైన చిరునవ్వు.

"బందిపోట్లు ఒక్కళ్లే అయితే మనం బాధపడవలసిన పని లేదు ... వాళ్లకంటే లక్ష రెట్లు ప్రమాదాన్ని కలిగించే అంశాలు చాలా ఉన్నాయి ఈ



అడవిలో ...!" అంటూ గుబురుగా ఉన్న ఒక చెట్టుకేసి చేయి ఊపాడు.

చెట్టు కొమ్మల్లో చుట్టలు చుట్టుకుని తమవైపే చూస్తున్న పెద్ద కొండచిలువను గమనించేసరికి, దాహం వేస్తున్న అనుభూతి కలిగింది గంగారాంకి.

బరువునంతా తనమీదకి మోపి యాంత్రికంగా అడుగులు వేస్తున్న తన స్నేహితుడిని గట్టిగా పట్టుకుంటూ ఆ చెట్టుకు దూరంగా జరగబోతుండగా, ఉన్నట్లుండి పక్కకు దూకాడు వృద్ధుడు.

"పారిపొండి... పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి! మన జాడల్ని పసికట్టేసింది టంటురా రాబందు!" అంటూ దగ్గర్లో ఉన్న ఒక కొండరాయి చాటుకు పరుగుతీశాడు.

అటువంటి మాటల్ని రెండవసారి చెప్పించుకునే అలవాటు ఏనాడూ లేదు గంగారాంకి. అటూ ఇటూ ఊగుతున్న స్నేహితుడిని అమాంతంగా ఎత్తి భుజంమీద వేసుకున్నాడతను. గుబురు చెట్టుమీద కొండ చిలువ తమకేసి తలను జాస్తున్నా లెక్కచేయకుండా ఇంకో వృక్షం క్రిందికి పరుగు తీశాడు.

తన రెక్కల విసురుతో ఆ సమీపంలోని పొదలన్నిటినీ చెల్లాచెదురు చేస్తూ అతను అంతకుముందే ఖాళీ చేసిన ప్రదేశంలో ఏటవాలుగా దూసుకువచ్చింది బోయింగ్ విమానం అంత ఉన్న బ్రహ్మాండమైన టంటురా రాబందు.

ఆఖరి క్షణంలో తనకు స్లిప్ ఇచ్చేసిన మానవుల్ని తలుచుకుని కోపంతో చెవులు చిల్లులు పడే విధంగా వికృతమైన అరుపు అరిచి ఆకాశంలోకి వెళ్లిపోయింది.

క్రిందికి జారబోతున్న కొండచిలువ కూడా ఆ భయంకర విహంగాన్ని చూసి చెట్టు కొమ్మల్లోకి పారిపోవటాన్ని కనుచివరల నుంచి గమనిస్తూ వృద్ధుడికేసి తిరిగాడు గంగారాం.

"మీ అవతారాలు, మీ మాటలు విచిత్రంగా ఉండేసరికి ఇక్కడి ప్రమాదాల్ని ఏ విధంగా ఎదుర్కోగలరోనని సందేహించాను. మీ వేగం నాకు ముచ్చట గొలుపుతోంది!" దుస్తులకు అంటుకున్న దుమ్మును దులుపుకుంటూ అన్నాడు వృద్ధుడు. యథాప్రకారం చుట్టూ ఉన్న పరిసరాల్ని పరిశీలనగా చూసుకుంటూ ప్రయాణం కంటిన్యూ చేశాడు.

రెండు గంటలపాటు ఎక్కడా ఆగకుండా అడుగులు వేసేసరికి దిగజారిపోయింది షాడో స్టామినా.

"దాహం వేస్తోంది, గంగూ! కాసిని మంచినీళ్లు తాగితే బాగుంటుందని అనిపిస్తోంది!" అంటూ దగ్గర్లో ఉన్న ఒక చెట్టు మొదలుకు ఆనుకోబోయాడు.

రెండు అంగుళాల పొడవున్న కొండెను నిటారుగా నిలబెట్టి, బరబరా పరుగెత్తుకు రాబోయింది ఒక మండ్రగబ్బ.

చేతికి అందిన ఒక చెట్టు కొమ్మను చటుక్కున విరిచి టపీమని బాదాడు గంగారాం. ఒకే ఒక దెబ్బకు పరలోకానికి పంపించేశాడు.

మెచ్చుకోలుగా చూస్తున్న వృద్ధుడికి తన స్నేహితుడి కోరికను వినిపించి, అతని మూలికల బుట్టలో ఉన్న తాంబేటికాయవంటి పాత్రను తీసుకున్నాడు.

"ఇక్కడికి దగ్గర్లోనే ఉంటుంది చిన్న కొండవాగు! జాగ్రత్తగా వెళ్లిరా!" అంటూ చెట్ల సందుల్లో ఉన్న చిన్న కాలిబాటను అతనికి చూపించాడు వృద్ధుడు.

చెట్టు మొదలకు ఆనుకుని ఉన్న షాడోని చెట్టు మొదట్లో కూర్చోబెట్టి మండ్రగబ్బలవంటి ప్రమాదకర ప్రాణులు అక్కడ లేవని నిర్ధారించుకున్న తరువాత కాలిబాటవైపు బయలుదేరాడు గంగారాం.

పది నిమిషాల తరువాత అగుపించింది అతనికి వృద్ధుడు చెప్పిన కొండవాగు. ఒడ్డున ఉన్న బురద తన దుస్తులకు అంటకుండా చూసుకుంటూ ముందుగా తను తీసుకువచ్చిన పాత్రను నీటితో నింపుకున్నాడతను. ఆ తరువాత మరో అడుగు ముందుకు వేసి నీటిని దోసిటిలోకి తీసుకోబోతుండగా అల్లకల్లోలమయింది వాగు.

లావుపాటి మర్రివూడల మాదిరి హఠాత్తుగా నీటిపైకి వచ్చాయి నాలుగు ఆకారాలు ... ముందుకు జాచి ఉన్న అతని చేతుల్ని చుట్టుకున్నాయి వాటిలో రెండు ... భుజాల మీదనుంచి మెడవరకూ ఎగబాకాయి మిగిలిన రెండూ.

ఏమాత్రం ఆలస్యం చేసినా అక్కడికక్కడే ఖతమైపోవడం తప్పని సరి అని గ్రహించి, విసురుగా పైకి లేచాడు గంగారాం. శరీరంలో ఉన్న శక్తినంతా ఉపయోగించుకుంటూ వెనక్కి దూకాడు.

అతనంత వేగంగా వయొలెంట్‌గా కదులుతాడని ఊహించలేదు కాబోలు, పట్టును కోల్పోయి నీటిలో పడిపోయాయి ఆ ఆకారాలు.

ఈల వేసినట్టు సన్నటి శబ్దాలను వెలువరుస్తూ రెండు క్షణాలపాటు ఒడ్డు మీది బురదను తడిమి అదృశ్యం అయిపోయాయి.

గుబగబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ ఒడ్డుకు దూరంగా పెట్టిన మంచినీటి పాత్రను అందుకోబోయాడు గంగారాం.

అదే సమయంలో కాలిబాటను ఆనుకుని ఉన్న పొదల్లోనుంచి అతని చెవులకు చేరింది అస్పష్టమైన అడుగుల సవ్వడి.

వాగులో నుంచి ప్రత్యక్షమైన ప్రమాదం వంటిదే తను వెళ్లవలసిన దారిలో మాటువేసిందని అనుకుంటూ చెంగున దూకాడతను అటుకేసి.

"రౌడీలకు రౌడీ అని పేరు పొందిన ఈ గంగారాం సాబ్‌ను అదరగొట్టగల శక్తి ఈ ప్రపంచంలో ఏ ప్రాణికీ లేదు! మర్యాదగా పొదలోనుంచి బయటకు రాకపోతే మెడపట్టుకుని ఇవతలకు ఈడుస్తాను!" అంటూ పొదమీద చేయి వేయబోతుండగా లేడి పిల్ల దూకినట్టు బయటకు దూకింది ఒక యువతి.

అందం అనే పదానికి అర్థాన్ని అందరికీ తెలియచెప్పటం కోసం దేవుడు ఆమెను తయారుచేశాడని అనిపించింది గంగారాంకి.

"ఎవరు నువ్వు? క్షణానికి ఒక ప్రమాదం ఎదురయ్యే ఈ అడవిలో ఒంటరిగా ఏం చేస్తున్నావు?" దుమ్ము ధూళితో నిండి ఉన్న ఆమె ముఖాన్ని, దుస్తుల్ని చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు.

మాటలతో ఇవ్వలేదా యువతి సమాధానాన్ని. కంటికి కనిపించనంత వేగంతో పెద్ద కైజారును బయటకు తీసి ఆడచిరుత మాదిరి అతనిమీదకు లంఘించింది.

వాగులో ప్రత్యక్షమైన ఆకారాల్ని తప్పించుకోటం కోసం ఎంత వేగంగా వెనక్కి దూకాడో అంతకు రెట్టింపు వేగంతో వెల్లకిలా పడ్డాడు గంగారాం. పడుతూ పడుతూ కుడిపాదాన్ని పైకెత్తి ఆమె తొడల మీద బలంగా తన్ని మరీ కింద పడ్డాడు.

అతనలా కదులుతాడని ఊహించలేదు కాబోలు, ఈదురు గాలికి తలలు వంచే వెదురుగడల మాదిరి అటూ ఇటూ ఊగిపోతూ వాగు ఒడ్డున ఉన్న బురదలో పడిందా యువతి.

"ఇవతలికి వచ్చేయ్! ఆలస్యం చేశావంటే హతమారిపోతావు...! వెంటనే వచ్చేయ్ ఇవతలికి!" తనకు ఎదురైన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని గట్టిగా అరిచాడు గంగారాం. అరవడంతో ఆగకుండా చటుక్కున పైకి లేచి ఆమె దగ్గరకు జంప్ చేశాడు.

ఎదురు దెబ్బ తీయటం కోసమే అతనలా వస్తున్నాడని భ్రమపడిందా

యువతి. కైజారును మరింత గట్టిగా బిగించి పట్టుకుంటూ ఇంకా కాస్త వెనక్కి జరిగింది.

చప్పుడు చేయకుండా నీటిమీద ప్రత్యక్షం అయ్యాయి గంగారాంని ఒడిసి పట్టుకోవటానికి ప్రయత్నించిన ఆకారాలు. ఆందోళన నిండిన కంఠంతో హెచ్చరికలు చేస్తూ ముందుకు వస్తున్న గంగారాం మీదనే దృష్టిని కేంద్రీకరించి ఉండటం వల్ల వెంటనే గుర్తించలేకపోయిందా యువతి ఆ ప్రమాదాన్ని. గుర్తించి గిలగిలా కొట్టుకోవటం మొదలుపెట్టేసరికి చేయిదాటిపోయింది పరిస్థితి.

కైజారును పట్టుకున్న ఆమె చేతిని బలంగా పట్టుకున్నది ఒక ఆకారం. నడుమును వాటేసుకున్నాయి వాటిలో రెండు. మెడను చుట్టుకుని నీటిలోకి లాగటం మొదలుపెట్టింది నాలుగవది.

ఆమె చేతిలోని కైజారును తను అందుకుని ఎడా పెడా దెబ్బలు వేద్దామని అనుకున్నాడు గంగారాం ... అలా అనుకుంటూ ఉండగానే ఆమె చేతిలోనుంచి జారి నీటిలో మునిగిపోయిందా ఆయుధం.

దగ్గర్లో ఉన్న ఒక చెట్టు కొమ్మను విరిచి ఎటాక్ చేస్తే ఎలా ఉంటుందో అని ఆలోచిస్తున్న గంగారాం ఆలోచన పూర్తి కాకముందే మెడలోతున నీటిలోకి వెళ్లిపోయిందా యువతి.

ఒడ్డు మీద ఉన్న అపరిచిత వ్యక్తిని తప్పుగా అర్థం చేసుకోవటం జరిగిందన్న భావం అప్పుడు అలా నీటిలో మునిగిపోతున్నప్పుడు ప్రతిఫలించింది ఆమె కన్నుల్లో.

"రక్షించండి... దయచేసి నన్ను రక్షించండి!" అస్పష్టమైన కంఠంతో దిగాలుగా అరిచింది ఆమె.

ఆగలేకపోయాడు గంగారాం. ఆ సిచ్యుయేషన్‌లో తన స్నేహితుడు ఉండి ఉంటే ఏం చేసేవాడో, ఎలా రియాక్ట్ అయ్యేవాడో ఊహించటానికి ప్రయత్నిస్తూ నీటిలోకి దూకుతుండగా ఫ్లాష్ అయిందతనికి బ్రహ్మాండమైన ఐడియా ఒకటి.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా దుస్తుల్లోకి చేయి పోనిచ్చి, పాలిథిన్ సంచీలో భద్రపరిచిన విషపు ముల్లును బయటకు తీశాడతను.

"నా చేతికి అడ్డు రాకు అమ్మడూ! అనవసరంగా కదిలి నా ఎయిమ్‌ని పాడుచేయకు!" అని ఆ పడుచును హెచ్చరిస్తూ, నీటిమీద అగుపించిన ఆకారం మీద ప్రయోగించాడు ఆ ఆయుధాన్ని.

తాచుపాము బుసకొట్టినట్లు భీకరమైన శబ్దాన్ని వెలువరుస్తూ ఆ యువతి మెడను వదిలిపెట్టిందా ఆకారం. నిట్టనిలువుగా పైకి లేచి అతని చేతిని చుట్టుకోవటానికి ప్రయత్నించింది.

ఎటువంటి మత్తుమందులనైనా భోలాశంకరుడి మాదిరి భరించే మా గురువుగారినే తల్లకిందులు చేసిన కాలకూట విషం ఇది! నీటిని వదిలి బయటకు రాలేని అర్భక ప్రాణివి ... నువ్వెంత, నీ బతుకెంత? అంటూ పోటు మీద పోటుగా మరో రెండు పోట్లు పొడిచి, మిగిలిన ఆకారాల మీదకి దృష్టిని మరలించాడు గంగారాం.

కదులుతూ కదులుతూ శిలావిగ్రహంలా నిలబడిపోయిన షాడో మాదిరిగానే నిస్సత్తువుగా నీటి మీదకి పడిపోయాయా జలప్రాణులు.

క్షణం ఆలస్యం చేయకుండా ఒడ్డు మీదకి పాకిందా పడుచుపిల్ల. ను ప్రాణాలను కాపాడినందుకు కనీసం కృతజ్ఞతా పూర్వకంగా ఒక్క చూపు కూడా చూడకుండా పొదల్లోకి పారిపోయింది.

ఆమెను గురించి తెలుసుకోవాలనే ఆలోచనకు ఫుల్‌స్టాప్ పడేసరికి కోపంగా తల విదిలిస్తూ ఒడ్డుకు చేరుకున్నాడు గంగారాం.

"ఈ ఆడపిల్లలు ఎప్పుడు ఏ విధంగా ప్రవర్తిస్తారో వారికే తెలియదని నా అభిప్రాయం! ఎదుట ఉన్న నాలాంటి వాళ్లకు తెలుస్తుందని అనుకోవటం వట్టి భ్రమ!" తనలో తను గొణుగుకుంటూ, మంచినీటి పాత్రను తీసుకుని కాలిబాటవైపు అడుగులు వేశాడు.

***

నీలి రంగులోకి ఉన్న లేహ్యాన్ని షాడో కాలికి పట్టించి, ఏవేవో అడవి ఆకులతో పెద్ద కట్టుకట్టాడు తెల్లజుట్టు వృద్ధుడు.

"నీ జతగాడికి వచ్చిన భయం ఏదీ లేదు. తెల్లవారేసరికి పూర్తి ఆరోగ్యంతో లేచి కూర్చుంటాడు!" అని హామీ ఇచ్చి వెనుక గదిలోకి వెళ్లిపోయాడు.

పికిలి పిట్టల మాదిరి కిచకిచలాడుతూ ఇంటి ముందు గుమికూడి ఉన్న గ్రామస్థుల వంక కోపంగా చూడబోయి ఆఖరి క్షణంలో తమాయించుకున్నాడు గంగారాం.

అంతకుముందు రెండు ఘడియల క్రితం గ్రామంలోకి వచ్చినప్పటినుంచీ పోటీలు పడి అతిథి మర్యాదలు చేస్తున్నారు వాళ్లు. ఏది కావాలన్నా వెంటనే తీసుకువచ్చి ఇవ్వటానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నారు.

అటువంటి వారివంక ఆగ్రహంగా చూడటం పద్ధతిగా ఉంటుందా?

వేడి వేడి తినుబండారాల్ని పెద్ద పళ్లెరంలో పెట్టి ఆ గదిలోకి వచ్చిన తెల్లజుట్టు వృద్ధుడి తెల్లజుట్టు భార్యను గమనించగానే తన ఆలోచనల్ని అదుముకుని చిరునవ్వు నవ్వాడతను. అనవసరమైన మొహమాటాన్ని ప్రదర్శించకుండా ఆ పళ్లెరాన్ని ఒళ్లో పెట్టుకుని ఆవురావురుమంటూ లాగించటం మొదలుపెట్టాడు. అంతకుముందు పది నిమిషాల క్రితం ఒక గ్రామస్తుడు అతి రహస్యంగా తెచ్చి ఇచ్చిన కాపు సారావంటి పానీయాన్ని మధ్యమధ్యలో రుచి చూస్తూ తృప్తిగా తల ఊపాడు.

అతని భోజన కార్యక్రమం పూర్తి అయ్యేదాకా ఆగి, మెల్లగా ముందుకు వచ్చారు గ్రామస్థుల్లో పెద్దవాళ్లు కొద్దిమంది.

"ఎక్కడనుంచి వచ్చారు మీరు? ఎందుకు వచ్చారు?" అడవిని గురించి, అందులోని ప్రమాదాలను గురించి కాస్సేపు ముచ్చటించి, హఠాత్తుగా అసలు విషయంలోకి వచ్చేశాడు ఒక పెద్దమనిషి.

మత్తు పానీయపు మైకంలో మునిగి తన కథనంతా వినిపించటానికి సిద్ధపడబోయాడు గంగారాం.

మాటలు అతని పెదవుల్ని దాటి బయటకు రాకముందే, ఆ ఇంటి ముందున్న గ్రామస్థుల్లో చెలరేగింది దారుణమైన కలకలం!

"పర్వత రాక్షసుడు వచ్చేశాడు... పారిపొండి.... పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి!" అని కేకలు పెడుతూ చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకుల మాదిరి చెల్లా చెదరైపోయారు వాళ్లు.

తన ముందు కూర్చుని ఉన్న గ్రామపెద్దలు కూడా అదే పని చేసేసరికి ఆశ్చర్యంతో బ్రాన్పడిపోయాడు గంగారాం.

మత్తు పానీయపు పాత్రను గట్టిగా పట్టుకుని ఇంటిముందున్న ఖాళీ స్థలంలోకి వచ్చేసరికి అతనిని కూడా ఆవరించుకున్నది శరీరమంతా చెమటలు పట్టేటంతటి భయం.

మర్రిచెట్టు మొదళ్లవంటి పెద్దపెద్ద చేతుల్ని విసురుగా ఊపుతూ, అడ్డువచ్చిన కట్టడాలన్నింటినీ కాళ్లతో తన్ని కిందకు కూలదోస్తూ వీరవిహారం చేస్తున్నాడు పద్దెనిమిది అడుగుల పొడవున్న మహాకాయుడు ఒకతను.

బాకులవంటి దంతాలు బయటికి అగుపించేలా నోటిని తెరిచి వికృతమైన కేకలు పెడుతున్నాడు. ప్రాణభయంతో పరుగులు తీస్తున్న గ్రామస్థుల్ని పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

"నీ జతగాడిని భుజంమీద వేసుకుని నువ్వు కూడా అడవిలోకి పారిపో



నాయనా! ఆ రాక్షసుడి కంటపడ్డావంటే హతమారిపోతావ్! అరటి ఊచల్ని విరిచినట్లు విరిచేస్తాడు నీ అవయవాల్ని ... అడవి దుంపల్ని నమిలినట్లు ఎముకలతో సహా నమిలేస్తాడు!" విపరీతమైన భయంతో వణికిపోతూ గంగారాంని హెచ్చరించింది తెల్లజుట్టు వృద్ధుడి భార్య. అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా భర్తను వెంటబెట్టుకుని ఎటో పారిపోయింది.

చేతిలోని పాత్రను క్షణాల మీద ఖాళీ చేసి వెనక్కి తిరిగాడు గంగారాం. హాయిగా నిద్రపోతున్న తన స్నేహితుడి దగ్గరకి పరుగెత్తుకు రాబోతుండగా, ఒక ఇంటిచాటున దాక్కుని ఉన్న గ్రామస్థుడిని గట్టిగా పట్టుకున్నాడు మహాకాయుడు.

గావురు గావురుమని అరుస్తూ గిలగిలా కొట్టుకోవటం మొదలుపెట్టాడా గ్రామస్థుడు. ఎవరైనా వచ్చి రక్షించే ప్రయత్నాలు చేయమని హృదయ విదారకంగా మొరపెట్టుకోసాగాడు.

తనకు మత్తుపానీయాన్ని తెచ్చిచ్చినది అతనేనని గుర్తుపట్టేసరికి మతిపోయినంత పని అయింది గంగారాంకి.

"అందరి మాదిరిగా అవతలికి పారిపోకుండా పెద్ద మొనగాడి పోజు వేసినందుకు ఫలితం ఇలాగే ఉంటుంది. బుద్ధిలేదు మిత్రమా నీకు! పెద్ద చచ్చుదద్దమ్మవి నువ్వు!" కచ్చగా అటూ ఇంటి ముందు కనిపించిన పొడుగాటి వెదురు గడను చేతుల్లోకి తీసుకున్నాడు.

చేతికి చిక్కిన ఆ గ్రామస్థుడి అరుపుల్ని ఇసుమంత కూడా కేర్ చేయకుండా మెడలు విరిచేయటానికి సిద్ధం అవుతున్నా డా మహాకాయుడు.

ఒలింపిక్ పోటీల్లో జావలిన్ త్రోయర్ మాదిరి అడ్డదిడ్డంగా అడుగులు వేస్తూ పరుగెత్తాడు గంగారాం ... పాతిక గజాల దూరంలోకి పోగానే శరీరంలోని శక్తినంతా చేతుల్లోకి రప్పించుకుంటూ విసిరేశాడు వెదురుగడని.

జావలిన్ మాదిరి ఝూమ్మని శబ్దం చేస్తూ గాలిలోకి లేచిందది ... సూటిగా పోయి మహాకాయుడి ఎడమ భుజం మీద దిగబడింది.

ఆకాశంలోని మబ్బులు చెల్లా చెదరైపోయేటట్లు అరచి కింద పడిపోతాడని అనుకున్న గంగారాంకి వెంటనే తగిలింది పెద్ద షాక్.

చీపురుపుల్ల గుచ్చుకున్నట్లుగా కూడా చలించలేదతను. ఒక్క విదిలింపుతో ఆ వెదురుగడని మధ్యగా విరిచేసి, చేతుల్లో ఉన్న గ్రామస్థుడిని వదిలేశాడు... పిడికిళ్లతో గుండెల్ని బాదుకుంటూ బుల్‌డోజర్ మాదిరిగా వచ్చి గంగారాం మీద పడ్డాడు.

గావురుగావురుమని అరవటం తనవంతయిందని గ్రహించి, పిక్కబలం చూపించటానికి రెడీ అయిపోయాడు గంగారాం.

పది అడుగులు కూడా పోకముందే మహాకాయుడి చేతులు తన మెడమీదకి వచ్చేస్తూ ఉండటాన్ని గమనించి, గ్రామస్థుడి మాదిరిగానే గొంతు చించుకున్నాడు.

"చెరుకు ముక్కని నమిలినట్లు ఈ దొంగనాయాలు నన్ను నమిలేయబోతుంటే చీమ కుట్టినట్లుగా కూడా పట్టించుకోకుండా హాయిగా నిద్రపోతున్నావా! రక్షించు గురూ! నన్ను కాపాడు!" అంటూ షాడోని ఉద్దేశించి అరిచాడు.

ఇండస్ట్రియల్ వేస్ట్‌తో నింపిన మురికి చెరువు మాదిరి దుర్వాసన వెలువరుస్తున్న నోటిని ఇంతలావున తెరిచి గంగారాం మెడమీదకి వంగబోతున్న మహాకాయుడి వెనుక భాగంలో ప్రత్యక్షం అయ్యాడు అన్‌స్టడీగా అడుగులు వేస్తున్న షాడో.

తెల్ల జుట్టు వృద్ధుడు ఉపయోగించిన మందుల మూలకంగా చాలాభాగం క్యూర్ అయిపోయింది అతని అస్వస్థత.

కుడిపాదం మీద బరువును మోపకుండా గాలిలోకి ఎగిరాడతను. ఎడమ పాదాన్ని ముందుకు జాచి ఫెడీమని తన్నాడు.

గ్రామంలోకి అడుగుపెట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా బాధాసూచకమైన చిన్న ధ్వనిని వెలువరించాడు మహాకాయుడు... గంగారాంని వదిలేసి గిర్రున వెనుతిరిగాడు.

రెండో ఆలోచన లేకుండా కింద కనిపించిన పెద్ద కొండరాయిని గాలిలోకి ఎత్తాడు గంగారాం... హుమ్మని హుంకరిస్తూ అతని చీలమండలకేసి కొట్టాడు.

అతనికేసి తిరిగితే వెనుకభాగంలో ఇంకో దెబ్బ పడుతుందని అర్థం అయింది కాబోలు. చేతుల్ని అల్లల్లాడిస్తూ గాలిలోకి ఎగిరాడు మహాకాయుడు. పాతిక అడుగుల దూరంలో నేలను తాకి ఒక ఇంటి గోడను ఎడమ పాదంతో కూలదోశాడు.

"నా బిడ్డ... అయ్యబాబోయ్ నా భార్య!" విపరీతమైన ఆందోళనతో కంపించిపోతూ, తను దాక్కున్న స్థలంలోనుంచి ఇవతలికి పరిగెత్తుకువచ్చాడు గంగారాంకి మత్తుపానీయాన్ని సప్లయ్ చేసిన గ్రామస్థుడు.

కూలిపోయిన గోడమీదనుంచి ఇంట్లోకి దూరి, పదిరోజుల వయస్సు కూడా పూర్తిగా నిండని పురిటికందుని, అతని భార్యను బిగించి పట్టుకున్నాడు మహాకాయుడు.

ఒకరినొకరు చూపులతోనే హెచ్చరించుకుంటూ స్నేహితులిద్దరూ తనను సమీపించకముందే, ఆ ఇంటి వెనుకభాగంలో ఉన్న చెట్లమధ్యకు పరుగుతీసి అదృశ్యం అయినాడు.

***

"లేక లేక కలిగిన సంతానాన్ని పోగొట్టుకుని, ప్రాణంలో ప్రాణమైన భార్యను ఆ పర్వత రాక్షసుడికి బలి ఇచ్చి బతికి ఉండలేను నేను! వెన్నెల మడుగులో దూకి ప్రాణత్యాగం చేస్తాను!" కన్నీటితో మలినమైన బుగ్గల్ని అరచేతులతో అద్దుకుంటూ తన నిర్ణయాన్ని వినిపించాడు ఆ గ్రామస్థుడు.

అతని చుట్టూ గుమికూడిన గ్రామస్థుల్లో వెంటనే చెలరేగింది కలకలం. ముఖాలను చేతుల్లో దాచుకుని బావురుమన్నారు స్త్రీలు ... బాధనిండిన ముఖాలను క్రిందికి వంచుకుని రాతి బొమ్మల్లా నిలబడిపోయారు వృద్ధులు.

ఉన్నట్లుండి ముందుకు వచ్చి తెల్లజుట్టు వృద్ధుడి భుజం మీద చేయి వేసింది అతని భార్య.

"ఎదురు చూడని ప్రమాదాలను సైతం ఎంతో నేర్పుగా ఎదుర్కొనే వేగం మన ఇంటికి వచ్చిన అతిథులకు ఉందని నువ్వు చెప్పావ్! అందరి మాదిరిగా అవతలికి పారిపోకుండా పర్వత రాక్షసుడిని ఎదిరించే ప్రయత్నం వాళ్లు చేయటాన్ని మనమందరం కళ్లారా చూశాం!" మృదువైన మాటలతో సంభాషణను ప్రారంభించిందామె.

ఏడుపుల్ని ఆపి కుతూహలంగా చూశారు అక్కడి స్త్రీలు. ఆమె అభిప్రాయాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ అటెంటివ్‌గా వినసాగారు మగవాళ్లు.

"చేతులు జోడించి వారిద్దరి ముందు ప్రాధేయపడదాం మనం... మన ఆడపడుచుకి లేకలేక ఆమెకు కలిగిన బిడ్డను కాపాడమని ప్రార్థిద్దాం!" అనవసరమైన మాటలతో కాలహరణం చేయకుండా సూటిగా తెలియచెప్పిందామె తన ఆలోచనను.

రెండు క్షణాలు ఆలోచించి అంగీకార సూచకంగా తల ఊపాడు తెల్లజుట్టు వృద్ధుడు.

"మన అతిథులు ఎక్కడ ఉన్నారో చూడండి. మీ అందరి తరఫున నేనే వారిని వేడుకుంటాను!" అంటూ ఉండగా, ఆయాసంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ పొలిమేరలలో నుంచి పరుగెత్తుకు వచ్చారు ఇద్దరు యువకులు.

గ్రామాన్ని వదిలిపోయిన పర్వత రాక్షసుడు మరోసారి వచ్చి పడబోతున్నాడన్న భయంతో చెల్లా చెదురు కాబోతున్న గ్రామస్థులనందర్నీ కదలకుండా నిలబెట్టేశాయి వారి మాటలు.

"పర్వత రాక్షసుడి వెనకాలే పరుగులు తీస్తూ నల్లరాళ్ల కొండల్లోకి పోతున్నారు మన గ్రామానికి అతిథులుగా వచ్చిన ఇద్దరూ! ఆ దుర్మార్గుడిని వదిలిపెట్టే లక్షణాలు వారిలో కనిపించటంలేదు!" ఆయాసాన్ని అణచుకునే ప్రయత్నాలు చేయకుండా గబగబా చెప్పి, వచ్చినంత వేగంగానే వెనుతిరిగారు ఆ యువకులు.

తమ చెవుల్ని తామె నమ్మలేనట్లు విస్ఫారిత నేత్రాలతో ఒకరి ముఖంఒకరు చూసుకుంటున్న మగవాళ్లను గమనించి అసహనంగా పైకి లేచింది అక్కడ ఉన్న ఆడవారిలో ఒక మధ్యవయస్కురాలు.

"ముక్కూ మొహం తెలియని పరాయి వ్యక్తులకున్న ధైర్యసాహసాల్లో వెయ్యోవంతు మీకు ఉండి ఉంటే ఈ రోజు ఇటువంటి బాధను భరించవలసిన అవసరం మనకు కలిగేదీ కాదు. ఎందుకూ పనికిరాని వారిమాదిరి మీరందరూ గ్రామంలోనే ఉండిపోండి... నేను నల్లరాతి కొండలమీదికి పోతాను. పర్వత రాక్షసుడి భరతం పట్టడంలో మన అతిథులకు సహాయపడతాను!" అంటూ అక్కడి వారి సమాధానంకోసం ఎదురు చూడకుండా, కొంచెం దూరంలో ఉన్న తన ఇంట్లోకి పరుగెత్తి పొడుగాటి కత్తినొకదాన్ని తీసుకున్నది.

అంతకు ముందువరకూ ఏడ్పి రాగాలు తీసిన స్త్రీలలో వెంటనే వచ్చింది చలనం. ఒకరి నొకరు హెచ్చరించుకుంటూ రకరకాల ఆయుధాల్ని అందుకున్నారు వాళ్లు.

ఆ దృశ్యాన్ని చూసేసరికి రోషం ఉప్పొంగి తాము కూడా కదిలారు మగవాళ్లు. అరుపులతో కేకలతో గ్రామాన్ని దద్దరిల్లజేస్తూ పొలిమేరల వైపు బయలుదేరారు.

నిలుచున్నవాడు నిలుచున్నట్లుగానే మోకాళ్లమీదకు వాలి, ఆకాసంకేసి చేతులు జాచాడు తెల్లజుట్టు వృద్ధుడు.

"ఎదుటపడిన ప్రమాదాల నుంచి పిరికివాళ్ల మాదిరిగా పరుగులు తీయటం తప్ప ఎదురు తిరిగే ధైర్యం లేని మా జీవితాల్లో కొత్త వెలుగును నింపే ఆలోచన చేస్తున్నావా తండ్రీ? ముక్కూ మొహం తెలియని అతిథులను మా మధ్యలోకి పంపి మంచుమాదిరి గడ్డకట్టుకుపోయిన మా పౌరుషాలను తిరిగి ప్రజ్వరిల్లచేస్తున్నావా? ఇంతకాలానికి దయ కలిగిందా మా మీద?" కంటికి కనిపించని సర్వాంతర్యామిని ఉద్దేశించి ప్రార్థన చేస్తూ కనులు మూసుకున్నాడు.

రెండు మూరల పొడవుండే కత్తినొకదాన్ని తెచ్చి అతని ఎదురుగా పెట్టింది అతని భార్య. ఆమె ముఖంలోని అసహనాన్ని గమనించేసరికి, అపూర్వమైన కాంతితో ప్రకాశించింది వృద్ధుడి వదనం!

***

"ఆగరా... దొంగనాయాల! ఆగు, వెనక్కి తిరిగి మావంక ఒకసారి చూడు!" ఆవేశంగా అంటూ ముందుకు దూకబోయిన గంగారాంని బలవంతంగా ఆపాడు షాడో.

"ఆలోచిస్తూ కూర్చోవటానికి ఇది సమయం కాదు, గురూ! ఏదో ఒకటి చేసి వెంటనే ఆదుకోకపోతే అన్యాయంగా హతమారిపోతారు ఆ తల్లీబిడ్డలు!" కోపంగా అన్నాడు గంగారాం.

వంద గజాల దూరంలో ఉన్న ఒక కొండ గుహలోకి పోయిన మహాకాయుడి శారీరక బలాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఇబ్బందిగా తల విదిలించాడు షాడో.

మహిమాకో అడవుల్లో వచ్చేటప్పుడు తెచ్చుకున్న ఆయుధాలన్నీ ఎయిర్‌బాగ్‌తో సహా ఎప్పుడో ఖర్చయిపోయాయి. సిఐబికి సంబంధించిన ఎస్సైన్‌మెంట్ కాకపోవడంతో రివాల్వర్ లేదు తన దగ్గర. కాలి బూట్లలో నిక్షిప్తమై ఉండే లిటిల్ టామీలు కూడా లేవు... జానెడు పొడవు కూడా లేని డాగర్‌తో ఆ రాక్షస శరీరాన్ని గాయపరచటం సాధ్యపడుతుందా?

సమాధానం లభించని సందేహాలతో సతమతం అవుతున్న షాడోని చటుక్కున కిందకు నెట్టి ఒక బండరాయి చాటుకు దొర్లించాడు గంగారాం. అతని పక్కనే మోకరించి కూర్చుని తల వంచుకున్నాడు.

"ఏమైంది గంగూ? ఎందుకింత కంగారు?" అని అడగబోయాడు షాడో.

ఎయిర్‌పోర్ట్‌లో లాండ్ అవబోతున్న బోయింగ్ విమానం మాదిరి కిందకు దూసుకువచ్చిన ఒక బ్రహ్మాండమైన విహంగాన్ని చూసి ఆ మాటల్ని మింగేశాడు.

"మనిషి కనిపిస్తే చాలు కోడిపిల్ల మాదిరి ఎగరేసుకుపోయే టంటురా రాబందుట అది!" సముద్ర తీరంలో తనకు ఎదురైన అనుభవాన్ని లో గొంతుకతో అతనికి వివరిస్తూ చెప్పాడు గంగారాం.

మహాకాయుడు ఎంటర్ అయిన గుహామీదుగా అవతలికి పోయి ఒక చిన్న కొండగుట్టమీద కూర్చుంటున్న ఆ పక్షిని చూసేసరికి షాడో పెదవుల మీదికి పరుగెత్తుకు వచ్చింది చిరునవ్వు.

"పర్వత రాక్షసుడి పీచం అణిచే ఉపాయం తట్టింది. నువ్వు గుహ ముందుకు పోయి సిద్ధంగా ఉండు!" అంటూ బండరాయి చాటు నుంచి లేచి వచ్చిన దారినే వెనక్కి పరుగు తీశాడు.

పూర్తిగా ఆరోగ్యం లభించకుండా అతనలా ఒంటరిగా పరుగులు తీయటం మంచిది కాదని హెచ్చరించబోయి, మాటలు వినబడనంత దూరం వెళ్లిపోయేసరికి విరమించుకున్నాడు గంగారాం.

బూటుకు అడ్డంగా బిగించుకున్న డాగర్‌ని బయటికి తీస్తూ, పెద్ద పెద్ద చెట్లు పెరిగి ఉన్న ప్రదేశంలోకి పోయాడు షాడో. ఎంతోసేపు వెతకవలసిన అవసరం లేకుండానే ఒక చెట్టు చాటున అగుపించింది అతనికి పది అడుగుల పొడవున్న కొండచిలువ.

తన కదలికల్ని గమనించి అది రెచ్చిపోకముందే మీద పడి డాగర్‌తో తలను కత్తిరించేశాడతను. జీవం లేకపోయినా గిలగిలలాడుతున్న శరీరాన్ని చుట్టులుగా చుట్టి భుజంమీదకు ఎత్తుకున్నాడు.

గాలివలన వాసన సోకింది కాబోలు వికృతంగా అరిచి కొండగుట్ట మీద నుంచి లేచింది టంటురా రాబందు.

ప్రాణం లేని చిలువను ఒక బండరాయిమీద పడవేసి బాణంలా కొండగుట్టవైపు పరుగు తీశాడు ... గాలిలో గిరికీలు కొడుతున్న పక్షికి తన జాడలు కనిపించకుండా జాగ్రత్తపడుతూ గుట్ట పైభాగాన్ని చేరుకున్నాడు.

అతని ఊహ యదార్థమని తేలిపోయింది వెంటనే!

పట్టెడు పట్టెడు లావున్న చెట్టుకొమ్మలతో పెద్ద గూటిని కట్టుకున్నదా విహంగం ... గుమ్మడి కాయల సైజులో రెండు గుడ్లను పెట్టి గారాబంగా చూసుకుంటున్నది.

ఒంటిమీద షర్టును ఊడతీసి సంచీ మాదిరిగా ఒకపక్క ముడి వేశాడు



షాడో... గూటిలోని గుడ్లను రెంటినీ అందులోకి నెట్టి భుజం మీద వేసుకున్నాడు.

బండరాయి మీది కొండచిలువను చూసిందా పక్షి... ఏటవాలుగా క్రిందకు దిగటానికి రెడీ అవుతున్నది.

ఏదైనా అనుమానం వచ్చి అది వెనక్కి తిరగటం అంటూ జరిగితే తన పని అక్కడికక్కడే ఖతమై పోతుందని షాడోకి తెలుసు.

అందుకే జాగ్రత్తలన్నీ గాలికి వదిలేసి పరుగులు తీశాడతను. పర్వత రాక్షసుడి గుహను సమీపించి, షర్టులో మూటకట్టిన గుడ్లను గుహముందుకు దొర్లించాడు.

అతని సైగను అర్థం చేసుకుని రెచ్చిపోయాడు గంగారాం.

"బయటకు రారా, దొంగనాయాలా ... దమ్ముంటే బయటకి వచ్చి మమ్మల్ని ఎదిరించరా! బయటికి రా!" తాషామర్బావంటి కంఠంతో గయ్ గయ్‌మని అరుస్తూ చిందులు తొక్కాడు.

చేతికి అందిన రాళ్లను తీసుకుని గుహలోకి విసరాలని కూడా అనుకున్నాడు గానీ, ఆ దుర్మార్గుడికి చిక్కిన తల్లీ బిడ్డలు గాయపడతారన్న భయంతో ఆగిపోయాడు.

బండరాయిమీద తను వదిలిన కొండచిలువను గోళ్లల్లో చిక్కించుకుని కొండ గుట్టమీదకి పోతున్న పక్షివంకే చూస్తున్నాడు షాడో. గూటిలో ఉండవలసిన గుడ్లు గల్లంతయినట్లు గ్రహించిన తర్వాత దాని రియాక్షన్ తను ఊహించిన స్థాయిలో ఉండకపోతే ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాడు.

అతని ఆలోచన ఒక కొలిక్కి రాకముందే భూమి అదిరేలా అడుగులు వేస్తూ గుహ బయటకు వచ్చాడు మహాకాయుడు.

కొండ చిలువను గూటి పక్కన వదిలి గుడ్లకోసం ఆరాటపడటం మొదలుపెట్టింది టంటురా రాబందు. షాడో ఆశించినట్లు పట్టరాని కోపంతో దిక్కులు పిక్కటిల్లేలా కూతలు కూస్తూ గాలిలోకి మాత్రం లేవటంలేదు.

కత్తులవంటి దంతాలను బయటికి కనిపించేలా నోటిని తెరిచి మీదకు వచ్చేసిన మహాకాయుడిని చూసి తొందరపడలేదు షాడో ... ఆఖరి క్షణం వరకూ వెయిట్ చేసి, విధిలేని పరిస్థితిలో ఒక గుడ్డును ఎత్తి అతని ముఖానికేసి కొట్టాడు.

రబ్బర్ బెలూన్ పగిలినట్టు టప్‌మని శబ్దం చేస్తూ పగిలిందా గుడ్డు. పసుపు పచ్చని ద్రవ పదార్థంతో నిలువెల్లా తడిపేసింది అతన్ని.

"ఎటాక్ గంగూ! ఎటాక్!" ఖంగుమంటున్న కంఠంతో స్నేహితుడిని హెచ్చరిస్తూ డాగర్‌ని చేతిలోకి తీసుకున్నాడు షాడో.

లావుపాటి కొండరాయిని అందుకుని మహాకాయుడి వెనుకభాగంలోకి చేరుకున్నాడు గంగారాం. అతని పాదాలను గాయపరిచే ప్రయత్నం మొదలుపెట్టబోతూండగా సుడిగాలి వీచినట్లు అల్లకల్లోలమైంది అక్కడి వాతావరణం.

గాలివాలున తన గుడ్డు పగిలిపోయిన వాసనను పసికట్టి షాడో ఊహించినదానికంటే వెయ్యిరెట్లు ఆగ్రహంతో కంపించిపోతూ వచ్చేసింది టంటురా రాబందు. వచ్చీ రావటంతోటే పందెపు కోడి తన్నినట్లు ఫెడీల్‌మని తన్నింది మహాకాయుడి ముఖంమీద.

కళ్లు బైర్లు కమ్మినట్లు గుడ్డిగా వెనక్కి తూలాడు ఆ రాక్షసుడు. చేతుల్ని జాచి ఆ విహంగాన్ని పట్టుకోవటానికి ప్రయత్నించాడు.

చెవులు చిల్లులు పడేటట్టు అక్కసును వెళ్లగ్రక్కుతూ రివ్వు రివ్వున తన్నిందా పక్షి. పదునైన పట్టకా కత్తిమాదిరిగా ఉన్న ముక్కుతో అతని ముఖాన్ని తీవ్రంగా గాయపరచటం మొదలుపెట్టింది.

తన కన్నుల్ని కాపాడుకోవటం కోసం తలను ముందుకు వంచుకుని, గుడ్డిగా చేతులు ఊపటం మొదలుపెట్టాడు మహాకాయుడు.

అతని ముఖం పగిలిపోయేటట్టు తన్నటానికి ప్రయత్నిస్తూ పొరపాటుగా ఆ కబంధ హస్తాల్లో చిక్కుపడింది టంటురా రాబందు.

ప్రపంచాన్నంతా జయించగలిగినట్లు పట్టరాని సంతోషంతో గుండెలు జలదరించేటట్టు శబ్దాలు చేసి, ఆ మాతృమూర్తి మెడను విరిచేయటానికి ప్రయత్నించాడు మహాకాయుడు.

ఆపైన చూస్తూ నిలబడలేకపోయాడు షాడో... డాగర్‌ని బిగించి పట్టుకుని అతని వెన్నుమీదకు ఎగబాకాడు.

ప్రత్యేకంగా చెప్పించుకోవాల్సిన అవసరం లేకుండానే, తన పద్ధతిలో తను ఆ రాక్షసుడి పాదాలమీద ఎటాక్ ప్రారంభించాడు గంగారాం.

డాగర్ పోట్లను తట్టుకోవటం అసాధ్యం అయింది మహాకాయుడికి. కొండరాతి దెబ్బల్ని భరించటం కూడా కష్టతరమైపోయింది.

గోలగోలగా అరుస్తూ చేతుల్లోని పక్షిని వదిలేశాడతను ... చేతుల్ని వెనక్కి జాచి వెన్నుమీది షాడో చేతుల్ని పట్టుకోవటానికి చూశాడు.

పళ్లు బిగించి పోటుమీద పోటుగా పొడిచేశాడు షాడో... అతని చేతులు తన అవయవాల మీదకి చేరుకుంటూ ఉండగా, మెడ లోపలి భాగంలోని రక్త నాళాలన్నిటినీ ఛేదించేశాడు.

తుఫానులో చిక్కుబడిన మర్రిచెట్టు మాదిరి వైల్డ్‌గా ఊగుతూ నాలుగు రౌండ్లు కొట్టి, నిట్టనిలువుగా విరుచుకు పడిపోయాడు ఆ మహాకాయుడు.

అతని వెన్నుమీది నుంచి అవతలికి దూకటంలో అంచనా కాస్తంత తప్పి, టంటురా రాబందుకు చాలా దగ్గరలో పడ్డాడు షాడో.

మహాకాయుడి చేతుల దెబ్బకు దిమ్మరబోయి ఉన్న దా పక్షి. రెక్కల్ని వెడల్పుగా జాపి ముంగాళ్ల మీద కూర్చుని ఉన్నది.

"అమాయకులైన మానవుల్ని అన్యాయంగా పొట్టన పెట్టుకుంటున్న ఈ రాక్షసుడి అంతు చూడటానికి నీ సంతానంలో సగభాగాన్ని బలిపెట్ట వలసి వచ్చింది, నన్ను క్షమించు డియర్! నా ఆకతాయితనాన్ని మన్నించు!" తదేకంగా తనవంక చూస్తున్న ఆ మాతృమూర్తితో అన్నాడు షాడో.

చేతుల్లో ఉన్న కొండరాయిని మరింత గట్టిగా పట్టుకుని శిలా విగ్రహంలా నిలబడిపోయిన గంగారం వంకా, అతనివంకా మార్చి మార్చి చూసిందా పక్షి.

మహాకాయుడి చేతుల్లో చిక్కుపడిన తనను రక్షించటానికి వారిద్దరూ రెక్‌లెస్‌గా ముందుకు దూకటాన్ని గుర్తు చేసుకుంటున్నదో, షాడో మాటల్లోని యథార్థాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నదో తెలియలేదు గానీ, ఉన్నట్లుండి పక్కకు తిరిగి సురక్షితంగానే ఉన్న తన రెండవ గుడ్డు దగ్గరకి పోయింది అది.

పలుగులు వంటి కుడికాలి గోళ్ల మధ్య దాన్ని ప్రేమపూర్వకంగా ఇరికించుకుని ఒంటికాలి మీద గెంతుతూ రివ్వున గాలిలోకి లేచింది.

బిగబట్టి ఉంచిన ఊపిరిని తేలికగా బయటకు వదులుతూ పక్కకు తిరిగిన షాడోముందు ప్రత్యక్షం అయ్యారు ఆయుధాలు ధరించి అట్టహాసంగా వచ్చిపడిన గ్రామస్తులు.

నిట్టనిలువుగా పడి ఉన్న మహాకాయుడి శరీరాన్ని చూసీ చూడటంతోనే గగ్గోలుగా అరుస్తూ కత్తులతో ఛిన్నాభిన్నం చేసేసారు.

గుహలోపలికి పరుగెత్తారు వారిలో కొందరు. విపరీతమైన భయంతో వణికిపోతున్న తమ ఆడపడుచును, ఆమె బిడ్డడినీ బయటకు తీసుకువచ్చారు.

"మన జీవితాలకు వినూత్నమైన అర్థాన్ని తెలియజెప్పిన అతిథుల

పాదాలకు సాష్టాంగ నమస్కారం చేయండి!" అందరికంటే కాస్తంత ఆలస్యంగా అక్కడికి వస్తూ బిగ్గరగా అరచి అందర్నీ హెచ్చరించాడు తెల్లజుట్టు వృద్ధుడు.

సాష్టాంగ నమస్కారాలు చేయించుకోవటానికి సిద్ధంగా లేరు వారి అతిథులు. మహాకాయుడికి చిక్కిన తల్లి బిడ్డ సురక్షితంగానే ఉన్నారని తెలిసిన మరుక్షణం నిశ్శబ్దంగా వెనక్కి జరిగి, కొండ గుట్టలకు అడ్డంపడ్డారు.

***

"ఆకలి వేస్తోంది, గురూ! అడుగులు తడబడిపోతున్నాయి!" ఉన్నట్లుండి ఎనౌన్స్ చేస్తూ ఉన్నచోటునే చతికిలపడ్డాడు గంగారాం.

నల్లరాళ్ల గుట్టల్ని దాటిన వెంటనే కనిపించిన పెద్ద ఇసుక మైదానంలో అడుగుపెట్టి ఒక పగలు, ఒక రాత్రి గడిచాయన్న విషయాన్ని గుర్తుచేస్కుంటూ తను కూడా ఆగిపోయాడు షాడో.

"నీతో కలిసి బయలుదేరితే తిండీ తిప్పలకు నీళ్లు వదులుకోవాల్సిందేనని తెలిసి కూడా వెంట రావటం నాదే బుద్ధి తక్కువ! నా ఖర్మ... నా గ్రహచారం!" తనలో తను గొణుక్కోవడం మొదలుపెట్టి సడెన్‌గా ఆగిపోయాడు గంగారాం.

నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉన్న పెద్ద ఇసుక గుట్టవైపు తదేకంగా చూస్తున్నాడు షాడో. తలను కొద్దిగా పైకెత్తి గాలిని వాసన చూస్తున్నాడు.

అతని చర్యలకు అర్థం ఏమిటో అడగలేదు గంగారాం. చతికిలబడిన చోటునుంచి గబగబా లేచి ఇసుక గుట్ట దగ్గరకి పరుగుతీశాడు. పైకి ఎక్కి అవతల పక్కకు చూడగానే అల్లంత దూరంలో అగుపించిన ఒక పట్టణ ద్వారాన్ని చూసి సింహనాదం చేసినట్లు పెద్దగా అరిచాడు.

"ఆగు, గంగూ... కాస్తంత ఆగు! తొందరపడకు!" అంటున్న షాడో మాటల్ని వినిపించుకోకుండా గుట్టమీద నుంచి క్రిందికి దొర్లి అటుకేసి పరుగుతీశాడు.

భారతీయ ప్రాచీన గాథల్లో చెప్పబడిన కోట గుమ్మాల మాదిరిగా ఉన్న ఆ ద్వారాన్ని దాటి పట్టణంలో అడుగుపెట్టిన అతనివంకా, అతని స్నేహితుడి వంకా విచిత్రంగా చూశారు అటూ ఇటూ తిరుగుతున్న పౌరులు.

"ఆకలికి తట్టుకోలేక ఏ క్షణంలోనైనా కళ్లు తేలవేసేటట్లున్నాడు నా జతగాడు. కడుపు నింపుకునేందుకు తగిన స్థలాలు ఎక్కడ ఉన్నాయో చెప్పగలరా?" దగ్గర్లోనుంచి అవతలికి పోతున్న ఒక మధ్యవయస్కుడిని అడిగాడు గంగారాం.

పురుగునో, పల్లె ప్రాంతాల్లో నివశించే అనాగరికుడినో చూసినట్లు అసహ్యంగా చూసి ఒక చెక్కల కట్టడంవైపు చేయి ఊపాడా పౌరుడు.

"ఇక్కడి పరిస్థితుల్ని అర్థం చేసుకోకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, అవమానాల పాలు కావాల్సివస్తుంది. నిదానించు, గంగారాం! శాంతంగా ఆలోచించు!" అంటున్న స్నేహితుడు మాటల్ని పట్టించుకోకుండా చేయి పట్టుకుని ఆ కట్టడంలోకి లాక్కుపోయాడు గంగారాం. ఖాళీగా ఉన్న ఒక చెక్కబల్లమీద కూర్చుని, అక్కడ లభించే పదార్థాలన్నిటినీ తీసుకురమ్మని, తన ముందుకు వచ్చిన ఆ కట్టడపు యజమానికి చెప్పాడు.

ఛెంగున వెనుతిరిగి కిచెన్‌లోకి పరుగెత్తలేదా పెద్దమనిషి.

"గవ్వలున్నాయా మీ దగ్గర?" క్రిందనుంచి పైదాకా పట్టిచూస్తూ ప్రశ్నించాడు ఫక్కున నవ్వబోయిన షాడోవంక ఉరిమి చూస్తూ. మహిమాకో అడవుల్లోని ఆటవికులకు కనిపించకుండా జాగ్రత్త చేసుకున్న తన సరంజామాను దుస్తుల్లో నుంచి బయటకు తీశాడు గంగారాం. అందులోని వాలెట్‌ని తెరిచి ఫెళఫెళలాడుతున్న కొన్ని కరెన్సీ నోట్లను బల్లమీద పడేయబోతుండగా అడ్డుకున్నాడు షాడో.

"మనుషుల్ని ఎత్తుకుపోగల పక్షులు, నరమాంసాన్ని ఆరగించే రాక్షసులు కనిపించే ఈ ప్రదేశాల్లో నాలుక గీసుకోవటానికి కూడా పనికిరాదు నీ కరెన్సీ! అడిగి చూడు ఆ మనిషిని!" అంటూ ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

గంగారాం అడగకముందే తన దుస్తుల్లో చేయిపెట్టి నలుపలకలుగా ఉన్న నాలుగు వెండి నాణాల్ని బయటకు తీశాడు చెక్కల కట్టడపు ఓనర్.

"బంగారంతో కూడా తయారవుతాయి ఇవి. అప్పుడు వాటిని గవ్వలు అనరు. శంఖాలు అంటారు!" తనంతట తనే వెల్లడించాడు ఇంకో విషయాన్ని.

"ఈ గవ్వలు, శంఖాలు మా దగ్గర లేవు. కడుపు నింపుకునేంటదుకు ఇంకో మార్గం ఏదైనా ఉంటే చెప్పు!" ముఖం ముడుచుకుంటూ అడిగాడు గంగారాం.

"పట్టణ ద్వారం దగ్గర గుడ్డలు పరుచుకు కూర్చోండి... వచ్చేపోయేవాళ్లు ఎవరైనా పూసలు పడవేయువచ్చు!" అంటూ అవతలికి వెళ్లిపోయాడా మనిషి.

ఎంత ప్రయత్నించినా ఆపుకోవటం చేతకాక ఫక్కున నవ్వేశాడు షాడో. నవ్వుతూనే బల్లమీదనుంచి లేచి బయటకు బయలుదేరాడు.

"నిజంగానే ఆకలి వేస్తోంది, గురూ! తినటానికి ఏదైనా దొరకకపోతే కళ్లు తిరిగి కిందపడిపోతాను!" అతన్ని అనుసరిస్తూ వాపోతున్న గంగారాం వంక ఎగాదిగా చూశాడు చెక్కల కట్టడం పక్కభాగంలో నిలబడి ఉన్న వ్యక్తి ఒకతను.

"కొండల్ని పిండి చేయుగగల బలం కలిగి ఉండి కూడా చేతకాని వాళ్లమాదిరి డీలా పడిపోవటం నాకు నచ్చలేదు!" కొద్దిసేపు ఆగి, మెల్లిగా అతని పక్కకు వస్తూ అన్నాడు.

"ఎవరండీ తమరు?" మర్యాద మేళవించిన కంఠంతో అడిగాడు గంగారాం.

"ఈ పట్టణంలో అత్యంత ధనవంతుడిగా పేరుపొందిన అషిమో దగ్గర ఆంతరంగికుడిగా పనిచేస్తూ ఉంటాను నేను. పెద్దపెద్ద పూలతోటలున్నాయి. నా యజమానికి వాటిలో పనిచేసేందుకు కండబలం కల పనివాళ్లకోసం వెతుకుతూ ఇక్కడ నిల్చున్నాను!" తనను పరిచయం చేసుకుంటూ చెప్పాడతను.

"ఇప్పటికిప్పుడు మాకు కావాల్సింది పని కాదు. కడుపు నింపుకోవటానకి అవసరమైన గవ్వలు!" మొహమాటపడకుండా సూటిగా చెప్పాడతనికి గంగారాం.

"పనిలో పెట్టుకునే ముందు కావాలని అడిగితే కొన్ని గవ్వల్ని ఇస్తాడు నా యజమాని. తాపీగా పనిచేసి ఆ బాకీ తీర్చుకోవచ్చు!" తడుముకోకుండా సమాధానమిచ్చి తనతో రమ్మని సైగ చేశాడు ఆ మనిషి.

ఫలహార శాల పక్కభాగంలో ఉన్న చిన్న సందువంటి ఇరుకు మార్గంలోకి అడుగు పెడుతూ ఉండగా గంగారాంకి ఎదురుపడింది నడుమువంగి పోవటానికి సిద్ధంగా ఉన్న వృద్ధురాలు ఒకామె.

మూడు అడుగుల ఎత్తున్న పెద్ద బుట్టను టీ ఆకులు కోసే వాళ్లమాదిరి వెన్నుకు కట్టుకుని వస్తోందామె. గంగారాంని తప్పించుకోవటానికి పక్కకు జరగబోతూ పాదం మెలికపడటంతో ముందుకు తూలింది.

చటుక్కున చేతుల్ని జాచి ఆమెను, ఆమె వీపుకు వేలాడుతున్న బుట్టను గట్టిగా పట్టుకున్నాడతను.



"హాయిగా కూర్చుని విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో ఈ బరువుల్ని మోయటం దేనికి మామ్మా?" సానుభూతిగా అంటూ రెండు అడుగులు వేయించి చేతులు దులుపుకున్నాడు.

చిన్న చిరునవ్వు ఒకటి మొఖాన్ని ప్రకాశవంతం చేస్తూండగా, అతని వంక చూసి తల ఊపిందా వృద్ధురాలు.

"ఈ పట్టణంలోకి నువ్వు, నీ జతగాడు కొత్తగా వచ్చినట్లున్నారు. అవునా?" పక్కనుంచి పోతున్న పౌరులకు కూడా వినిపించనంత రహస్యంగా అడిగింది.

ఆమె ఉద్దేశ్యం ఏమిటో అర్థం కాకపోయినా, ఆ మాట నిజమే కాబట్టి తడుముకోకుండా తల ఊపాడు గంగారాం.

"పని చూపిస్తాడని ఎంతో ఆశతో అషిమో ఆంతరంగికుడి వెంట వెళ్లిన వారు తిరిగి ఈ పట్టణపు వీధుల్లో ఎవరికీ కనిపించరని అందరూ అనుకుంటూ ఉంటారు. జాగ్రత్త బిడ్డా... బహు జాగ్రత్త!" అని చెప్పి, మరొక్క క్షణం కూడా అక్కడ ఆగకుండా తన దారిన తను వెళ్లిపోయిందా వృద్ధురాలు.

ఇరుకు మార్గంలో నిలబడి, అసహనంగా అటూ ఇటూ చూస్తున్న అషిమో ఆంతరంగికుడి దగ్గరకి పోయి ముక్కూ మొహం ఏకం చేసెయ్యాలని నిర్ణయించుకుంటూ అటుకేసి తిరిగిన గంగారాం చేతిని పట్టుకుని గట్టిగా నొక్కాడు షాడో.

"ఇప్పటికిప్పుడు తవ్వి తలకెత్తుకోవాల్సిన రాచకార్యాలు మనకేమీ లేవు ... వాడితోపాటు వెళ్లి ఏం జరుగుతుందో చూడటం వల్ల మనకు వచ్చే నష్టం కూడా ఏదీ ఉండదని నా అభిప్రాయం!" వృద్ధురాలి మాదిరిగానే లోగొంతుకతో అన్నాడు షాడో.

ఉబికి వస్తున్న కోపాన్ని వెంటనే అదిమేసుకుని గబగబా అడుగులు వేశాడు గంగారాం.

అర్ధ ఘడియపాటు అటూ ఇటూ తిప్పాడు వారిని అషిమో ఆంతరంగికుడు. నగర ద్వారానికి దక్షిణ దిశలో ఉన్న పెద్ద పూలతోటకు తీసుకుపోయి చలువరాళ్లతో నిర్మించబడిన ఒక భవంతిముందు నిలబెట్టాడు.

స్నేహితుల మాదిరిగానే పనికోసం వెతుకుతూ అతనికి తారసపడ్డారు కాబోలు, అసహనంగా ఎదురు చూస్తున్నారు అంతకుముందు ఎప్పుడో అక్కడికి తీసుకురాబడిన మరో అరడజను మంది పౌరులు.

వారితో పరిచయం చేసుకుని, మంచీ చెడ్డా మాట్లాడే అవకాశం గంగారాంకి లభించలేదు.

"పాదరక్షల్ని తీసేసి లోపలికి రండి... పాదరక్షల్ని తీసేయుండి!" భవనం ద్వారం వైపు చేయి ఊపుతూ హెచ్చరించాడు అషిమో అనుచరుడు.

అందరితోపాటు తను కూడా కాళ్లకున్న బూట్లను భవన ద్వారం దగ్గర వదులుతూ కను చివరల నుంచి గంగారాంకేసి చూశాడు షాడో.

"నాకేదో అనుమానంగా ఉంది ... జాగ్రత్తగా ఉండకపోతే కొంపలు అంటుకుపోతాయని అనిపిస్తోంది !" లోగొంతుకతో అంటూ అతనికంటే ఒక అడుగు ముందుగా లోపలికి నడిచాడతను.

నూనె ఒలకబోసినట్లు నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి భవనం ముందుభాగంలోని గది మధ్యలో పరచి ఉన్న నీలిరంగు నాపరాళ్లు.

"గుడి మధ్యలో నిలబడి ఉండే దేవతా విగ్రహాల మాదిరి గది మధ్యలో నిలుచోవటం పద్ధతిగా ఉండదు. గోడల దగ్గరకి జరగండి!" తనకంటే ముందుగా లోపలికి వచ్చిన పౌరుల్ని హెచ్చరించాడు గంగారాం.

అతని మాటలు తమకు వినబడనట్లు సూటిగా పోయి నీలిరంగు నాపరాళ్ల మీదికి చేరుకున్నారు వారందరూ. రెండు క్షణాలు కూడా గడవకముందే అదిరిపడి ఇవతలికి వచ్చేయటానికి ప్రయత్నించారు.

ఇనుప సీలలతో తాపడం చేసినట్లు అంగుళంలో పదోవంతు దూరం కూడా కదలలేకపోయారు వాళ్లు ... ముందుకు వంగి చేతుల్ని కింది ఆనించారు వారిలో ఇద్దరు. చేతులు కూడా నాపరాళ్లకు అంటుకుపోయేసరికి బెంబేలెత్తిపోతూ, గది పైకప్పు లేచిపోయే స్థాయిలో అరుపులు ప్రారంభించారు.

భవనం వెనుక భాగంలోకి పరుగెత్తి బంగారు ఆభరణాలు ధరించి ఉన్న నలుగురు పెద్ద మనుషుల్ని వెంటబెట్టుకువస్తున్న అషిమో ఆంతరంగికుడిని చూడాగనే షాడోకి సైగ చేశాడు గంగారాం.

పాదరక్షలు తొలగించిన తర్వాత గానీ లోపలకు రాకూడదనే నియమం వారికి వర్తించదు కాబోలు. అటువంటి పని చేయకుండా ఠీవీగా లోపలికి వచ్చేస్తున్నారు వాళ్లు. తన కదలికలు అషిమో ఆంతరంగికుడికి అగుపించకుండా చటుక్కున పక్కకు జరిగి నీలిరంగు నాపరాళ్ల మీద నిలబడ్డాడు షాడో... గంగారాంని కూడా తన పక్కకు లాగాడు.

"కాస్తంత తిండి పెడితే రాత్రీ పగలూ తేడా లేకుండా ఎంతటి పని అయినా చేయగల శక్తిమంతుల్ని ఎంతో కష్టపడి వెతికి తీసుకువచ్చాను. ఎప్పుడైనా మీకు కోపం వచ్చి కొరడాలతో కొట్టినా తట్టుకోగలరు... బాగా చూసుకోండి!" గది గోడలు కంపించిపోయే స్థాయిలో వినవస్తున్న గావుకేకల్ని వినిపించుకోనట్లు నటిస్తూ పెద్ద మనుషులతో అన్నాడు అషిమో అనుచరుడు.

అతని వెంట వచ్చిన పౌరులు తిరిగి ఎవరికీ కనిపించకపోవటానికి కారణం ఏమిటో అప్పుడు పూర్తిగా అర్థమై పళ్లు బిగించాడు గంగారాం.

ఆచ్ఛాదన లేకుండా అడుగుపెట్టిన పాదాల్ని అయస్కాంతం మాదిరిగా ఆకర్షించే లక్షణం ఆ నీలిరంగు నాపరాళ్లకు ఉన్నట్లుంది. ఎలాబరేట్ అరేంజ్‌మెంట్స్‌తో అవసరం లేకుండా అమాయకుల్ని నమ్మకంగా తీసుకువచ్చి ఆ రాళ్లమీద బందీలుగా చేస్తున్నాడు అషిమో అనుచరుడు... బేరగాళ్లను ముందుగానే సిద్ధం చేసి ఉంచుకుని క్షణాలమీద బానిసలుగా అమ్మేస్తున్నాడు.

గావురు గావురుమంటున్న పౌరుల చుట్టూ రౌండ్స్ కొడుతూ, వారి ఒంటిబలాన్ని, కండల బలాన్ని అంచనా వేసుకుంటున్న పెద్దమనుషులను చూసేసరికి అంచలంచెలుగా ఎదిగిపోయింది గంగారాం కోపం.

"మమ్మల్ని కూడా చూడండిరా దొంగనాయాళ్లారా...! మా బలాల్ని కూడా అంచనా వేసుకోండిరా!" వారికేసి తిరుగుతూ వెక్కిరింపుగా అన్నాడు.

చటుక్కున మాయమైపోయింది అషిమో ఆంతరంగికుడి పెదవులమీద ప్రకాశిస్తున్న చిరునవ్వు. పళ్లు పటపటమని కొరుకుతూ పిడికిలి బిగించి ముందుకు దూకాడతను.

చేతులు రెండింటినీ కలిపి బలంగా మోదాడు గంగారాం అతని తలమీద. కుడికాలిని వేగంగా పైకెత్తి గుండెలమీద తన్నాడు.

"అయ్యబాబోయ్... కదులుతున్నాడు! శిలా విగ్రహంలా నిలుచుండి పోవాల్సిన ఆ మనిషి మన మాదిరిగానే కదలగలుగుతున్నాడు!" ఆందోళన నిండిన కంఠంతో అరిచాడు బంగారు ఆభరణాలు ధరించి వచ్చిన పెద్దమనుషులలో ఒకతను.

పాదరక్షలు తీయించాడు గానీ, స్నేహితుల పాదాలకున్న మేజోళ్లను గురించి తెలియకపోవటం వల్ల వాటిని తీయించలేదు అషిమో అనుచరుడు. అందరి మాదిరిగా నాపరాళ్లకు అతుక్కుపోకుండా

ఉండటానికి కారణాన్ని కనిపెట్టిన వెంటనే పెద్ద కంఠంతో ఆ పెద్దమనుషులను హెచ్చరించాడు.

ముఖద్వారం దగ్గరకి పరుగెత్తబోయిన ఆ హీరోల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు అంతవరకూ ఆ గోలలో పాలుపంచుకోని షాడో.

పిడికిటి పోట్లతో తల్లక్రిందులు చేశాడు ఇద్దరిని. గోడలకేసి కొట్టి స్పృహ తప్పించేశాడు మిగిలిన ఇద్దర్నీ.

క్రిందనుంచి లేచి బయటకి పారిపోబోతున్న అషిమో అంతరంగికుడి జుట్టు పట్టుకున్నాడు గంగారాం. గిలగిలలాడిపోతున్న పౌరులవంక చూపించి నొసలు ఎగురవేశాడు.

అధిక ప్రసంగం చేసినా, అతని మాట వినిపించుకోకపోయినా తన తల పగిలిపోవటం తప్పనిసరి అని గ్రహించి ఆ గదిని ఆనుకుని ఉన్న మరో చిన్న గదిలోకి దారితీశాడు అషిమో అనుచరుడు.

పెద్ద పాత్రలో పోసి ఉన్న ద్రావకం వంటి ద్రవాన్ని తీసుకువచ్చి నీలిరంగు నాపరాళ్లమీద కుమ్మరించాడు.

రెండే రెండు క్షణాల్లో పట్టును వదిలిపెట్టేశాయి నాపరాళ్లు. చలనం లేకుండా ఉండిపోయిన ఆ అమాయకులకు స్వేచ్ఛను ప్రసాదించాయి.

కళ్లు తేలవేసిన పెద్దమనుషుల దగ్గరకి పోయి వారి ఆభరణాలను, వారి దుస్తుల్లో దాచబడి ఉన్న గవ్వల సంచీలను, శంఖాల మూటల్ని గుట్టగా పోశాడు.

"అషిమోకి ఈ సంగతి తెలిసిన వెంటనే మీ అంతు చూసి తీరతాడు... మీ తలల్ని నరికించి నగర ద్వారం మీద నేలాడదీయిస్తాడు!" అతన్ని ఉద్దేశాన్ని అర్థం చేసుకుని కోపంగా హెచ్చరించాడు అషిమో అనుచరుడు.

అతని నోరు పగిలిపోయేటట్లు ఒక దెబ్బ కొట్టి, చిన్న శంఖాల మూటని మాత్రం తను తీసుకున్నాడు గంగారాం. మిగిలిన సొత్తునంతా విస్ఫారిత నేత్రాలతో చూస్తున్న పౌరులను పంచుకోమని చెప్పి షాడోతో కలిసి భవనం బయటికి పరుగుతీశాడు.

జొన్నపిండివంటి అడవి ధాన్యాల పిండితో తయారుచేసిన రొట్టెల దొంతరను తీసుకువచ్చాడు ఫలహారశాల యజమాని. ఎడారి నక్కవంటి ఏదో జంతువును ఎర్రగా కాల్చించి పెద్ద పళ్లెరంలో పట్టుకువచ్చాడు.

"తాగటానికి ఏదైనా పానీయం తీసుకురా, తల గిర్రున తిరిగి శరీరం గాలిలో తేలిపోయేటట్లు దమ్ముగా ఉండాలి! వెన్నెల మడుగు గ్రామంలో తను పుచ్చుకున్న పానీయాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఆర్డర్ ఇచ్చాడు గంగారాం. శంఖాల మూటలోనుంచి నాలుగు నాణాల్ని తీసి అతనిమీదకు విసిరాడు.

అంతకుముందు రెండు నల్లపూసలు కూడా చేతుల్లో లేకుండా అక్కడికి వచ్చినవారికి, యకాయకీన శంఖాల మూట ఎలా లభించిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ కిచెన్‌లోకి పరుగెత్తి కూజావంటి పెద్ద పాత్రను తీసుకువచ్చాడు ఫలహారశాల యజమాని.

రెండు రొట్టెల్ని తిని ఆ పాత్రను చేతిలోకి తీసుకున్నాడు షాడో.

చలువరాతి భవనంలో జరిగిన సంఘటనే మెదులుతోంది అతని మనస్సులో. అషిమో అనుచరుడు చేసిన హెచ్చరికలే అతని చెవుల్లో మార్మోగుతున్నాయి.

"అతిగా ఆలోచించి నీ మెదడును కష్టపెట్టుకోవాల్సిన అవసరం లేదు, గురూ! ఈ అస్సాం పెద్దపులి నీ పక్కన ఉండగా నీకు వచ్చిన భయం ఏదీ లేదు!" రొట్టెల దొంతర అంతుచూస్తూ, అతని దగ్గరి కూజాలోనుంచి కొద్దిపాటి పానీయాన్ని పుచ్చుకుంటూ భరోసా ఇచ్చాడు గంగారాం.

ఆ మాటలు అవగతం కాకపోయినా, అతని ముఖంలోని భావాలు అర్థమై మెల్లిగా ముందుకు వచ్చాడు ఫలహారశాల యజమాని.

"మీరు ఈ శంఖాలను సంపాదించటానికి ఎవరితోనైనా గొడవ పడిఉంటే, తిండి తినటాన్ని త్వరగా పూర్తిచేసి చీకటి పడకముందే నగరాన్ని వదిలిపెట్టండి!" తన మాటలు వినటానికి చుట్టుపక్కల ఎవరూ లేరని నిశ్చయం చేసుకుంటూ చెప్పాడు.

మత్తు పానీయపు శక్తి కొద్దికొద్దిగా తలకు ఎక్కుతూ ఉండడంతో కనుబొమ్మలు ముడిచి క్రూరంగా చూశాడు గంగారాం.

"చీకటి పడేలోపుగా నగరాన్ని వదిలిపెట్టకపోతే ఏమవుతుంది?" పళ్లు బిగించి కరకు కంఠంతో ప్రశ్నించాడు.

"చంపుడు పౌర్ణమి వచ్చింది ఈ రోజు. చంద్ర దర్శనం అయిన క్షణం నుంచీ రక్తపుటేరులు ప్రవహిస్తాయి నగరంలో!కక్షలు కార్పణ్యాలు, పగలు ప్రతీకారాలు గజ్జెలు కట్టుకుని గంతులు వేస్తాయి!" అంటూ అక్కడితో తన బాధ్యత తీరిపోయినట్లు అవతలికి వెళ్లిపోయాడతను.

అతన్ని వెనక్కి పిలిచి మరింత వివరంగా మాట్లాడాలని అనుకున్నాడు షాడో. అంతలోనే డైవర్ట్ అయింది అతని అటెన్షన్.

"చంద్ర దర్శనం అయిన తర్వాత గానీ ఆయుధాలు పట్టుకోకూడదనే నియమాన్ని గాలికి వదిలేసి చీకటి పడకముందే వచ్చేస్తున్నారు అషిమో అనుచరులు. ఎవరిమీద విరుచుకుపడతారో, ఎటువంటి ఆగడాలు చేస్తారో ఆ భగవంతుడికే తెలియాలి!" ఆందోళన నిండిన కంఠంతో అంటూ లోపలికి పరుగెత్తుకు వచ్చాడు. ఫలహార శాల పక్కభాగాలలో పళ్లు, ఫలాలను అమ్ముకుంటూ ఉండే చిన్న వ్యాపారస్థుడు ఒకతను.

చంద్రదర్శనం, చంపుడు పౌర్ణమి అనే మాటలకు అర్థం తెలియకపోయినా, అషిమో అనుచరులు ఆయుధాల్ని ఎందుకు ధరించారో, ఎవరిమీద పడటానికి వస్తున్నారో వెంటనే అర్థమైంది షాడోకి.

కూజాలో ఉన్న పానీయాన్ని రెండే రెండు గుటకల్లో ఖతమ్ చేసి గంగారాంకేసి చూశాడతను.

మాటలతో చెప్పించుకోవాల్సిన అవసరం లేకుండానే ఎదుట ఉన్న రొట్టెల దొంతరను అతివేగంగా లాగించేశాడు గంగారాం. శంఖాల మూటలో నుంచి మరో నాలుగు నాణాల్ని ఫలహారశాల యజమాని మీదకి విసురుతూ ప్రశ్నార్థకంగా చూశాడు.

అటువంటి సిచ్యుయేషన్స్‌ని గతంలో ఎన్నింటినో చూసి ఉన్నట్లు తడుముకోకుండా, తడబాటును ప్రదర్శించకుండా కిచెన్‌కేసి చేయి ఊపాడతను. అక్కడ ఉన్న ఒక చిన్న ద్వారాన్ని తెరిచి తల ఊపాడు.

కిచెన్‌లో కనిపించిన కట్టెపేళ్ల దొంతరలో నుంచి చిన్న పేడును వేరు చేసి సిగరెట్ మాదిరిగా నోటిలో పెట్టుకుంటూ గంగారాంతో కలిసి ఫలహార శాల వెనుక భాగంలో ఉన్న ఒక సందులోకి పరుగుతీశాడు షాడో.

వారు ఊహించనదానికంటే వెయ్యి రెట్లు అధికమైన తెలివి తేటలున్నట్లున్నాయి అషిమో అంతరంగికుడికి వారి రియాక్షన్స్‌ని ముందుగానే అంచనా వేశాడతను. పదిమంది దృఢకాయుల్ని వెంటపెట్టుకుని అప్పుడే ఆ సందులోకి ఎంటర్ అవుతున్నాడు.

"పట్టుకోండి ఆ దుర్మార్గుల్ని ... తలల్ని నరికి వీధిలోకి విసిరివేయండి!" వారిని గమనించిన మరుక్షణం గుండెలు జలదరించేటట్లు కేకపెట్టాడు.

నగర ద్వారం దగ్గరకి పోయి ఫలహారశాల యజమాని చెప్పినట్లు ఆ చుట్టుపట్ల ఎక్కడా కనిపించకుండా మటుమాయం అయిపోదామనే ఆలోచనను వెంటనే మనసులోనుంచి చెరిపేసుకున్నాడు షాడో.

సందు గొందుల్ని కూడా కవర్ చేయటానికి వచ్చిన ఆ పెద్ద



మనుషులు నగర ద్వారాన్ని మాత్రం వదిలిపెడతారా?
మత్తు పానీయపు శక్తి తలకు బాగా ఎక్కటం వల్ల, ఫైటింగ్‌కి రెడీ అయిపోతున్న గంగారాం చేతిని గట్టిగా పట్టుకుని, కొద్దిదూరంలో కనిపించిన ఇంకో సందులోకి పరుగు తీశాడు షాడో.

అషిమో అనుచరుడు తమను బంధించటానికి చూపిన చలువరాతి భవనం వంటి ఒంటరి కట్టడాన్ని వెతుక్కుని, చంపుడు పౌర్ణమి పొంగు చల్లారేటంతవరకూ తల దాచుకోవటం మంచిదని అనిపించింది అతనికి.

అరుపులతో కేకలతో అందరినీ హడలకొడుతూ వెంటపడిన దృఢకాయులకు దొరక్కుండా పది పదిహేను వీధుల్ని సర్వే చేశాడతను ... లెక్క పెట్టటానికి వీలుకానన్ని సందుల్లో చక్కర్లు కొట్టాడు.

అనువైన స్థలం ఒక్కటి కూడా అగుపించకముందే హఠాత్తుగా మాయం అయిపోయాడు పడమటి దిశలోకి పడిపోయిన సూర్యుడు... తూర్పు దిక్కును కాంతివంతం చేస్తూ వెనువెంటనే ప్రత్యక్షం అయ్యాడు పున్నమి చంద్రుడు.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంతో నిండి ఉన్న నగరం కాస్తా, అరుపులతో, కేకలతో, ఆర్తనాదాలతో అల్లకల్లోలమైపోసాగింది ఒక్కసారిగా.

కర్రల్ని, కత్తుల్ని గండ్రగొడ్డళ్లవంటి ఆయుధాల్ని తీసుకుని విశృంఖలంగా వీధుల్లో తిరగటం ప్రారంభించారు అనేకమంది పౌరులు.... కంటికి కనిపించే ప్రతి మనిషి మీద దాడి చేయటం మొదలుపెట్టారు విచక్షణారహితంగా.

ఫలహారశాల యజమాని చెప్పినట్లు చంద్ర దర్శనం అయిన క్షణం నుంచీ నిజంగానే నగర వీధుల్లో ప్రవహించసాగిన రక్తపుటేరుల్ని చూస్తూ, గాలింపు చర్యల్ని మరింత వేగవంతం చేశాడు షాడో.

వీధికి నాలుగు, సందుకు రెండు చొప్పున ఎదురవుతున్న రాక్షసమూకల్ని అతి నేర్పుగా తప్పించుకుంటూ నగరానికి ఉత్తరభాగంలో ఉన్న చిన్న ఉద్యానవనాన్ని చేరుకున్నాడు.

తమ కదలికల్ని కనిపెట్టేవాళ్లు ఆ చుట్టుపట్ల ఎవరూ లేరని నిశ్చయపరుచుకుంటూ ముందుకు అడుగు వేయబోతూండగా, ఎందుకనో వచ్చింది షాడోకి ఒక అనుమానం.

"ఆగు, గంగూ! ఒక్క క్షణం ఆగు...!" లోగొంతుకతో స్నేహితుడిని హెచ్చరిస్తూ, కింద కనిపించిన ఒక పెద్ద పలుకురాయిని చేతుల్లోకి తీసుకుని, ఉద్యానవనం చుట్టూ ఉన్న మట్టిగోడ వెనక్కి బలంగా విసిరాడు.

వెంటనే వినవచ్చింది బాధనిండిన కంఠం ఒకటి. రంధ్రం పడిన తలను అదుముకుంటూ మట్టిగోడ చాటునుంచి లేచాడు ఆ కంఠం తాలూకు వ్యక్తి.

ఒంటరిగా లేడతను. ఆయుధాలు ధరించిన మరో పదిమంది వ్యక్తులతో కలిసి మాటువేసి ఉన్నాడు అక్కడ.

"చంపండి... చంద్రదేవుడికి బలి ఇవ్వండి! చంపండి!" అని కేకలు పెడుతూ ఒకేసారి వచ్చేశారు వారందరూ. ఆయుధాల్ని గాలిలోకి ఎత్తి, స్నేహితులమీద కలబడ్డారు.

అషిమో అనుచరుల్ని చూసి పిక్కబలం చూపించినట్లు వెంటనే వెనుతిరగలేదు షాడో. తొడ చరుస్తూ కుడిపాదాన్ని నేలకేసి అదిమి, అమాంతంగా లేచాడు గాలిలోకి.

గుర్తుపట్టడానికి వీలుకాని విధంగా తయారైపోయింది ఒక వ్యక్తి ముఖం. విరిగిపోయిన భుజాన్ని అదుముకుంటూ వెల్లకిలా పడిపోయాడు మరో వ్యక్తి.

చేతులకు అందిన మరో ఇద్దరు వ్యక్తుల తలలు పగిలిపోయేటట్లు పిడిగుద్దులు గుద్ది వారి ఆయుధాల్ని తను స్వంతం చేసుకున్నాడు గంగారాం. గుండెలు అవిసిపోయేటట్లు గావుకేకలు పెడుతూ ఇంకో ఇద్దరి అవయవాలను ఎందుకూ పనికిరాని విధంగా పాడుచేసేశాడు.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో తల్లక్రిందులైపోయిన తన సహచరుల పరిస్థితిని కళ్లారా చూసుకునే సరికి వేగంగా దిగజారిపోయాయి మిగిలిన వారి ధైర్యాలు. ఆయుధాల్ని అక్కడే వదిలేసి హఠాత్తుగా వెనక్కి తిరిగారు అందరూ ... ఉద్యానవనం పక్కనే ఉన్న వీధిలోకి పోయి అదృశ్యం అయ్యారు.

వారిని వదిలిపెట్టకూడదన్న పట్టుదలతో ఆ వీధివైపు బయలుదేరబోతున్న గంగారాం చేయి పట్టుకుని, ఉద్యానవనానికి వెనుకభాగంలో ఉన్న ఒక చెట్ల గుంపువైపు కదలబోయాడు షాడో.

అదే సమయంలో నిశ్శబ్దంగా తెరుచుకున్నాయి ఆ వీధిలో ఉన్న ఒక ఇంటి తలుపులు. తళతళలాడుతున్న ఒక పాత్ర నిండుగా నీటిని తెచ్చి, వీధి మధ్యలో గిలగిలలాడుతున్న వ్యక్తుల ముఖాలమీద చిలకరించింది ఒక వృద్ధురాలు.

ఆమెవంకా, ఆమె బుగ్గలమీదికి జాలువారుతున్న కన్నీటి వంకా ఆశ్చర్యంగా చూస్తున్న గంగారాంకి వెంటనే జ్ఞానోదయం అయింది.

"మామ్మా నువ్వా? నువ్వు ఇక్కడ నివశిస్తూంటావా?" అని అడుగుతూ ముందుకు పోయాడు.

పాత్రలోని నీళ్లన్నిటినీ తల పగిలిపోయిన ఒక వ్యక్తి ముఖంమీద చిలకరించి తల ఎత్తి చూసిందా వృద్ధురాలు.

అతన్ని గుర్తుపట్టేసరికి చిరునవ్వులతో ప్రకాశవంతం అయిందామె వదనం.

"లోపలికి రండి... మరో గుంపు ఏదైనా వచ్చి మిమ్మల్ని గమనించకముందే లోపలకు వచ్చి తలలు దాచుకోండి!" అంటూ వారిద్దరితో తన ఇంటివైపు నడిచింది.

***

"జనాభా అధికమై అనవసరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఉద్దేశ్యంతో ఎప్పుడో మా పూర్వీకులు నిర్ణయించిన పద్ధతి ఇది ... దమ్ము ధైర్యం ఉన్నవాళ్లు బతికి బట్టకడతారు. చేతకానివాళ్లు, తెలివిహీనులు మరణించి మట్టిలో కలిసిపోతారు!"

వద్దు వద్దన్నకొద్దీ వేడివేడి పాయసంవంటి పదార్థాన్ని పాత్రలలో నింపి వారి చేతులకు అందిస్తూ చంపుడు పౌర్ణమిని గురించి చెప్పిందా వృద్ధురాలు.

"తూర్పు దిక్కు తెల్లబడేటంతవరకూ కొనసాగుతుంది ఈ దమనకాండ. అంతవరకూ ఇక్కడే ఉండండి మీరు!" అంటూ వారు పడుకునేందుకు పడకల్ని సిద్ధం చేసింది.

విశ్రాంతి తీసుకోవాలన్న కోరిక అధికమైపోతున్నా, అలాగే కూర్చున్నాడు షాడో. ఏ పరిస్థితుల్లో తాము ఆ ద్వీపం మీదకి చేరుకోవటం జరిగిందో గంగారాం చేత ఆమెకు చెప్పించాడు. అక్కడనుంచి సురక్షితంగా బయటపడే మార్గాన్ని చెప్పమని రిక్వెస్ట్ చేశాడు.

"మా ద్వీపంవంటి ద్వీపాలు సముద్రంలో ఇంకేమైనా ఉన్నాయోమో తెలుసుకోవటం కోసం చాలా ప్రయత్నాలు చేశారు మా పూర్వీకులు. కత్తుల మాదిరి నీటి అంచుల మీదకు పొడుచుకువచ్చే పగడపు గుట్టలు, మా ద్వీపం చుట్టూ చాలా దూరం వ్యాపించి ఉండటం వల్ల

ప్రయత్నించిన ప్రతిసారీ పడవలకు చిల్లులుపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు!" సాలోచనగా చెప్పింది వృద్ధురాలు.

చిత్ర విచిత్రాలతో నిండి ఉన్న ఆ ద్వీపాన్ని గురించి ప్రపంచానికి తెలియకపోవటానికి, సముద్రం ఆవల ఉన్న ప్రపంచాన్ని గురించి ఆ ద్వీపవాసులకు అవగాహన లేకపోవటానికీ, ఆమె చెపుతున్న పగడపు గుట్టలే కారణమని గ్రహించి గాఢంగా నిట్టూర్చాడు షాడో.

పడవలోనో ఓడలోనో తాము అక్కడికి రావాలని అనుకుని ఉన్నట్లయితే, ఆమె పూర్వీకుల మాదిరి పగడపు గుట్టల దెబ్బకు తల్లక్రిందులైపోవటం జరిగి ఉండేది.

రబ్బర్ ఫ్లోట్ మాదిరి పనిచేసిన తన ఎయిర్‌బాగ్ మూలకంగా రక్షించబడ్డారు తాము... సూదులు మాదిరి నీటిలోనుంచి పైకి వచ్చే ప్రమాదాలకు చిక్కుబడకుండా సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగలిగారు.

బందిపోట్ల బారినుంచి తమను కాపాడటానికి బాంబు మాదిరి బద్దలైపోయిన ఎయిర్‌బాగ్‌ని తలుచుకుని మరింత గాఢంగా నిట్టూర్చాడు షాడో.

నిమిషానికి రెండు ప్రమాదాలు ఎదురవుతున్న ఆ వింత ద్వీపంలో నుంచి బయటపడాలంటే కాళ్లూ చేతుల్లో ఉన్న సత్తువను నమ్ముకుని సముద్రంలో దూకటం ఒక్కటే సరైన మార్గం ... వేరే దారిని వెతుక్కోవటం ఇంపాజిబుల్!

తూర్పు దిక్కు తెల్లబడిన వెంటనే నగరాన్ని వదిలి సముద్రతీరం వైపు వెళ్లిపోవటమే ఉత్తమమని నిర్ణయించుకుంటూ కూర్చున్న చోటునుంచి లేచాడు షాడో. వృద్ధురాలు సిద్ధం చేసిన పడకవైపు కదలబోతుండగా, అతని చెవులకు చేరింది సింహనాదం వంటి పొలికేక ఒకటి.

"అర్ధరాత్రి సమీపించిన కొద్దీ రాక్షసులైపోతారు మా నగరవాసులు. అరుపుల్నీ, కేకలు విని అదిరిపోకుండా హాయిగా పడుకోండి!" చిరునవ్వు నవ్వుతూ అతన్ని హెచ్చరించింది వృద్ధురాలు.

చంపుడు పౌర్ణమి ఉద్దేశాన్ని అక్షరాలా నెరవేర్చేందుకు వీథుల్లో తిరుగుతున్న ఆ నగరవాసులు ఎవరో పెట్టిన కేక అయినట్లయితే పట్టించుకునేవాడు కాదు షాడో.

ఆమె చెప్పినట్లు హాయిగా ఆదమరిచి నిద్రలోకి జారిపోయి ఉండేవాడు.

చంపుడు పౌర్ణమికి సంబంధించినది కాదు అది. ప్రత్యేకమైన కక్షతో రగులుకుపోతూ చేసిన సింహనాదం.

పడకమీద మేనువాల్చే ఆలోచనను విరమించుకుని, ముఖద్వారం దగ్గరకి జంప్ చేశాడు షాడో. మూసి ఉన్న తలుపుల్ని ఓరగా తెరిచి బయటికి తొంగి చూసేసరికి అల్లంత దూరంలో అగుపించాడు అషిమో ఆంతరంగికుడు.

"ప్రతి ఇంటినీ గాలించండి! ఒక్కరిని కూడా వదిలిపెట్టకుండా బయటకు లాగండి. తూర్పు దిక్కు తెల్లబడేలోపుగా ఆ దుర్మార్గుల తలల్ని నాకు చూపించకపోతే, మీ తలల్ని నేను నరుకుతాను!" ఉగ్ర నరసింహుడిలా వణికిపోతూ ఆర్డర్స్ జారీ చేస్తున్నాడతను.

తమ పూర్వీకులు ఏర్పాటు చేసిన పద్ధతికి విరుద్ధంగా, వీథుల్ని వదిలి ఇళ్లమీదకి ఎగబడుతున్నారు అతనితో వచ్చిన దృఢకాయులు ... చిన్నా చితకా ముసలీ ముతకా అనే తేడా లేకుండా ఇళ్లల్లో ఉన్న వారందర్నీ నిలబెట్టి నరకటం మొదలుపెడుతున్నారు.

అంతకు ముందు క్షణం వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న ఆ వీథిలోని ఇళ్లన్నీ అగ్నిప్రమాద సమయంలో అల్లకల్లోలమైనట్లు ఆర్తనాదాలతో నిండిపోవటాన్ని గమనించేసరికి ఆగలేకపోయాడు షాడో.

"మా గురించి అనేకమంది అమాయకులు బలి అయిపోవటం నాకు నచ్చదు మామ్మా ... బయటికి పోయి తాడో పేడో తేల్చుకు తీరాలి. నీ ఆతిథ్యానికి మా కృతజ్ఞతలు!" వృద్ధురాలితో అంటూ, ముందు గదిలో ఒక మూల కనిపించిన పొడుగాటి రోకలిని చేతుల్లోకి తీసుకున్నాడు.

అంతకుముందు తమ దెబ్బకు తల్లక్రిందులై దూరంగా పారిపోయిన వారి గంద్రగొడ్డలి ఒకటి గంగారాం దగ్గరే ఉన్నది. గిరగిరా గాలిలోకి తిప్పుతూ కాలభైరవుడి మాదిరి వీథిలోకి పరుగు తీశాడతను.

ఎనభై సంవత్సరాల వయసున్న వృద్ధుడు ఒకతన్ని జుట్టు పట్టుకుని నడివీథిలోకి లాగుతున్న అషిమో అనుచరుడి మీదకి పోయాడు షాడో.

ఉన్నట్లుండి తల ఎత్తి అతన్ని గమనించా డతను. వెర్రిగా అరిచి తన దగ్గర ఉన్న ఖడ్గాన్ని బలంగా విసిరాడు.

చటుక్కున తలను వంచి, ఆ దెబ్బనుంచి రక్షించుకున్నాడు షాడో. చేతుల్లో ఉన్న రోకలిని ముందుకు లాగి అతని గుండెలమీద పొడిచాడు.

"రండిరోయ్ రండి... త్వరగా వచ్చి వాడి అంతు చూడండి! రండి... రండి!" ఇళ్లమీద పడుతున్న దృఢకాయుల్ని పెద్ద కంఠంతో వెనక్కి పిలుస్తూ వెల్లకిలా పడ్డాడతను.

రోట్లో వేసిన వస్తువుల్ని చితకకొట్టినట్లుగా ఒకే ఒక దెబ్బతో అతని తలను ఛిన్నాభిన్నం చేసేందుకు రోకలిని గాలిలోకి ఎత్తే అవకాశం షాడోకి లభించలేదు.

కందిరీగల తుట్టె మాదిరి వెనక్కి వచ్చేస్తున్న దృఢకాయుల నందర్నీ గమనించి ఆందోళనగా చేతిని పట్టుకున్నాడు గంగారాం.

రోకలిని అలాగే భుజంమీద వేసుకుని చటుక్కున వెనుతిరిగాడు షాడో... వింటి నుంచి వెలువడిన బాణంలా ఆ వీథి చివరికి పరుగుతీశాడు.

ఆకలిగొన్న తోడేళ్ల మంద మాదిరి అతన్ని అనుసరించారు అషిమో ఆంతరంగికుడి వెంట వచ్చిన దృఢకాయులు ... దారిలో ఎదురైన ప్రతి గుంపునూ తమతో కలుపుకుంటూ వెంటాడటం మొదలుపెట్టారు.

వంచిన తల ఎత్తకుండా నాలుగు వీథుల్ని అధిగమించి, వెడల్పుగా ఉన్న ఒక రాజమార్గాన్ని సమీపిస్తుండగా షాడో కంటపడింది ఆ మార్గంలో చిందులు తొక్కుతున్న మరో గుంపు.

ముందుకు పోయి మరికొన్ని కష్టాలను నెత్తిమీదకి తెచ్చుకోవటం ఇష్టం లేక ఇంకో మార్గాన్ని వెతుక్కోవాలని అనుకుంటూ ఉండగా, అతని దృష్టిపథంలోకి వచ్చింది ఆ గుంపు మధ్యలోనుంచి ఇవతలకు దూకిన ఒక స్త్రీ ఆకారం.

"రక్షించండి.... ఈ రాక్షసుల బారినుండి ఎవరైనా నన్ను కాపాడండి!" అని కేకలు పెడుతూ సూటిగా స్నేహితులు నిలిచి ఉన్న ప్రదేశంవైపే పరుగెత్తుకు వస్తోంది.

"ఆడమనిషి కదా అనే భావంతో అమాయకంగా ముందుకు పోతే నీ తలను తెగనరికి అషిమో ఆంతరంగికుడికి అప్పగిస్తుంది. తొందరపడకు గురూ!" అప్రయత్నంగా ముందుకు అడుగు వేయబోయిన షాడో చేతిని గట్టిగా పట్టుకుంటూ హెచ్చరించాడు గంగారాం.

ఆరు అంగల దూరంలోకి వచ్చేసిందా స్త్రీ ఆకారం. వీథి మొగదల నిల్చుని ఉన్న స్నేహితుల్ని గమనించగానే చేతులు జోడించి మోకాళ్లమీద నేలకు వాలిపోయింది.

రెండు అడుగులు ముందుకు వేసి ఆమె ముఖంలోకి చూశాడు గంగారాం.

"అయ్యబాబోయ్... నువ్వా అమ్మడూ? అడవుల్లో తిరగటం మానేసి ఈ దరిద్రపుగొట్టు నగరంలోకి వచ్చేశావా ?" ఆశ్చర్యంగా



అడగబోయాడు కానీ, అందుకు అవకాశం ఇవ్వలేదు ఆ స్త్రీని తరుముకు వచ్చిన గుంపు.

సమీపంలోకి వచ్చిన వారిని రోకలితో చెల్లాచెదురు చేసి ఇద్దరి తలల్ని కొబ్బరికాయల మాదిరి పగలగొట్టేశాడు షాడో.

విపరీతమైన భయంతో వణికిపోతున్న ఆ స్త్రీ చేయిపట్టుకుని పైకి లేపాడు గంగారాం. పక్కలకు కూడా చూడకుండా ఆ రాజమార్గం చివరిభాగంలోకి పరుగుతీశాడు.

షార్ప్‌గా ఉన్న ఒక మలుపు తిరిగిన మరుక్షణం అతని ఎదుట ప్రత్యక్షమైంది నగర ద్వారం.

అక్కడ గంతులు వేస్తున్న గుంపుల్ని తన చేతిలోని గండ్రగొడ్డలితో చెల్లాచెదురు చేస్తూ సూటీగా పోయా డతను. పది క్షణాల్లో ద్వారాన్ని దాటి, షాడోని కూడా బయటకు వచ్చేయమని కేకలు పెట్టాడు.

***

పట్టరాని ఆనందంతో పరవశించిపోతూ కుంగ్ ఫూ విద్యాపీఠాన్ని అధివసించిన గురువులందరికీ అభివాదం చేస్తూ సోఫాలో నుంచి లేచాడు కుంగ్ ఫూ విద్యాపీఠానికి ముప్పది రెండవ గురువైన బాజూ అకరక్ చింగ్‌లీ.

రాత్రి పన్నెండు గంటలు కావస్తున్నా నిద్రపోవటానికి అంగీకరించని మాస్టర్ షాడోని ఆయన దగ్గర వదలి అప్పుడే అవతలికి వెళ్లింది బిందు.

ఆయన లేచి నిలబడిన సవ్వడిని ఆలకించి పెద్ద వెండి పళ్లెరం నిండా మధురాధరవుల్ని నింపి, వెండి గ్లాసులో వెచ్చటి పాలు పోసి కిచెన్‌లో నుంచి బయటకు తీసుకువచ్చింది.

ఆ రోజు ఉదయం జపాన్ నుంచి వచ్చిన క్షణం నుంచీ ఒక్క మాట కూడా మాట్లాడకుండా ధ్యానముద్రలోకి వెళ్లిపోయిన చింగ్‌లీ, ఉన్నట్లుండి అంత సంతోషంగా కనిపించటానికి కారణాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ, టీపాయ్‌మీద పెట్టింది తను తీసుకువచ్చిన పదార్థాలను.

"మన ప్రార్థనలు ఫలించాయి తల్లీ! తరతరాల నుండి మన విద్యాపీఠాన్ని చుట్టుముట్టి ఉన్న భయంకర శాపం విచ్ఛిన్నమైపోయే సమయం చాలా దగ్గరకి వచ్చేసింది. ఆయుష్మంతుడవుతాడు నీ బిడ్డ... నిండు నూరేళ్లు జీవించి తండ్రిని మించిన తనయుడిగా పేరు తెచ్చుకుంటాడు!" టీపాయ్ మీద పెట్టబడిన పళ్లెరాన్ని చూడగానే అటుకేసి కదలబోయిన మాస్టర్ షాడో తల నిమురుతూ చెప్పాడు చింగ్‌లీ.

అంతటితో ఆగగలేదతను. కుడిచేతిని బిడ్డడి తలమీద అలాగే ఉంచి గంభీరమైన కంఠంతో ఏవేవో మంత్రాలను చదవసాగాడు.

ఉన్నట్లుండి ఆ గది నిండా సున్నితమైన సాంబ్రాణి పొగలు అలుముకుంటున్న భావన కలిగింది బిందూకు. తన అనుమతి లేకుండా ఒక్క ఈగ కూడా లోపలికి రాలేని ఆ ప్రదేశంలోకి పిలుపుకోసం ఎదురు చూడకుండానే అనేకమైన ఆకారాలు వచ్చేస్తున్నట్లుగా కూడా అనిపించింది.

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ కళ్లు చిట్లించి చూసిన ఆమెకు ఒకరి తరువాత ఒకరుగా చింగ్‌లీ వెనుక నిలబడి అతనితోపాటు మంత్రపఠనంలో పాలు పంచుకుంటున్న కుంగ్‌ఫూ వస్తాదులు అనేకమంది అగుపించారు.

నింజా దొంగలకు ఆగర్భశత్రువు, అద్భుతమైన బలపరాక్రమాలు కలిగినటువంటి హుకైదో ఉన్నాడు వారిలో. చైనా సముద్ర తీరాల్లో విచ్చలవిడిగా సంచరించే సముద్రపు దొంగల్ని, ఆ సముద్రంలోనే ముంచి చంపిన టిష్మీ వస్తాదు ఉన్నాడు. అచికూ డెమన్స్ మీద యుద్ధాలు ప్రకటించటంలోనూ, అస్మీ పానీయాన్ని ఆనందంగా పుచ్చుకోవటంలోనూ సాటిలేని మొనగాడుగా పేరుపొందిన బుషిడో వస్తాదు ఉన్నాడు. స్వయంగా షాడోకి కుంగ్ ఫూ విద్యాబోధన చేసిన ముప్పది ఒకటవ గురువు చాంగ్‌చున్ కనిపించాడు.

నేలను తాకే విధంగా క్రిందికి వేలాడుతున్న తమ కాషాయాంబరాలను ఎడమ చేతులతో ఒంటికి దగ్గరిగా తీసుకుంటూ, కుడి చేతుల్ని మాస్టర్ షాడోకేసి జాచి, గుడి గంటలవంటి కంఠాలతో ఆశీర్వచనాలు అందచేస్తున్న ఆ మహనీయుల్ని చూసేసరికి గిర్రున తిరిగాయి బిందు కనులు.

సజీవుడైన చింగ్‌లీతో కలుపుకుని ముప్పయి ఒక్కమంది మాత్రమే ఉన్నారు వాళ్లు.

ముఖంమీద ప్రత్యక్షం అవుతున్న స్వేదబిందువుల్ని పమిట చెంగుతో అద్దుకుంటూ లెక్కకు తగ్గిన గురువు ఎవరో కనిపెట్టడానికి ప్రయత్నించిందామె.

కనులు తిరుగుతున్న సెన్సేషన్ తీవ్రతరమై, నిలుచున్న చోటునే విరుచుకు పడిపోతుండగా, ఛెంగున ముందుకు దూకి క్రింద పడిపోకుండా పట్టుకున్నాడు చింగ్‌లీ.

నల్లటి సిల్కు పరదాలు తన మస్తిష్కం చుట్టూ మూసుకుంటున్న ఆఖరి క్షణంలో హఠాత్తుగా గుర్తుకు వచ్చాడు బిందుకు కుంగ్‌ఫూ విద్యాపీఠానికి నాలుగవ గురువైన బేలాశాన్.

కుంగ్‌ఫూ గురువులకు సంతానం కలగకపోవటానికి కారకుడైన అతను అక్కడికి వచ్చిన ఆకృతులలో అగుపించటం లేదు.

తన ముఖాన్ని మిగిలిన గురువులకు చూపించటం ఇష్టంలేకనా?

ఆ ప్రశ్నకు సరైన సమాధానం లభించకముందే స్పృహను కోల్పోయిన ఆమెవంక ఆప్యాయంగా చూస్తూ తల నిమిరాడు చింగ్‌లీ.

"తను చేసిన పొరపాటును సరిదిద్దుకునే అవకాశం లభించినందుకు ఆనందంతో చిందులు వేస్తూ, నీ భర్త దగ్గరికి పోయాడు తల్లీ ఆ బేలాశాన్... తను అసంపూర్తిగా వదిలేసిన పనిని నీ భర్త పూర్తి చేయటాన్ని దగ్గర ఉండి చూసేందుకు తరలి వెళ్లాడు!" అంటూ తన స్థానంలోకి వెళ్లి పద్మాసనం వేసుకు కూర్చున్నాడు.

పది నిమిషాల తరువాత కన్నులు తెరిచింది బిందు. అంతుకుముందు అగుపించిన ఆకారాలు ఒక్కటి కూడా అక్కడ లేకపోవడంతో తల విదిలిస్తూ సోఫాలో నుంచి లేచింది.

చింగ్‌లీ ఆగమనం వల్ల ఉద్వేగం అధికమై ఏవేవో ఊహించుకోవటం జరిగిందని సరిపెట్టుకుంటూ పక్కకు చూసి అదిరిపడింది.

తనను అడ్డుకునే వారెవరూ లేరనే ధైర్యంతో టీపాయ్ అంచుల్ని పట్టుకుని పైకి లేచాడు మాస్టర్ షాడో. దాని మీద ఉంచబడిన ఫలహారాల పళ్లెరాన్ని క్రిందకు నెట్టాడు. పాల గ్లాసును కూడా దొర్లించి, మడుగు కట్టిన పాలను అరచేతులతో తడుతూ ఆనందిస్తున్నాడు.

పళ్లు బిగించి అతని దగ్గరకి పోయింది బిందు. వీపు పగిలిపోయేటట్లు ఒక చరుపు చరవాలని అనుకున్నది గానీ, ధ్యానముద్రలో ఉన్న చింగ్‌లీ కనులు తెరిచి చూస్తాడన్న అనుమానంతో చెవిని గట్టిగా మెలిపెట్టి, చేతుల్లో తీసుకున్నది.

***

"నడచి నడచి నా కాళ్లు నెప్పులు పుడుతున్నాయి. మిట్ట మధ్యాహ్నపు ఎండలో ఇలా పాట్లు పడటం కంటే వెనక్కి వెళ్లి ఆ అషిమో అనుచటరులతో తల పట్లు పట్టటం బాగుంటుందని అనిపిస్తోంది!"



అంటూ నడకను ఆపి, దగ్గర్లో ఉన్న ఒక చెట్టు క్రిందికి బయలుదేరాడు గంగారాం.

అన్నంత పనీ చేస్తాడన్న అనుమానంతో ఆందోళనగా షాడో ముఖంలోకి చూసింది, అతని సంగతి పూర్తిగా తెలియని యువతి.

ఎదురు పడిన దగ్గర్నించీ పెదవి విప్పి ఒక్క మాట కూడా ఆమెతో మాట్లాడలేదతను. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నం ఏదీ చేయకుండా గంగారాం పక్కకు పోయి చెట్టు నీడలో మేను వాల్చాడు.

"ప్రస్తుతానికి నిండుగానే ఉన్నది మన కడుపు. చీకటి పడే సమయంలో ప్రారంభిస్తుంది ఆకలి రాగాన్ని!" వెలుగు ఉండగానే ఆహారాన్ని వెతుక్కోవటం మంచిదనే అర్థాన్ని సూచిస్తూ అన్నాడతనితో గంగారాం.

అతను క్రిందపెట్టిన గంద్రగొడ్డలిని అందుకుని, ఒక్కసారిగా పరుగు ప్రారంభించింది వారితోపాటు నగరంలోనుంచి పారిపోయి వచ్చిన యువతి.

"అయ్యబాబోయ్... ఆగు! అడవిలో కొండవాగు దగ్గర చిక్కుబడినట్లు ఇంకేదైనా ప్రమాదంలో ఇరుక్కున్నావంటే రక్షించే ఓపిక నాకు లేదు... ఆగు, అమ్మడూ! ఆగాగు!" కంగారుగా పైకి లేచి పెద్దపెద్ద కేకలతో ఆమెను హెచ్చరించటానికి ప్రయత్నించాడు గంగారాం.

అతని అరుపుల్ని లెక్కచేయకుండా ఒక పల్లపు ప్రదేశంలోకి పోయి మాయమైపోయిందా యువతి. అర్ధ ఘడియ తరువాత కుందేళ్లవంటి జీవాల్ని రెండింటిని తీసుకువచ్చి అతనిముందు పెట్టింది.

"పచ్చి మాంసాన్ని పీక్కుతినటం చాలా ఇబ్బందిగా ఉంటుంది అమ్మడూ! నిప్పులమీద కాలిస్తే గానీ మన నోటికి సయించేటట్లు లేదు!" అంటూ తన దుస్తుల్లో ఉన్న సరంజామాలో నుంచి చిన్న లైటర్‌ని తీయబోయాడు.

అతని సహాయంకోసం ఎదురు చూడకుండా చుట్టుపట్ల ఉన్న పొదల్లోంచి ఎండు చితుకుల్ని ఏరుకు వచ్చిందా యువతి. రెండు గులకరాళ్లను ఒకదానితో ఒకటి రుద్ది నిప్పును తయారుచేసింది.

మాట తన నోటినుంచి వచ్చిన మరుక్షణం చకచకా పని పూర్తి చేస్తున్న ఆమె చురుకుదనాన్ని మెచ్చుకుంటూ తల ఊపాడు గంగారాం.

తను తీసుకువచ్చిన కుందేళ్లవంటి జంతువుల్ని శుభ్రం చేసి చితుకుల మంట మీద చక్కగా కాల్చిందామె. అరచేతి వెడల్పున్న అడవి ఆకులలో నీట్‌గా పాక్‌చేసి అతనివంక చూసింది.

విశాలంగా ఉన్న ఆమె కాటుక కనుల్లోనుంచి రెండు కన్నీటి బిందువులు బుగ్గల మీదకి జారటాన్ని గమనించి ఆశ్చర్యంగా నొసరు ఎగరవేశాడతను.

"రెండు పొద్దులకు ఒకసారి కూడా ఇటువంటి ఆహారాన్ని సంపాదించుకోవటం చేతకాక పస్తులతో కాలక్షేపం చేసే మా జాతి ప్రజలు గుర్తుకు వచ్చారు!" గబగబా బుగ్గల్ని తుడుచుకుంటూ అస్పష్టమైన కంఠంతో అన్నదామె.

"ఎక్కడ ఉన్నారు మీ జాతి ప్రజలు?" వెంటనే అడిగాడు గంగారాం.

భూమి, ఆకాశం ఏకమవుతున్న సుదూర ప్రదేశంలో కనబడీ కనబడనట్లున్న కొన్ని కొండలకేసి చేతిని ఊపిందామె.

"ఆకలితో మాడిపోతున్న మీ జాతిని వదిలి ఇటుగా ఎందుకొచ్చావు నువ్వు? అడవుల్లో ఆహారాన్ని సంపాదించుకోవటానికా?" ప్రశ్నమీద ప్రశ్నగా మరో ప్రశ్న వేశాడు గంగారాం.

సమాధానం చెప్పటానికి తటపటాయిస్తూ తల వంచుకున్నదా యువతి.

పది క్షణాలు గడిచిన తరువాత కూడా ఆమె నోటివెంట మాట రాకపోవడంతో ముంచుకువచ్చేసింది కోపం గంగారాంకి.

"మూగవాళ్లతోను, చెవిటివాళ్లతోనూ ప్రయాణం చేసే అలవాటు మాకు లేదు. మాతో తిరిగి మమ్మల్ని ఇబ్బంది పెట్టకుండా నీ దారి నువ్వు చూసుకో! తయారుచేసిన తిండిని నువ్వే తీసుకుపో!" అంటూ ముఖాన్ని పక్కకు తిప్పుకున్నాడు.

అప్పుడు... అతనలా తన అసంతృప్తిని ఘాటైన మాటల్లో ప్రకటించినప్పుడు పెదవులు విప్పిందా యువతి.

"కష్టాల కడలిలో మునిగి అంతరించిపోవటానికి సిద్ధంగా ఉన్న మా జాతిని ఆదుకునే కుంగ్ ఫూ వస్తాదు చంపుడు పౌర్ణమినాడు మా నాయకుడి ప్రథమ సంతానానికి దర్శనమిస్తాడని మా పూర్వీకులు చెప్పారు!"

అనుకోని విధంగా ఆమె నోటివెంట కుంగ్‌ఫూ వస్తాదుల ప్రసక్తి వచ్చేసరికి అదిరిపడి పక్కకు చూశాడు గంగారాం.

అతని చూపుల్ని గానీ, ఆ యువతి మాటల్ని గానీ పట్టించుకునే పరిస్థితిలో లేడు అతని స్నేహితుడు. తల క్రింద చేయిపెట్టుకుని హాయిగా నిద్రపోతున్నాడు.

"తరతరాలుగా ఎవరికీ దర్శనం ఇవ్వని ఆ మహనీయుడు ఈ తరంలోనైనా ఎదుట పడతాడన్న ఆశతో బయలుదేరి వచ్చాను. మా నాయకుడికి ప్రథమ సంతానాన్ని అయిన నేను ... అందరి మాదిరిగా నగర ద్వారం దగ్గరే కూర్చోకుండా, సముద్రతీరంలోను, అడవిలోను, ఆఖరికి ప్రమాదకరమని తెలిసి కూడా నగర వీధుల్లోనూ వెతికాను. అయినా ప్రయోజనం లేకుండా పోయింది.

అడవిలో అతనికి తారసపడటానికి, నగరంలో చేతులుజోడించి కాపాడమని ప్రార్థించటానికి గల కారణాన్ని వివరిస్తూ చెప్పిందా యువతి.

ఆమె జాతిని పీడించుకుతింటున్న కష్టాలు ఎటువంటివో, కుంగ్‌ఫూ వస్తాదులకు ఆమె జాతి కష్టాలకు ఉన్న సంబంధం ఏమిటో తెలుసుకోవాలని అనుకున్నాడు గంగారాం.

అంతలోనే కనులు తెరిచి లేచి కూర్చున్నాడు అతని స్నేహితుడు "ఆ పిల్ల ఎక్కడికి పోవాలో తెలుసుకో. తీసుకుపోయి అక్కడ దిగబెట్టి, మన దారిన మనం వెళ్లిపోదాం!" బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ అతనితో అన్నాడు.

ప్రశ్నార్థకంగా తనకేసి చూసిన గంగారాంకి, అంతకు ముందు తను చూపించిన కొండలనే మరోసారి చూపించిందా యువతి.

వచ్చిన పని నెరవేరకపోయినా, ప్రాణాలతో సురక్షితంగా తన వారిని చేరుకోగలగుతున్నానన్న సంతోషం ఆమె కనులలో కనిపించకపోవటాన్ని గమనించి తల బరుక్కుంటూ ప్రయాణానికి సిద్ధం అయ్యాడు గంగారాం.

***

చీకటి పడేటంతవరకూ నడిచి, తమ దారికి అడ్డుగా ప్రత్యక్షం అయిన చిన్న కొండవాగు దగ్గర ఆగిపోయాడు షాడో.

ఎండు చితుకుల్ని ఏరుకు వచ్చింది వారితోపాటుగా అడుగులు వేసిన యువతి. పెద్ద మంటను రగిల్చి, అడవి ఆకుల్లో పాక్ చేసిన ఆహారాన్ని వెచ్చ చేసి వారి ముందుంచుంది.

సుష్టుగా తిని కడుపు నిండుగా వాగులోని నీళ్లను తాగాడు గంగారాం నడిచి నడిచి అలసిపోయి ఉండటం వల్ల ఒక కొండరాయి పక్కన పడుకుని వెంటనే నిద్రలోకి జారిపోయాడు.

అతని మాదిరిగానే బడలి ఉన్నా, చితుకుల మంటను వదిలి ఒక్క

అడుగు కూడా ఇవతలికి వెయ్యని యువతి వంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు షాడో.

"కళ్లు మూసుకుంటే తిరిగి కనులు తెరుస్తానో లేదోనని భయంగా ఉన్నది!" అస్పష్టమైన కంఠంతో తల వంచుకునే సమాధానం ఇచ్చిందామె.

నగరంలో ఎదురైన చేదు అనుభవం మూలకంగా బెదిరిపోయిందని భావించి, తన దగ్గరకు రమ్మని పిలిచాడు షాడో. పక్కనే చదునుగా ఉన్న బండరాయిని చూపించి, దానిమీద పడుకోమని సైగ చేశాడు.

భయం భయంగానే చూస్తూ ఆ బండమీద మేను వాల్చిందా యువతి. భయంకంటే అలసట అధికం కావడంతో తనకు తెలియకుండానే గాఢ నిద్రకు వశమైపోయింది.

చల్లారి పోవటానికి సిద్ధమవుతున్న చితుకుల మంటను సరిచేసి కొద్దిసేపు పచార్లు చేశాడు షాడో. అర్ధ ఘడియ తరువాత చదునుగా ఉన్న బండకు సమీపంలో కూర్చుని కనులు మూసుకున్నాడు.

మూసుకున్న కనులముందు దట్టమైన పొగ ప్రత్యక్షం అయినట్టు అనిపించింది అతనికి. ఆ పొగ మధ్యలోనుంచి ఇవతలికి వచ్చిన ఒక ఆకారం తన తల నిమిరి భుజం తట్టినట్లుగా కూడా తెలిసివచ్చింది.

"నిద్రపోతున్నావా చిరంజీవీ? నిన్ను నమ్మిన వారిని ప్రమాదపు అంచుల్లో ఒంటరిగా వదిలి మానవ సహజమైన బలహీనతకు లొంగిపోతున్నావా?" గుడి గంటలు మోగినట్లు మృదువుగా, స్పష్టంగా అతన్ని హెచ్చరించింది ఆ ఆకారం.

కళ్లు చిట్లిస్తూ ఆ ఆకారపు ముఖంలోకి చూశాడు షాడో. కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడి, అప్రయత్నంగా అభివాదం చేశాడు.

ప్రపంచంలో ఉన్న సముద్రాలన్నింటినీ ఒంటరిగా ఒక నాటుపడవ మీద అధిగమించి కుంగ్ ఫూ గురువుల శక్తి యుక్తులను మానవాళికంతటికీ చాటి చెప్పిన అసమాన ధైర్యవంతుడు, కుంగ్‌ఫూ విద్యాపీఠానికి నాలుగవ గురువైన బేలాశాన్ అతను.

"పరిచయం లేని పరిసరాల్లో ఆదమరిచి ఉండటం, ఆరోగ్యానికి మంచిది కాదు చిరంజీవీ! కార్యోన్ముఖుడు ఎప్పుడూ కన్నులు మూసుకోడు!" మరోసారి అతని భుజం తడుతూ వెనక్కి జరిగి సుడులు తిరుగుతున్న పొగలో కలిసిపోయాడు బేలాశాన్.

భయంతో వణికిపోతున్న యువతిని నిర్భయంగా నిదురించమని చెప్పి తను కునికిపాట్లు పడటం మొదలుపెట్టినందుకు సిగ్గుపడుతూ, తల వంచి ఆ మహనీయుడికి నమస్కారం చేయబోయాడు.

ముందుకు వాలటంలో ముఖం ఎదురుగా ఉన్న కొండరాయికి పొడుచుకుని వెంటనే వచ్చేసింది మెలకువ.

మరోసారి మలిగిపోవటానికి సిద్ధంగా ఉన్న చితుకుల మంటలో నుంచి వెలువడుతున్న పొగ తప్ప, మరే విధమైన మార్పు ఆ ప్రదేశంలో అగుపించకపోయేసరికి అప్రయత్నంగా అతని పెదవుల మీదకి పరుగెత్తుకు వచ్చేసింది ఒక చిరునవ్వు.

అలసట నిండిన శరీరం మీద కంట్రోల్‌ని కోల్పోయి, రకరకాల భ్రమలకు గురి అవుతున్నది తన మెదడు. అంతరంగంలోని ఆలోచనల్ని


స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

# శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం

హనుమాన్ వీధి, కరీంనగర్, జి : కరీంనగర్ Phone : 35906



శాశ్వతనిధి సభ్యత్వం రూ. 365/-

★ శాశ్వతనిధి సభ్యత్వం చెల్లించినచో నిత్యం అభిషేకం జరుపబడును.
★ కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో వీరాంజనేయస్వామి దేవస్థానం ఎంతో ప్రాశస్త్యమైనది.
★ నిత్యం స్వామివారికి అభిషేకములు జరుపబడును.
★ ప్రతి శని, మంగళవారాలలో విశేష పూజలు జరుపబడును.
★ వివాహం కాని కన్యలు 11 రోజులు స్వామివారికి మన్యసూక్తులతో అభిషేకము చేసిన వారికి స్వామివారి అనుగ్రహంతో వివాహం జరుగును.
★ ప్రతి సంవత్సరం గణేశ్ నవరాత్రులు, దేవీ నవరాత్రులు మరియు శ్రీరామ కల్యాణ ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించబడును.



శ్రీ పి. సత్తయ్య
కార్యనిర్వహణాధికారి



శ్రీ తౌదుపునూరి జగన్నాథం
దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త



శ్రీ బొమ్మ వెంకటేశ్వర్ B.Com., LLB.,
దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు, ఇందుర్తి శాసనసభ్యులు



యదార్థాల మాదిరి కనుల ముందర కనిపింపచేస్తోంది.

ఒళ్లు విరుచుకుంటూ మంట దగ్గరకి పోయి నిప్పు చితుకు నొకదాన్ని సిగరెట్ మాదిరి నోట పెట్టుకోబోతుండగా, చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం.

ఆ చుట్టుపట్ల సంచరించటానికి అలవాటుపడిన అడవి జంతువు ఏదో తమ మీద దాడి చేయటానికి సిద్ధం కాబోతున్నదని అనుకుంటూ, బూటుకు బిగించి ఉన్న డాగర్‌ని చేతుల్లోకి తీసుకున్నాడతను.

పాతిక అడుగుల దూరంలో పడేటట్లు ఆ ఆయుధాన్ని ఎగరతన్నింది గబ్బిలం మాదిరి నిశ్శబ్దంగా దూసుకువచ్చిన ఒక ఆకారం.

చంద్రనిప్పులవంటి కనులతో చురచురా చూస్తూ, చురకత్తులవంటి నఖాలతో అతని మెడమీద మోదింది.

మెరుపుకంటే వేగంగా రియాక్ట్ అయ్యాడు షాడో. నిలుచున్న పళాన వెనక్కి దొర్లి ఆ దెబ్బనుంచి తప్పించుకున్నాడు.

అతని మీదనుంచి అవతలికి దూకి చదునుగా ఉన్న బండరాయి సమీపంలోకి చేరుకున్నది ఆ ఆకారం. జానెడు పొడవున్న కోరలతో పరమ భీకరంగా ఉన్న నోటిని తెరిచి, అమాయకంగా నిదురిస్తున్న యువతి మెడను పట్టుకోబోయింది.

నేలకు కొట్టిన రబ్బర్ బంతిలా ఛంగున పైకి లేచి, కంటికి కనిపించనంత వేగంతో ఆ ఆకారాన్ని సమీపించాడు షాడో. గుండెలనిండా గాలి పీల్చుకుంటూ ఫెడీమని డెలివర్ చేశాడు అత్యంత ప్రమాదకరమైన సైడ్ కిక్ నొకదాన్ని.

నిల్చున్నచోటునే విరుచుకుపడిపోయి గిలగిలలాడుతూ ప్రాణాలు వదలటమో కీచుగా అరుస్తూ అవతలికి పారిపోవటమో చేయవలసిన ఆ ఆకారం, చీమ కుట్టినట్లుగా కూడా చలించలేదు గానీ, ఉక్కుస్తంభాన్ని తన్నినట్లుగా మొద్దుబారిపోయింది అతని పాదం.

పిడికిళ్లు బిగించి ముందుకు లంఘించాడు షాడో. కొండరాళ్లను సైతం పిండి పిండి చేయగల కిల్లింగ్ పంచెస్‌ని ప్రయోగించాడు.

దుర్వాసనలు వెదజల్లుతున్న నోటిని తెరిచి నిశ్శబ్దంగా నవ్వుతూ వెనుతిరిగి, అతను ఊహించనంత వేగంతో ఒక చేతిని విసిరిందా ఆకారం.

రబ్బర్ బెలూన్ మాదిరి గాలిలోకి లేచాడు షాడో. గింగిరాలు తిరుగుతూ పోయి కొండవాగు దగ్గర పడ్డాడు.

తన బలం ఆ భీకర శరీరం మీద పనిచేయటంలేదని గ్రహించేసరికి దాహం వేస్తున్నట్లు ఎండుకుపోయింది అతని గొంతు. ముత్యాల మాదిరి ముఖంమీద ప్రత్యక్షం అయ్యాయి పెద్దపెద్ద చమట బిందువులు.

అలస్యం చేసిన కొద్దీ తన శక్తి దిగజారిపోవటమే తప్ప, ఆ ఆకారాన్ని పడగొట్టే ఉపాయం స్ఫురించదని అర్థమై, పడినచోటినుంచి పైకి లేవబోతుండగా గబ్బిలం రెక్కలవంటి రెక్కల్ని అల్లల్లాడిస్తూ అతని మీదకు వచ్చేసింది ఆకారం.

కాంక్రీట్ స్తంభాలవంటి పాదాలను అతని గుండెలమీద మోపి విలయతాండవం చేయటం మొదలుపెట్టింది.

పక్కటెముకలు పటపటమని శబ్దం చేయటాన్ని గమనించాడు షాడో. ఊపిరితిత్తులు నజ్జు నజ్జు అయిపోతున్న భావనను పొందాడు. నాశికా రంధ్రాల నుంచి ఎర్రటి రక్తపు ధార వెలుపలికి వస్తున్న సమయంలో, అన్నిటికీ తెగించి ఆ పాదాల్ని గట్టిగా పట్టుకున్నాడు. జారిపోతున్న జవసత్వాల్ని కూడతీసుకుంటూ డిస్పరేట్‌గా పక్కకు దొర్లాడు.

అతనితోపాటు కదిలింది ఆ ఆకారం ... ఉప్పు మూట పడినట్లు దబ్బుమని శబ్దం చేస్తూ నీటిలో పడింది.

పడిన వెంటనే పైకి లేచి చురకత్తులవంటి కాలి గోళ్లతోనో, ఇనుపముక్కలవంటి బాహువుతోనో షాడో అంతు చూడలేదది.

ఊబి నేలలో చిక్కుబడినట్లు వికృత శబ్దాలు చేస్తూ విలవిలా కొట్టుకున్నది. గబ్బిలం రెక్కలవంటి తన రెక్కల్ని అతి వేగంగా కదిలిస్తూ ఉన్నట్లుండి గాలిలోకి ఎగిరింది. అతను చూస్తూ ఉండగానే పైపైకి వెళ్లి చీకట్లలో కలిసిపోయింది.

అది ఎందుకంత అర్థాంతరంగా అవతలికి వెళ్లిపోయిందో ఊహించే ప్రయత్నం చేయలేదు షాడో. బుల్‌డోజర్ క్రిందపడి నలిగిపోయినట్లయిన శరీరాన్ని పళ్లబిగువన వాగు ఒడ్డుకు చేర్చాడు. చితుకుల మంట దగ్గరకి పోయే శక్తి లేక మధ్యలోనే బోర్లా పడిపోయాడు.

"అయ్యయ్యో.... ఇక్కడ పడుకున్నావేమిటి గురూ? పది పదిహేను రోజుల నుంచీ పస్తుంటున్నట్లు ముఖం పీక్కుపోయిందెందుకని?" అంటూ గంగారాం తన భుజాల్ని పట్టుకుని కుదిపేసరికి, తూర్పు దిక్కు తెల్లబడుతున్న సమయంలో మెలకువ వచ్చి కనులు తెరిచాడతను.

"రాత్రంతా పీడకలలు ప్రాణం తీశాయి, గంగూ! నిద్రపట్టకపోవటం మూలాన నీరసంగా ఉంది!" తనకు కనిపించిన భీకరాకారాన్ని గురించి వర్ణించి అతన్ని కంగారు పెట్టటం ఇష్టం లేక నోటికి వచ్చిన సమాధానాన్ని చెపుతూ లేచి నిలబడ్డాడు.

అంతలోనే అతనికి గుర్తుకు వచ్చింది భీకరాకారం దెబ్బకు తన చేతుల్లోనుంచి ఎగిరిపోయిన డాగర్ గురించి. దానికోసం వెతకటాన్ని ప్రారంభించేసరికి మరింతగా బలపడిపోయాయి గంగారాం అనుమానాలు.

"రాత్రి ఏదో రాంభజన జరిగింది. నాకు చెప్పకుండా దాస్తున్నావు నువ్వు!" నిష్ఠూరంగా అంటూ పక్కకు చూశాడతను.

చదునుగా ఉన్న బండరాతిమీద పడుకుని ఉన్న యువతి కూడా మెలకువ వచ్చి కనులు నులుముకుంటూ లేచి కూర్చుంటోంది.

"రాత్రి ఇక్కడ ఏదైనా గొడవ జరగటం నువ్వు గమనించావా?" షాడోని అంత తేలికగా వదిలిపెట్టటం ఇష్టంలేక ఆమెను కూడా అడిగాడు గంగారాం.

అతని ప్రశ్న అసలు తనకు వినపడనట్లు బండమీదనుంచి ఛెంగున లేచి క్రిందకు దూకిందామె.

"నేను బ్రతికే ఉన్నాను... కర్గా పిశాచికి బలైపోకుండా నే నింకా ప్రాణాలతోనే ఉన్నాను!" ఆనందాతిరేకంతో కేకలు పెడుతూ, దూరంలో కనిపిస్తున్న తమ కొండలకేసి పరుగు తీసింది.

"పరుగెత్తి పరుగెత్తి మరో ప్రమాదంలో చిక్కుబడకముందే ఆమెను పట్టుకో గంగూ! పట్టుకో!" కొండరాళ్ల మధ్య కనిపించిన తన ఆయుధాన్ని తిరిగి బూటు పక్కన బిగించుకుంటూ స్నేహితుడిని హెచ్చరించాడు షాడో.

కనుబొమ్మల్ని ముడిచి అతనివంక క్రూరంగా చూస్తూ ఆ పిల్ల వెళ్తున్న మార్గంలో పరుగు తీశాడు గంగారాం.

***

"ఒకానొకప్పుడు ఈ చుట్టుపట్ల ఉండిన గ్రామాల్లో హాయిగా ఆనందంగా కాలం గడిపిన జాతి మాది!"

తనతోపాటు అడుగులు వేయలేక ఒక బండరాయి మీద కూర్చుండిపోయిన గంగారాంకి, తమ చుట్టూ ఉన్న శిథిలమై మట్టిగుట్టలుగా మారిపోయిన కట్టడాలను చూపిస్తూ అన్నది ఆ యువతి.

"ప్రజల్ని కన్నబిడ్డల మాదిరి పరిపాలించటమే కానీ, పరాయి జాతుల



దాడుల్ని తిప్పికొట్టేందుకు సైన్యాల్ని సమకూర్చేవటం మీద శ్రద్ధ వహించలేదు మా వంశీయులు. అది అలుసుగా తీసుకుని మా మీద దాడి చేశారు ఇసుక మైదానం దగ్గర ఉండే నగరంలోని అషిమాటో వంశీయులు. ఎదురు తిరగటానికి ప్రయత్నించిన మగవారినందర్నీ వధించి, అందచందాల్లో అప్సరసలని పేరుపొందిన మా ఆడవారిని బందీలుగా నగరానికి తీసుకుపోయారు.

"అవమాన భారంతో క్రుంగిపోతూ సముద్రతీరంలో తల దాచుకున్న మావారికి, పగడపు గుట్టల కారణంగా తను ప్రయాణం చేస్తున్న నాటుపడవ నాశనమై, కొనప్రాణాలతో కొట్టుకు వస్తున్న కుంగ్‌ఫూ వస్తాదు కనిపించాడు.

వైద్యం చేయటంలో తమకున్న అపారమైన అనుభవాన్ని ఉపయోగించి అతని ప్రాణాలు కాపాడాడు మా వంశీయులలో ఒక వైద్యుడు. కృతజ్ఞతా సూచకంగా తన మూడు మూరల మహా ఖడ్గాన్ని తీసుకుని అషిమాటో వంశీయులను చిందరవందర చేసేశాడు ఆ కుంగ్‌ఫూ వస్తాదు. చెరబట్టబడిన మా ఆడవారిని విడిపించి మా గ్రామాలను మాకు స్వాధీనం చేశాడు.

భవిష్యత్తులో అటువంటి ఆపదలు మమ్మల్ని చుట్టుముట్టడం సంభవిస్తే తను తప్పనిసరిగా వచ్చి సహాయపడతానని వాగ్దానం చేసి వట్టి చేతులతోనే సముద్రంలో ఈదుకుంటూ వెళ్లిపోయాడు!

కుంగ్‌ఫూ వస్తాదు చేతిలోని మహాఖడ్గపు ధాటికి తట్టుకోలేక పర్వతాల్లోకి పారిపోయారు చావగా మిగిలిన అషిమాటో వంశీయులు. తినటానికి తిండి లేక క్రుంగి క్రుశించి నశించిపోతూ ఉండగా, వారిలో ఆఖరి మనిషికి లభించింది ఒక మంత్రగ్రంథం! ప్రతీకార వాంఛతో రగులుకుపోతూ కఠోర నియమాలను పాటించి కర్గూ పిశాచాన్ని ఆవాహన చేశాడతను. తన వారు పడిన కష్టాలనే మా వంశీయులు కూడా పడేందుకు కొన్ని నిబంధనలు విధించి ఆ క్షుద్ర రూపాన్ని మా ప్ర జల మీదకి పంపకం చేశాడు.

కొండల్లోకి పారిపోయిన వారిని మాత్రం వదిలిపెట్టిందా పిశాచం. కొండల్ని వదలి దూరంగా వెళ్లిపోవటానికి ప్రయత్నించిన వారందర్నీ విరుచుకు తిన్నది.

సరైన ఆహారం లభించక ఆకలితో మాడి నశించిపోతున్న తమ సంతానాన్ని చూసుకుని ఆక్రోశిస్తూ, అవసర సమయంలో తనంతట తానుగా వచ్చి ఆదుకుంటానని మాట ఇచ్చిన కుంగ్‌ఫూ వస్తాదు రాకకోసం ఎదురు చూస్తున్నారు మా వంశీయులు

తమ నాయకుడి ప్రథమ సంతానాన్ని ప్రతి చంపుడు పౌర్ణమికీ ఇసుక మైదానం దగ్గరి నగరం ముందుకు పంపుతున్నారు ... కుంగ్‌ఫూ వస్తాదు కోసం ఎదురు చూసి నిరాశా నిస్పృహలతో వెనుతిరిగి ఆ బిడ్డలు కర్గూ పిశాచపు కరాళదంష్ట్రలకు బలైపోవటాన్ని కూడా సహనంతో భరిస్తున్నారు...

కొండల్ని వదలి ఇవతలికి వచ్చిన వారిలో ఆ క్షుద్ర స్వరూపానికి బలికాకుండా ప్రాణాలతో ఉండగలిగింది నే నొక్కదాన్నే.... కుంగ్ ఫూ వస్తాదు కనిపించలేదన్న బాధ కొద్దిగా ఉపశమిస్తోంది ఈ కారణం వలన ... వస్తాదులు కాకపోయినా మీ పరిచయం మా జాతికి మంచిని కలుగజేస్తుందని అనిపిస్తోంది!" మెరుస్తున్న కనులతో చెప్పి, మరోసారి కొండలకేసి పరుగును ప్రారంభించిందా యువతి.

తాపీగా అడుగులు వేస్తూ వస్తున్న షాడోకేసి ఒకసారి చూసి పెద్ద పెద్ద అడుగులతో ఆమెను అనుసరించాడు గంగారాం.

మధ్యాహ్న సమయానికి కొండల్లో అడుగుపెట్టి ఒక లోయముందు ఆగిందా యువతి. పెద్దగా చప్పట్లు చరిచి చేతుల్ని గాలిలోకి ఊపింది.

పుట్టలోనుంచి బయటకు వస్తున్న చీమల మాదిరి బిలబిలలాడుతూ కొండ గుహలలోనుంచి బయటపడిన ఆమె ప్రజలను చూశాడు గంగారాం. సరైన తిండి లభించక ప్రాణాలన్నిటినీ కళ్లల్లో పెట్టుకుని ఉన్న వారి సంతానాన్ని గమనించి ఇబ్బందిగా తల విదిలించాడు.

కుంగ్ ఫూ విద్యాపీఠాన్ని ఆవరించుకుని ఉన్న శాపం ఏమిటో అప్పుడు అర్థం అయిందతనికి. ఆ ప్రజలకు, కుంగ్‌ఫూ వస్తాదులకు ఉన్న సంబంధం కూడా అవగతమయింది.

ఆగినట్లే ఆగి మళ్లీ పరుగు ప్రారంభించిన యువతిని, ఇష్టం లేకపోయినా ఆమెను ఫాలో అవుతున్న తన స్నేహితుడిని చూసి తనలో తను నవ్వుకుంటూ వాళ్లు ఆగిన ప్రదేశంలోనే తను కూడా ఆగాడు షాడో.

చుట్టూ ఉన్న మట్టి గుట్టలను పరిశీలిస్తూండగా తాము వచ్చిన మార్గంలో అడుగులు వేస్తూ, అతి వేగంగా వచ్చేస్తున్న అషిమో ఆంతరంగికుడు అగుపించాడతనికి.

నగరంలో తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం చేయాలన్న పట్టుదలతో, పాతికమంది దృఢకాయుల్ని వెంటబెట్టుకుని వస్తున్నాడతను.

తళతళ లాడుతున్న వారి ఆయుధాల్ని, వారి భుజాలకు తగిలించి ఉన్న విల్లంబుల్నీ గమనించేసరికి వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది షాడో నోరు.

ఏదో ఒకటి చేసి వారి అటెంక్షన్‌ని డైవర్ట్ చేయకపోతే, తనతోపాటు కొండలకేసి పోతున్నవారిని కూడా చుట్టుముడతారు వాళ్లు ... ప్రాణాలు తీయటానికే ప్రయత్నిస్తారు.

బూటుకు బిగించి ఉన్న డాగర్‌ని ఎడమ చేతిలోకి తీసుకుంటూ, కూర్చున్న చోటినుంచి లేచి, ఎత్తుగా ఉన్న ఒక కొండరాయి మీదకి ఎక్కాడు షాడో. చేతుల్ని గాలిలోకి ఊపి గంగారాం మాదిరిగా వారిని ఇష్టం వచ్చిన మాటలతో నిందించాడు.

గాలి వాలున తమ చెవుల పడిన ఆ నిందావాక్యాలను ఆలకించేసరికి దారుణమైన ఆగ్రహంతో నల్లగా మాడిపోయింది అషిమో ఆంతరంగికుడి వదనం.

"పట్టుకోండి ఆ దుర్మార్గుడిని... కాళ్లూ చేతులూ కట్టేసి నా ముందుకు తీసుకురండి!" కరకరలాడుతున్న కంఠంతో దృఢకాయులకు ఆజ్ఞ ఇచ్చాడు.

ఎరను చూసిన పెద్దపులుల మాదిరి వెంటనే వేగాన్ని హెచ్చించారు వాళ్లు .... ఆయుధాల్ని గాలిలో ఊపుతూ బండల సమీపంలోకి వచ్చారు.

ఉన్నచోటనే నిలబడి వారి ఆయుధాల దెబ్బకు తల్లక్రిందులయ్యే ఆలోచన గానీ, కోరిక గానీ తనకు లేకపోవటం వల్ల, ఎత్తయిన కొండరాయి మీద నుంచి క్రిందకు దూకి, మట్టిగుట్టల మధ్యగా పరుగు అందుకున్నాడు షాడో.

పది క్షణాలు కూడా గడవకముందే పూర్తిగా నెరవేరింది అతని ఉద్దేశ్యం. కొండలకేసి పోతున్న అతని ఫ్రెండ్స్‌ని గమనించలేకపోయారు అషిమో ఆంతరంగికుడి వెంట వచ్చిన దృఢకాయులు. అతనిమీదే తమ దృష్టిని కేంద్రీకరించి క్లోజ్‌గా ఫాలో అయ్యారు.

శరీరంలో ఉన్న శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకుంటూ శిధిల గృహాలను వదిలి, అక్కడికి అరమైలు దూరంలో ఉన్న ఒక పెద్ద పర్వతం దగ్గరికి పోయాడు షాడో...

ఆ పర్వతం చుట్టూ గిరికీలు కొట్టి వెనుక వస్తున్న వారికి స్లిప్



ఇచ్చేద్దామని అనుకుంటూండగా అతని దృష్టిని ఆకర్షించింది పర్వత పైభాగంలో నిర్మించబడి వున్న ఒక శిథిల భవనం.

రెండో ఆలోచన చేయకుండా అటుకేసి మరలాడు షాడో. ఆ భవన ప్రాంగణంలోకి అడుగుపెట్టి చుట్టూ చూశాడు.

మనిషి అనేవాడు అడుగుపెట్టి అనేక వందల సంవత్సరాలు అయినట్లు అపరిశుభ్రంగా, అసహ్యం కలిగించే విధంగా ఉన్నాయి ఆ పరిసరాలు...

విశాలంగా ఉన్న రెండు గదుల్ని దాటి, భవనం మధ్యభాగంలో ఉన్న హాలువంటి మరో పెద్ద గదిలోకి అడుగుపెట్టాడతను.

గవ్వలనీ, శంఖాలనీ విచిత్రమైన పేర్లు పెట్టి ఇసుక మైదానం దగ్గరి నగరవాసులు పిలిచే వెండి బంగారాల గుట్టలతో కిక్కిరిసి ఉన్న దా గది.

చెదలు పట్టి ఎందుకు పనికి రాకుండా పోయిన కావడి పెట్టెలనిండా కనిపిస్తున్నాయి రత్న మాణిక్యాలు ... కాలానుగుణ్యంగా వచ్చిన మార్పులతో కాంతి విహీనమైన లోహపు పేటికల నిండా నింపి వున్నాయి అత్యంత విలువైన వజ్రపురాసులు.

ఆ సంపద ఎవరిదో, ఎవరికీ అగుపించకుండా అక్కడ ఎందుకు నిక్షిప్తం చేయబడిందో ఊహించటానికి ప్రయత్నిస్తూ మరో అడుగు ముందుకు వేసిన షాడో కనులకు కనిపించింది మేదో మాంసాలు హరించుకుపోయిన అస్థిపంజరం.

వెండి బంగారు గుట్టల మధ్య బాసిపట్టు వేసుకు కూర్చున్నది అది. కనులు ఉండవలసిన స్థానంలో ఏర్పడిన గుంటలతో అతనివంకే చూస్తున్నట్లుగా అనిపిస్తోంది.

"నీ ఏకాంతాన్ని డిస్టర్బ్ చేసే ఆలోచన నాకు లేదు, మై ఫ్రెండ్! రాక్షసుల మాదిరి వెంటపడిన దుర్మార్గుల్ని తప్పించుకోవటానికి ఇటుగా వచ్చాను గానీ, నీ సంపదను చూసి మురిసిపోవాలని రాలేదు!" అంటూ ఆ అస్థిపంజరం పక్కనుంచి అవతలికి జంప్ చేశాడు షాడో.

తన వెనుకగా పర్వతం మీదకి వచ్చేస్తున్న దృఢకాయులు ఆ గదిలోకి అడుగు పెట్టడం జరిగితే, అక్కడనుంచి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యరని అర్థం అయింది అతనికి. తనను గురించి, తన పగను గురించి మర్చిపోతారని కూడా తెలిసి వచ్చింది.

వెయ్యి సంవత్సరాలపాటు కష్టపడినా ఎవరూ సంపాదించలేని ఆ సంపదను చూసి వారెలా రియాక్ట్ అవుతారో చూసిన తర్వాత, తన దారిన తాను అవతలికి జారుకోవచ్చుననే కోరికతో, ఆవలి పక్కనున్న మరో గదిలోకి పోయాడతను. పట్టుకుంటే పడిపోయేటట్లున్న గోడల్ని ముట్టుకోకుండా జాగ్రత్తపడుతూ ఒదిగి నిలబడ్డాడు.

అతను ఊహించినట్లే అట్టహాసంగా ఆ గదిలోకి వచ్చి, ఆశ్చర్యానందాలతో మ్రాన్పడిపోయారు దృఢకాయులు.

"ఎవరికీ కనిపించని ఈ ఒంటరి ప్రదేశంలోని ఈ సంపద ఇక్కడే ఉంటుంది. ఎక్కడికీ పోదు. ముందు అవతలికి పోయి ఆ దుర్మార్గుడిని పట్టుకోండి... వెళ్లండి!" అందిరికంటే ముందుగా ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ ఆజ్ఞ ఇచ్చాడు అషిమో ఆంతరంగికుడు.

"మమ్మల్ని అవతలికి పంపి ఈ సొత్తునంతా నువ్వు స్వాధీనం చేసుకోవాలని ఆలోచిస్తున్నావా?" ఉన్నట్లుండి అతనికేసి తిరుగుతూ కోపంగా అడిగాడు ఒక దృఢకాయుడు.

"మీరు అడిగినన్ని శంఖాల మూటల్ని ఇచ్చి తీసుకువచ్చాను. మీకు అప్పగించిన పనిని పూర్తి చేయుటం మీ బాధ్యత!" ఉన్నట్లుండి ముంచుకు వచ్చిన కోపాన్ని అణుచుకునే ప్రయత్నం చేయకుండా గట్టిగా అరిచాడు అషిమో ఆంతరంగికుడు.

"ఈ సంపదతో నగరానికి తిరిగి వెళ్లగానే నీ శంఖాల మూటల్ని నీకు ఇచ్చేస్తాం. కావాలంటే నువ్వే వెళ్లి ఆ దుర్మార్గుడిని బంధించుకో!" అంటూ ముందుకు వంగి అక్కడి సంపదను చేతులతో తాకారు దృఢకాయులు.

అంతవరకూ ఎంతో ప్రశాంతంగా కనిపించిన అస్థిపంజరంలో పెనుమార్పు ఏదో వచ్చినట్లు అనిపించి కళ్లు నులుముకున్నాడు షాడో.

బాసిపట్టు వేసుకుని ఉన్న దాని కాళ్లు ఉన్నట్లుండి బారుగా సాగాయి. క్రిందికి వాలి ఉన్న చేతులు అమాంతం గాలిలోకి లేచాయి.

ఆ చేతుల మధ్యనుంచి నిశ్శబ్దంగా నవ్వుతూ ధనపు రాసుల మీద ప్రత్యక్షం అయింది ఒక ఆకారం!

కొండవాగు దగ్గర తన భరతం పట్టటానికి ప్రయత్నించిన భీకర ఆకారం అదేనని గుర్తించేసరికి చెమటలు పట్టేశాయి షాడో కరచరణాలు.

"పారిపోండి... పర్వతాన్ని వదిలి దూరంగా పారిపోండి!" అని తనకు తెలియకుండానే ఆ గదిలోని వారిని హెచ్చరించాడతను.

అతని హెచ్చరికల్ని వినిపించుకునే అవకాశం లభించకుండా పోయింది అక్కడివారికి.

చురకత్తుల వంటి కాలిగోళ్లతో చీల్చి చెండాడటం మొదలుపెట్టిందా ఆకారం. ఉక్కుముక్కలవంటి బాహువులతో పిండిపిండి చేసింది దృఢకాయుల శరీరాల్ని. జానెడు పొడుగు ఉన్న కోరలు కనిపించేలా వాటిని తెరిచి చెరకుగడల్ని నమిలినట్లు నమిలింది వారి మెడల్ని...

కనులు చెదిరిపోయే సంపదను కనులారా చూసిన సంతోషమంతా ఆవిరైపోతుండగా బీభత్సంగా కేకలు పెడుతూ వెనక్కి పారిపోవటానికి ప్రయత్నించారు హతమారిపోగా మిగిలిన కొందరు.

వారందరికంటే కాస్తంత వెనుకగా బయలుదేరిన అషిమో ఆంతరంగికుడి మెడను పట్టుకుని గుడ్డబొమ్మను విదిలించినట్లు విదిలించిందా ఆకారం.

పదునైన దాని గోళ్లు తన చర్మంలో దిగబడేసరికి బాధను భరించలేక చెవులు చిల్లులు పడే విధంగా అరిచాడు అషిమో ఆంతరంగికుడు.

"రక్షించండి... ఎవరైనా వచ్చి నన్ను కాపాడండి!" అంటూ ఆక్రోశించాడు.

అతని ముఖంలో ప్రతిఫలిస్తున్న భయాన్ని చూసి ఆగలేకపోయాడు షాడో. వద్దు వద్దని అనుకుంటూనే 'ఆ గదిలోకి జంప్ చేసి, అంతుకు ముందు కొండవాగు దగ్గర తన్నినట్లుగానే ఫెడీమని తన్నాడు ఆ ఆకారపు వెన్నుమీద.

చేతుల్లో చిక్కుకున్న అషిమో ఆంతరంగికుడిని వదిలిపెట్టి చటుక్కున వెనక్కి తిరిగిందా ఆకారం ... గంగాళంలా నోటిని తెరిచి అతని మీదకి ఎగిరింది.

అతి వేగంగా క్రిందికి వంగి దాని పాదాలు తన భుజాల మీద పడకుండా తప్పించుకున్నాడు షాడో... అడ్డదిడ్డంగా పడిపోయిన అషిమో ఆంతరంగికుడి చేతుల్ని గట్టిగా పట్టుకుని బరబరా ఆ గది బయటికి ఈడ్చేశాడు.

"పారిపో... ప్రాణాలు దక్కించుకుని పర్వతం క్రిందకు పారిపో!" అని అతన్ని హెచ్చరిస్తూ వెనుతిరిగి గదిలోకి తొంగి చూశాడు.

పగటి సమయాల్లో ఆ గదిని, అందులోని సంపదను వదలి ఇవతలకు రావటం అలవాటు లేదు కాబోలు, గది మధ్యలోనే ఆగిపోయిందా ఆకారం ... అతనివంకే గుర్రుగా చూస్తూ అస్థిపంజరం దగ్గరకు వెళ్లి, దానిలో ఐక్యం అయిపోవటానికి సిద్ధపడుతున్నది.



గదిలోకి అడుగుపెట్టి ఆ ధనరాసుల మీద చేయి వేయనంతవరకూ తనకు వచ్చిన ప్రమాదం ఏదీ లేదని గ్రహించి తేలికగా నిట్టూరుస్తూ అషిమో ఆంతరంగికుడివైపు తిరిగాడు షాడో.

అతను చేసిన హెచ్చరికల్ని పెడచెవిన పెట్టి అలాగే నిస్త్రాణగా పడి ఉన్నాడు ఆ పెద్దమనిషి.... కనులు మూసుకుని బరువుగా ఊపిరి పీలుస్తున్నాడు.

ముందుకు వంగి అతని బుగ్గల్ని మృదువుగా తట్టబోయాడు షాడో.

చటుక్కున కనులు తెరిచి, కార్నర్ చేయబడిన ఖడ్గమృగంలా గయ్‌మని అరిచాడు అషిమో అనుచరుడు. తన దుస్తుల్లో దాచుకుని ఉన్న పిడిబాకును బయటకు తీసి అతని గుండెల మీద పొడవబోయాడు.

కంటికి కనిపించనంత వేగంతో వెనక్కి దూకి, ఆ పోటునుంచి తప్పించుకున్నాడు షాడో. అతనికి తెలియకుండానే కదిలి బూటు పక్కన ఉన్న డాగర్‌ని అందుకున్నది దక్షిణ హస్తం. శరీరంలోని శక్తినంతా తనలోకి రప్పించుకుంటూ బలంగా ముందుకు విసిరింది.

చేతుల్ని క్రిందకు ఆనించి పైకి లేవబోతున్న అషిమో ఆంతరంగికుడి గుండెల్లో దిగబడింది డాగర్... ఎర్రటి అతని రక్తాన్ని రుచి చూస్తూ క్షణాల మీద బలిపుచ్చుకుంది ప్రాణాల్ని.

మరణించేందుకు కాస్తంత ముందుగా కూడా మంచితనం అనే పదానికి అర్థం తెలుసుకోవటానికి ప్రయత్నించని ఆ మూర్ఖశిఖామణి ముఖాన్ని చూసి జాలిగా నిట్టూరుస్తూ పైకి లేవబోతున్న షాడోకి కాస్తంత ఆలస్యంగా అర్థం అయింది ఒక విషయం.

బాకు పోటును తప్పించుకునేందుకు వెనక్కి దూకటంలో సరాసరి వచ్చి ధనరాసులున్న గది గుమ్మానికి లోపలిభాగంలో పడ్డాడతను.

అస్థిపంజరంలోకి చేరుకునే ఆలోచనను అర్ధాంతరంగా విరమించుకుని గబ్బిలం రెక్కలవంటి తన రెక్కల్ని అల్లల్లాడిస్తూ అతని మీదకి వచ్చి పడనే పడిందా భీకర ఆకారం. గుండెల మీద నిలబడి గంతులు వేయటం మొదలుపెట్టింది.

ఊపిరి ఆగిపోతున్నట్లు అనుభూతిని పొందుతూ హడావుడిగా ఆలోచించాడు షాడో.

అర్జంటుగా ఏదో ఒక ప్రయత్నం చేసి ఆ ఆకారాన్ని అవతలికి నెట్టకపోతే, తుమ్మకొమ్మల మాదిరి వికృత శబ్దాలు చేస్తూ విరిగిపోతాయి తన ఛాతీ ఎముకలు!

పళ్ల బిగువున బాధను భరిస్తూ మెదడు చింపుకోవటం మొదలెట్టిన అతని కనులకు అగుపించింది, హడావుడిగా బయటకు పరుగెత్తటంలో ఒక దృఢకాయుడు పారవేసుకున్న మంచినీటి తోలు తిత్తి.

కొండవాగులోని నీటిలో పడగానే ఎలర్జీ వచ్చినట్లు ఆ భీకర ఆకారం గాలిలోకి ఎగిరిపోవటాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ, ఎడమ చేతిని జాచి, ఆ నీటితిత్తిని స్వాధీనపరుచుకున్నాడు షాడో. ఒంటిచేత్తోనే దాని మూతికి బిగించి ఉన్న బిరడాను తొలగించి, అందులోని నీటినంతా భీకర ఆకారం మీదకి వెదజల్లాడు.

నరమానవుడు కనపడితే సర్వనాశనం చేసికానీ వెనుతిరగని ఆ క్షుద్రశక్తి వాగులో పడినప్పుడు అరచినట్లుగానే కీచుగా అరిచింది ... ఒంటినిండా పెట్రోల్ పోసి అగ్గిపుల్ల గీసినట్లు ఆందోళన చెందుతూ, అస్థిపంజరం దగ్గరకి పురుగులీసింది.

నీళ్లు జల్లి దాన్ని బెదరకొట్టడం టెంపరరీ అరేంజ్‌మెంటే గానీ, పర్మెనెంట్ సొల్యూషన్ మాత్రం కాదని షాడోకి తెలుసు.

ఇనుప సమ్మెటలు పెట్టి విరగబాదినట్లు పోటెత్తిపోతున్న ఛాతిని ఎడమచేత్తో అదుముకుంటూ, పైకి లేచాడతను.

పూనకం వచ్చిన గణాచారి చిందులు తొక్కినట్లు వైల్డ్‌గా గంతులు వేస్తూ అస్థిపంజరంలో ఐక్యం అయిపోతోంది ఆ భీకర ఆకారం... తన బలహీనతను కనిపెట్టిన మానవుడి ఎదుటినుంచి మటుమాయం కావటానికి ప్రయత్నిస్తోంది.

"నిన్ను ఇంత తేలికగా వదిలిపెట్టే ప్రసక్తి లేదు, డియర్! నీ అంతు చూసిగానీ నేను అవతలికి పోయే అవకాశం కూడా లేదు!" తనలో తాను అనుకుంటూ అస్థిపంజరం దగ్గరకి జంప్ చేసి, ఎడమ కాలిని బలంగా విసిరాడు షాడో.

ఫట్‌మని శబ్దం చేస్తూ మెడ ఎముక మీద నుండి వేరు పడిపోయింది అస్థిపంజరపు తల ... గొడ్డలితో నరికినట్లు మధ్యకు విరిగిపోయింది దాని కుడి భుజం.

ఎడమకాలు నేలను తాకగానే అమాంతంగా గాలిలోకి ఎగిరి ఇంకో కిక్‌ని డెలివర్ చేశాడు షాడో.

ఫుట్‌బాల్ గాలిలోకి లేచినట్లు గింగిరాలు తిరుగుతూ ఒక గోడ దగ్గరకి పోయింది తలను కోల్పోయిన ఆ ఎముకల పోగు. అతను చూస్తూ ఉండగానే ముక్క చెక్కలై నాలుగు పక్కలకూ చెదిరిపోయింది.

ఎందుకైనా మంచిదని, వెనక్కి దూకే మార్గాన్ని ఒకసారి గట్టిగా చూసుకుని బంగారపు గుట్టలోనుంచి నాలుగు కణికల్ని చేతుల్లోకి తీసుకున్నాడు షాడో.

అతని ఊహ యథార్థమని వెంటనే తేలిపోయింది.

ధనపు రాసులమీద మానవ హస్తం పడిన వెంటనే ప్రళయభీకర స్వరూపంతో బయటకు రావాల్సిన ఆ క్షుద్రశక్తి, తన నివాసమైన అస్థిపంజరం కకావికలు కాగానే దానితోపాటు తను కూడా నాశనమైపోయింది.

ఒకటికి రెండుసార్లు ఆ విషయాన్ని ధ్రువపరుచుకుని మెల్లగా ఆ శిథిల భవనంలోనుంచి బయటకు వచ్చాడతను. అషిమో ఆంతరంగికుడి రక్తంతో మలినమైన డాగర్‌ని శుభ్రపరుచుకుంటూ పర్వతం మీద నుంచి దిగి, తన స్నేహితుడు వెళ్లిన కొండలకేసి ప్రయాణం అయ్యాడు.

అల్లంత దూరంలో ఉండగానే షాడోని గమనించి పరుగు పరుగున ఎదురువచ్చాడు గంగారాం. అతను అడగకముందే ఆ కొండల్లో నివశిస్తున్న వారి చరిత్రనంతా గుక్కతిప్పుకోకుండా చెప్పేశాడు.

"కొండల్ని విడిచి అవతలికి పోతే కర్గూ పిశాచం కబళిస్తుందన్న భయంతో దినదిన గండం నూరేళ్ల ఆయుస్సు మాదిరి జీవిస్తున్నారు వీళ్లు. ఆ పిశాచం ఏమిటో, ఎక్కడుంటుందో తెలుసుకుని ఏదో ఒకటి చేసితీరాలి!" కుంగ్‌ఫూ విద్యాపీఠానికి, ఆ ప్రజలకు ఉన్న సంబంధాన్ని కూడా తేటతెల్లం చేస్తూ అన్నాడు.

దూరదూరంగా నిలబడి వింతగా చూస్తున్న ఆ ప్రజల్ని కనుచివరల నుంచి గమనించుకుంటూ తల ఊపాడు షాడో.

"వట్టొట్టి తల ఊపుళ్లు ఇప్పుడు పనికిరావు. ఏదో ఒకటి వెంటనే చేసి వీళ్ల బాధల్ని విరగడ చేసితీరాల్సిందే!" మరింత పట్టుదలగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు గంగారాం.

ఆ మాటలకు కూడా తల ఊపి, చదునుగా ఉన్న ఒక బండరాయి మీద కూర్చున్నాడు షాడో.

మట్టితో చేసిన ముంతతో మంచినీళ్లు తీసుకువచ్చింది నాయకుడి పెద్దకూతురు. వెదురుబుట్టవంటి చిన్న బుట్టలో రెండే రెండు అడవి దుంపల్ని తెచ్చి అతనిముందు పెట్టింది.

"రెండు రోజులపాటు సరిపెట్టుకోవలసిన ఆహారం ఇది. మీ ఆకలిని

పూర్తిగా తీర్చుకోకపోయినా, మా కోసం ఆరగించి తీరాలి!" అతని కడుపునిండా ఆహారం ఇవ్వలేకపోతున్నందుకు బాధపడుతూ చెప్పింది.

"మీ మగవాళ్లందర్నీ వేటకు బయలుదేరమని చెప్పు... మీరు భయపడే కర్గూ పిశాచం ఖతమైపోయింది. మీ రిక నిర్భయంగా కొండల్ని వదిలి అవతలికి పోవచ్చు!" మట్టి ముంతలోని నీటితో గొంతును తడుపుకుంటూ అన్నాడు షాడో.

ఆశ్చర్యం నిండిన కనులతో చూస్తున్న గంగారాంకి జరిగినదంతా వివరంగా చెప్పాడు.

కొండలన్నీ మార్మోగిపోయేటట్లు అరిచి కేకలు పెడుతూ అవతలికి పోయి, తన వారందర్నీ హెచ్చరించిందా యువతి... అందర్నీ వేటకు బయలుదేరదీసింది.

ఆమె మాదిరి సంతోషించలేదు గంగారాం. అగ్గిరాముడిలా విరుచుకుపడిపోయాడు షాడోమీద.

"నీకసలు బుద్ధి లేదు. తగుదునమ్మా అంటూ నీకు సంబంధించని విషయాల్లో వేళ్లు పెట్టడం తప్ప ఇంకో పని నీకు చేతకాదు. నీళ్లను చూస్తే భయపడి పారిపోతుందా పిశాచమని, నీ అదృష్టం బాగుండబట్టి అర్థం అయింది గానీ, అర్థం కాకపోతే ఏం జరిగి ఉండేదో ఏమైనా ఆలోచించావా? నీకు ఏమైనా జరిగితే నా ఖర్మ ఎలా కాలిపోయేదో అసలు ఊహించావా?" అంటూ నోటికి వచ్చినట్లు నిందించాడు.

ఏదో ఒకటి చేసి ఆ పిశాచాన్ని మట్టుపెట్టి తీరాలని అంతకుముందే అతను అన్న మాటల్ని గుర్తు చేయలేదు షాడో.

చిన్నగా నవ్వుతూ చీమల గూడువంటి ఒక గుహలోకి పోయి, అక్కడ


ప్రగతిపథంలో నల్లగొండ-రంగారెడ్డి సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్ లిమిటెడ్

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



శ్రీ బి. నర్సింహారెడ్డి
చైర్మన్

★ పాల ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్య లాభాపేక్షలేని వారథిగా నిలిచినది.
★ అత్యధిక పాల కొనుగోలు ధర (గేదెపాలు) కిలో వెన్న వెన్నకు రూ. 165/-మరియు ఆవుపాలు కిలో ఘన పదార్థాములకు రూ. 67/- చెల్లించుచున్నది.
★ వినియోగదారులకు నాణ్యమైన పాలు సరసమైన ధరకు అందిస్తున్నది.
★ విటమిన్ 'ఎ'తో పరిపుష్టి కావించబడిన మదర్ డెయిరీ పాలు ఆరోగ్య సోపానాలు.

"తల్లి ప్రేమకు సాటిఅయిన స్వచ్ఛత మదర్ డెయిరీ ఉత్పత్తులదే ఈ ఘనత"

"నాణ్యమైన పాలకై మీకేల చింత మదర్ డెయిరీ ఉంది మీ చెంత"

"పాలు సంపూర్ణ ఆహారం, హోమోజినైజ్డ్ కాబడిన పాలు నాణ్యతగలవి, సులభంగా జీర్ణమవుతాయి."

"మదర్ డెయిరీ అందించే హోమోజినైజ్డ్ మరియు విటమినైజ్డ్ పాలు త్రాగండి, ఆరోగ్యాన్ని పొందండి."

జనరల్ మేనేజర్
పాలకవర్గ సభ్యులు మరియు సిబ్బంది

పాలకవర్గ సభ్యులు: 1. బి.నర్సింహారెడ్డి (చైర్మన్), బోర్డు డైరెక్టర్లు : 2. బి.ఇంద్రారెడ్డి, 3. ఎ. ప్రతాపరెడ్డి, 4. బి. మహేందర్‌రెడ్డి, 5. వి. రవీందర్‌నాథ్, 6. ఎస్. రవీందర్‌రెడ్డి, 7. టి. జితేందర్‌రెడ్డి, 8. టి. రాంరెడ్డి, 9. జి. విద్యాసాగర్‌రెడ్డి, 10. సిహెచ్. వెంకటరెడ్డి, 11. వై. స్వామి, 12. ఎ. శ్రీశైలం



53వ, స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

మిత్రులకు, శ్రేయోభిలాషులకు బీడికార్మికులకు, వినియోగదారులకు ఇవే మా స్వాతంత్ర దినోత్సవ శుభా కాంక్షలు

చాట్ల నర్సయ్య రామయ్య అండ్ సన్స్
కామారెడ్డి, నిజామాబాద్.(జిల్లా)

మిత్రులకు,శ్రేయాభిలాషులకు కామారెడ్డి పట్టణ ప్రజలకు కాంగ్రేస్ నాయకులకు, కార్యకర్తలకు మరియు కౌన్సిలర్లకు ఇవే మాశుభాకాంక్షలతో మీ.....

మామిండ్ల లక్ష్మి అంజయ్య
చైర్‌పర్సన్
కామారెడ్డి మున్సిపాలిటి, జి॥ నిజామాబాద్.



మిత్రులకు, శ్రేయోభిలాషులకు బీడికార్మికులకు, ఫ్యాక్టరీ సిబ్బందికి, వినియోగదారులకు ఇవే మా స్వాతంత్ర దినోత్సవ శుభా కాంక్షలు

వాణి నవశక్తి బీడీ కంపెని
కామారెడ్డి, నిజామాబాద్ (జిల్లా)
ప్రొ॥ చాట్ల నర్సయ్య అండ్ సన్స్



పరచి ఉన్న చాపమీద మేను వాల్చాడు.

తన కేకల్ని, అరుపుల్ని అతనిక పట్టించుకోడని అర్థమై, వేటకు బయలుదేరిన వారిలో కొందరు యువకుల్ని పోగుచేశాడు గంగారాం.

"మీ కష్టాలు ఇక గట్టెక్కాయి ... తిండి తిప్పలు లేకుండా అడవి మృగాల మాదిరి కొండ గుహల్లో తల దాచుకోవాల్సిన అవసరం మీకు ఇకలేదు ... అపారమైన ధనరాసుల్ని చూపిస్తాను మీకు!" అంటూ షాడో చెప్పిన గుర్తుల్ని అనుసరించి, పర్వతాగ్రం మీది శిథిల భవంతి దగ్గరికి తీసుకుపోయాడు.

ఆడ మగ, చిన్నా, పెద్దా అందరూ కొండల్ని వదలి మైదానంలోకి పరుగెత్తిన క్షణంలో మెల్లిగా షాడో సరసకు చేరింది నాయకుడి పెద్ద కూతురు.

"నువ్వు చేస్తున్నదేమిటో అర్థం అవుతోందా?" తాచుపాముల మాదిరి తన మీదకి వస్తున్న ఆమె చేతుల్ని గమనిస్తూ అడిగాడు షాడో.

"ఆపద సమయంలో వచ్చి ఆదుకుంటానని మాట ఇచ్చిన కుంగ్‌ఫూ వస్తాదు రాకకోసం ఎదురు చూసి చూసి విసిగిపోయాము. ఎటువంటి ఆపద ఎదురైనా వెనుకా ముందూ చూసుకోకుండా ఎదురు తిరిగే మీ పద్ధతి నాకు నచ్చింది ... మీ ద్వారా నేను సంతానవతిని కావాలి ... మీ లక్షణాలతో బిడ్డను కని, నీరసులైపోయిన మా జాతికి సరి అయిన నాయకుడిని అందించాలని ఉంది!" అంటూ మిన్నాగు మాదిరి అతనిమీదకి పాకి, పెదవులతో అతని నోటిని మూసేసిందామె.

తన అభ్యంతరాలను తనలోనే దాచుకుని ఆమెను గాఢంగా గుండెకు అదుముకున్నాడు షాడో.

## ముగింపు

తను చేయలేని పనిని కుంగ్‌ఫూ పీఠానికి వారసుడిగా నిర్ణయించబడిన షాడో చేసినందుకు ఎంతగానో సంతోషిస్తూ, పరిపూర్ణమైన శాంతిని పొందింది బేలాశాన్ ఆత్మ.

నాటుపడవ మీద ఒంటరిగా ప్రపంచమంతా పర్యటిస్తూ ప్రమాదవశాత్తూ ఆ ద్వీపంలోకి అడుగుపెట్టాడతను. తిరిగి వచ్చేటప్పుడు ఎటువంటి ఆధారమూ లేకుండా వట్టి చేతులతోనే ఈదుకుంటూ వెనక్కి రావటం వల్ల ఆ ద్వీపానికి దారి మరిచిపోయాడు.

అతని మతిమరపు తనం వల్ల ఏర్పడిన దుస్థితి నుంచి ఇరవై ఎనిమిది తరాల తరువాత తప్పించుకోగలిగింది కుంగ్‌ఫూ విద్యాపీఠం.

దుర్భరమైన జీవితంలోనుంచి ఒక్కసారిగా ధనికుల హోదాకి చేరుకోగలిగారు కొండల్లో నివశిస్తున్న ప్రజలు.

వారం రోజులు పట్టింది వారికి శిథిల గృహంలోని సంపదనంతా పూర్తిగా స్వాధీనం చేసుకోవటానికి.

మట్టిగుట్టలుగా మారిపోయిన తమ పూర్వీకుల ఇళ్లను బాగుచేసుకునే ప్రయత్నాలు మొదలుపెడుతూ, స్నేహితులిద్దరికీ బ్రహ్మాండమైన రాజభవనం నిర్మించి ఇస్తామని అన్నారు వాళ్లు ... తమతో ఉండిపోయి, తమ పురోగతిలో పాలుపంచుకోమని అభ్యర్థించారు. వారి వేడికోళ్లని సున్నితంగా తిరస్కరించి, ఒకనాటి సాయంకాలం సముద్ర తీరం వైపు ప్రయాణం ప్రారంభించారు షాడో, గంగారాం.

తమ జీవితాలను అధోగతిపాలు కాకుండా కాపాడిన ఆ ఇద్దరూ ఎవరో, ఎక్కడనుంచి వచ్చారో అప్పటికీ, ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోయారా ప్రజలు.

చంపుడు పౌర్ణమినాడు కుంగ్‌ఫూ వస్తాదు తమ ప్రథమ సంతానానికి దర్శనమిస్తాడని... తమను కరుణిస్తాడని ఇంకా అనుకుంటూనే ఉన్నారు... ఎదురు చూస్తూనే ఉన్నారు.

అదవరకటిలా అమితమైన బాధతో మాత్రం కాదు.

తాము బాగుపడిపోయి హాయిగా జీవిస్తున్నామని ఆ వస్తాదుకు చెప్పి, తమ సంతోషాన్ని అతనితో పంచుకోవాలని కోరికతో ...

కుంగ్‌ఫూ వస్తాదు వచ్చి వెళ్లాడని, తమ ప్రథమ సంతానానికి దర్శనమిచ్చి కరుణించాడనీ ఎలా తెలుస్తుంది వారికి?!

సముద్ర తీరంలోని అడవిలో పొడుగాటి చెట్లను నరికి, పెద్ద తెప్ప మాదిరి తయారుచేసుకున్నారు షాడో, గంగారాం ... నీటిలోనుంచి పొడుచుకు వచ్చిన కొండరాళ్లకు తగలకుండా జాగ్రత్తపడుతూ ఆ ద్వీపాన్ని వదిలి దూరంగా వెళ్లిపోయారు.

మాస్టర్ షాడోకి నామకరణం చేయవచ్చని డిక్లేర్ చేసి జపాన్ వెళ్లిపోయాడు బిందూకు ధైర్యం చెప్పటానికి ఢిల్లీ వచ్చిన చింగ్‌లీ.

బేలాశాన్ మాదిరిగానే సముద్ర ప్రయాణం చేస్తున్న షాడో తిరిగి వచ్చేలోపల మాస్టర్ షాడోకి సరైన పేరును సెలక్ట్ చేసి ఉంచటానికి తీవ్రంగా ఆలోచిస్తూ అతని రాకకోసం ఎదురు చూస్తోంది బిందు! తన అల్లరి పనులతో బిందూను హడలగొడుతూనే ఉన్నాడు మాస్టర్ షాడో!

**(అయిపోయింది)**

